www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 8-7-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 83 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాడమాసం, శుక్లపక్షం; తిథి: తదియ పూర్తి; నక్షత్రం: పుష్యమి ఉ. 6.03 తదుపరి ఆశ్లేష; వర్జ్యం: రా. 7.49-9.33; దుర్ముహూర్తం: మ. 12.46-1.38, మ. 3.22-4.14; అమృతఘడియలు: ఉ. 6.09-7.53; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.50; సూర్యాస్తమయం: 6.49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

స్పోర్ట్స్

విజయవాడ ● సోమవారం 8 జూలై 2024

అహో..అభిషేక్



వర్షార్పణం

దక్షిణాఫ్రికాతో భారత మహిళల రెండో టీ20 రద్దు

చెన్నై: వర్షం కారణంగా భారత్, దక్షిణాఫ్రికా మహిళల రెండో టీ20 రద్దయింది. లక్ష్య ఛేదనలో భారత్ బరిలోకి దిగాల్సి ఉండగా.. ఇన్నింగ్స్ బ్రేక్ అనంతరం మొదలైన వర్షం ఎంతకీ తగ్గలేదు. దీంతో భారత్ ఒక్క బంతి కూడా ఆడలేకపోయింది. వేచిచూసిన అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. మూడు టీ20ల సిరీస్‌లో సౌతాఫ్రికా 1-0తో ఆధిక్యంలో ఉంది. మంగళవారం ఆఖరి మ్యాచ్ జరగనుంది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన సౌతాఫ్రికా 20 ఓవర్లలో 6 వికెట్లకు 177 పరుగుల భారీ స్కోరు చేసింది. ఓపెనర్ తజ్మిన్ బ్రిట్స్ (52) వరుసగా రెండో అర్ధశతకం బాదగా.. అన్నెక్ బాష్ (40), లారా వొల్వార్ట్ (22) రాణించారు. పూజా వస్త్రాకర్, దీప్తి చెరో 2 వికెట్లు తీశారు.

పవర్‌లిఫ్టింగ్‌లో సుకన్యకు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఆసియా-ఆఫ్రికా పవర్‌లిఫ్టింగ్ అంతర్జాతీయ పోటీల్లో తెలంగాణకు చెందిన తేజావత్ సుకన్య స్వర్ణ పతకం సాధించింది. దక్షిణాఫ్రికాలోని పోచెస్ట్రూమ్‌లో ఆదివారం జరిగిన మహిళల 76 కిలోల బెంచ్‌ప్రెస్ విభాగంలో సుకన్య 135 కిలోల బరువెత్తి టాప్‌లో నిలిచింది. సుకన్య స్వస్థలం మహబూబాబాద్.

ప్రియాన్షు పరాజయం

కాల్గెరీ: కెనడా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో భారత యువ షట్లర్ ప్రియాన్షు రజావత్ పోరాటం ముగిసింది. ఆదివారం జరిగిన సెమీఫైనల్లో ప్రియాన్షు 17-21, 10-21తో అలెక్స్ లానియర్ (ఫ్రాన్స్) చేతిలో ఓడాడు.

బ్రిటిష్ గ్రాండ్ ప్రీ విజేత హామిల్టన్



సిల్వర్‌స్టోన్: ఫార్ములావన్ స్టార్, మెర్సిడెస్ డ్రైవర్ లూయిస్ హామిల్టన్.. ఆదివారం జరిగిన బ్రిటిష్ గ్రాండ్ ప్రీ టోర్నీలో విజేతగా నిలిచాడు. వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్), నోరిస్ (మెక్‌లారెన్) రెండు, మూడు స్థానాల్లో నిలిచారు. 2021 తర్వాత హామిల్టన్‌కు ఇదే తొలి టైటిల్ కావడం విశేషం. 9వ సారి ఇక్కడ టైటిల్ నెగ్గిన 39 ఏళ్ల హామిల్టన్‌కిది ఓవరాల్‌గా 104వ ఎఫ్1 విజయం.

46 బంతుల్లోనే శతకం

రెండో టీ20లో భారత్ ఘనవిజయం



భారత్ తరఫున తక్కువ ఇన్నింగ్స్ (2)లోనే టీ20 శతకం సాధించిన బ్యాటర్‌గా అభిషేక్. అలాగే జింబాబ్వేపై భారత బ్యాటర్‌కిదే అత్యధిక వ్యక్తిగత స్కోరు.

1 జింబాబ్వేపై ఏ వికెట్‌కైనా అత్యధిక భాగస్వామ్యం (137) నమోదు చేసిన అభిషేక్-రుతురాజ్ జోడీ.

3 టీ20ల్లో వేగవంతమైన శతకం (46 బంతుల్లో) చేసిన మూడో భారత బ్యాటర్‌గా రాహుల్‌తో సమంగా నిలిచిన అభిషేక్. రోహిత్ (35), సూర్య (45) టాప్‌లో ఉన్నారు.

50 ఈ ఏడాది అభిషేక్ బాదిన టీ20 సిక్సర్ల సంఖ్య. రోహిత్ (46)ను దాటాడు.

1 జింబాబ్వేపై అధిక స్కోరు (234/2) సాధించిన జట్టుగా భారత్. ఆస్ట్రేలియా (229/2)ను అధిగమించింది.

అంతర్జాతీయ టీ20ల్లో చివరి పది ఓవర్లలో అత్యధిక పరుగులు (160) సాధించిన జట్టుగా భారత్.

జింబాబ్వే చిత్తు

హరారే: ఒక్క రోజులోనే ఎంత తేడా! భారత ఆటగాళ్లంతా కలిసి వంద పరుగులు చేసేందుకు ఆపసోపాలు పడిన చోటే.. రోజైనా గడవక ముందే ఒక్కడే శతకంతో చెలరేగాడు. ఎక్కడ తడబడ్డారో, అదే పిచ్‌పై మనోళ్లు రికార్డుల మోత మోగించారు. అరంగేట్ర మ్యాచ్‌లో డకౌట్ అయిన ఓపెనర్ అభిషేక్ శర్మ (47 బంతుల్లో 7 ఫోర్లు, 8 సిక్స్‌లతో 100) తన రెండో మ్యాచ్‌లోనే మెరుపు శతకంతో అదుర్స్ అనిపించుకున్నాడు. ఇక భారీ ఛేదనలో జింబాబ్వేను భారత బౌలర్లు ఆటాడుకున్నారు. దీంతో ఆదివారం జరిగిన రెండో టీ20లో టీమిండియా 100 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించి ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 1-1తో సమం చేసింది. మూడో మ్యాచ్ ఈనెల 10న జరుగుతుంది. ముందుగా భారత్ 20 ఓవర్లలో 2 వికెట్లకు 234 పరుగుల స్కోరు సాధించింది. రుతురాజ్ గైక్వాడ్ (47 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 77 నాటౌట్), రింకూ సింగ్ (22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లతో 48 నాటౌట్) అజేయ ఆటతీరుతో చివర్లో జోరును ప్రదర్శించారు. ఆ తర్వాత కష్టసాధ్యమైన ఛేదనలో జింబాబ్వే 18.4 ఓవర్లలో 134 పరుగులకు ఆలౌటైంది. భారీ ఛేదనలో వేగంగా ఆడాలనే తాపత్రయంతో వరుస విరామాల్లో వికెట్లను కోల్పోయింది. టాపార్డర్‌లో ఓపెనర్ మదెవెరె (43), బెన్నెట్ (26) రాణించగా మిడిలార్డర్ కుప్పకూలింది. ఆఖర్లో జోంగ్వే (33) జోరు చూపి ఓటమితేడాను తగ్గించగలిగాడు. అవేశ్ ఖాన్, ముకేశ్ కుమార్‌లకు మూడేసి వికెట్లు దక్కగా.. రవి బిష్ణోయ్ 2 వికెట్లు తీశాడు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అభిషేక్ నిలిచాడు.

అభిషేక్-రుతురాజ్ దూకుడు: బ్యాటింగ్‌కు అనుకూలించిన ఈ పిచ్‌పై భారత్ ఆరంభం కష్టంగానే సాగింది. కెప్టెన్ గిల్ (2) రెండో ఓవర్‌లోనే వెనుదిరగగా.. పవర్‌ప్లేలో జట్టు చేసింది 36 పరుగులే. అభిషేక్ శర్మ ఆచితూచి ఆడగా.. రుతురాజ్ తొలి 15 బంతుల్లో 9 పరుగులే చేశాడు. తొలుత ఓపిక ప్రదర్శించిన ఈ జోడీ కుదురుకున్నాక బౌలర్లకు చుక్కలు చూపించింది. అభిషేక్ 27 పరుగుల వద్ద ఉన్నప్పుడు వెల్లింగ్టన్ క్యాచ్‌ను వదిలేయడం కూడా లాభించింది. 8వ ఓవర్‌లో అభిషేక్ 4,6తో పరుగుల వేట ఆరంభమైంది. తర్వాతి ఓవర్‌లోనే రుతురాజ్ 2 ఫోర్లు సాధించగా, 11వ ఓవర్‌లో శర్మ 4,6,4,6,4తో 28రన్స్‌తో స్కోరును వంద దాటించాడు. అంతేకాకుండా 14వ ఓవర్‌లో హ్యాట్రిక్ సిక్సర్లతో అభిషేక్ 46 బంతుల్లోనే సెంచరీ పూర్తి చేశాడు. కానీ తర్వాతి బంతికే మసకద్జకు చిక్కాడు. శర్మ తన చివరి 16 బంతుల్లోనే 59 రన్స్ రాబట్టాడు. రెండో వికెట్‌కు అభిషేక్, రుతురాజ్ జోడీ 137 రన్స్ జోడించింది. అటు రుతురాజ్ 38 బంతుల్లో అర్ధ శతకం పూర్తి చేసుకున్నాడు. ఆ వెంటనే 18వ ఓవర్‌లో రుతురాజ్ 4,6,4,4తో 20 రన్స్ వచ్చాయి. రింకూ సైతం ఇదే జోరుతో 19వ ఓవర్‌లో 2 సిక్సర్లు, ఆఖరి ఓవర్‌లో 4,6,6తో అదిరే ఫినిషింగ్ ఇచ్చాడు. వీరి మధ్య మూడో వికెట్‌కు అజేయంగా 87 రన్స్ సమకూరాయి. ఓవరాల్‌గా ఆఖరి 10 ఓవర్లలోనే భారత్ 160 రన్స్ రాబట్టింది.

స్కోరుబోర్డు

భారత్: గిల్ (సి) బెన్నెట్ (బి) ముజరబాని 2; అభిషేక్ (సి) మైర్స్ (బి) మసకద్జ 100; రుతురాజ్ (నాటౌట్) 77; రింకూ (నాటౌట్) 48; **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 234/2. వికెట్ల పతనం:** 1-10, 2-147. **బౌలింగ్:** బెన్నెట్ 2-0-22-0; ముజరబాని 4-1-30-1; చటార 4-0-38-0; రజా 3-0-34-0; జోంగ్వే 4-0-53-0; మైర్స్ 1-0-28-0; మసకద్జ 2-0-29-1.

జింబాబ్వే: ఇన్నోసెంట్ (బి) ముకేశ్ 4; మదెవెరె (బి) బిష్ణోయ్ 43; బెన్నెట్ (బి) ముకేశ్ 26; మైర్స్ (సి) రింకూ (బి) అవేశ్ 0; రజా (సి) జురెల్ (బి) అవేశ్ 4; క్యాంప్‌బెల్ (సి) బిష్ణోయ్ (బి) సుందర్ 10; మదండె (ఎల్బీ) బిష్ణోయ్ 0; మసకద్జ (రనౌట్) 1; జోంగ్వే (సి) రుతురాజ్ (బి) ముకేశ్ 33; ముజరబాని (సి) సుందర్ (బి) అవేశ్ 2; చటార (నాటౌట్) 0; **ఎక్స్‌ట్రాలు: 11; మొత్తం: 18.4 ఓవర్లలో 134 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-4, 2-40, 3-41, 4-46, 5-72, 6-73, 7-76, 8-117, 9-123, 10-134. **బౌలింగ్:** ముకేశ్ 3.4-0-37-3; అభిషేక్ 3-0-36-0; అవేశ్ 3-0-15-3; రవి బిష్ణోయ్ 4-0-11-2; సుందర్ 4-0-28-1; పరాగ్ 1-0-5-0.



గోల్ కొడుతున్న స్టీఫెన్



20ఏళ్ల తర్వాత..

యూరో సెమీస్‌కు నెదర్లాండ్స్

2-1తో తుర్కియేపై గెలుపు

బెర్లిన్: సుదీర్ఘ నిరీక్షణకు నెదర్లాండ్స్ తెరదించింది. రెండు దశాబ్దాల తర్వాత యూరోపియన్ చాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్స్‌కు దూసుకెళ్లింది. శనివారం అర్ధరాత్రి జరిగిన క్వార్టర్స్ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 2-1తో తుర్కియేను ఓడించింది. 2004 తర్వాత తొలిసారి ఫైనల్ ఫోర్‌లోకి అడుగుపెట్టింది. తుర్కియే కూడా అద్భుత పోరాటాన్ని ప్రదర్శించింది. 35వ నిమిషంలోనే సమేట్ అకాడిన్ హెడర్ ద్వారా గోల్ చేసి తుర్కియేను 1-0 ఆధిక్యంలో నిలిపాడు. దీంతో కంగుతున్న డచ్ టీమ్ కౌంటర్ ఎటాక్ చేసినా ప్రత్యర్థి సమర్థంగా అడ్డుకోవడంతో ఫస్టాఫ్‌లో గోల్ చేయలేకపోయింది. అయితే, సెకండాఫ్‌లో ఆరున్నర అడుగుల పొడుగున్న స్ట్రయికర్ వవౌట్ విగోర్స్ట్ సబ్‌స్టిట్యూట్‌గా ఎంట్రీ ఇవ్వడంతో ఆరెంజ్ ఆర్మీ మరింత దూకుడుగా దాడులు చేస్తూ తుర్కియేను ఆత్మరక్షణలో నెట్టింది. ఈ క్రమంలో 70వ నిమిషంలో డిపే ఇచ్చిన క్రాస్‌ను అందుకున్న స్టీఫెన్ డి వ్రిజ్ హెడర్‌తో బంతిని గోల్‌పోస్ట్‌లోకి పంపడంతో నెదర్లాండ్స్ 1-1తో స్కోరు సమం చేసింది. 6 నిమిషాల తర్వాత ఆరెంజ్ ఆర్మీ మరో దాడిలో బంతిని అడ్డుకొనే క్రమంలో తుర్కియే ఆటగాడు మెర్ట్ ముల్డర్ కాలికి తగిలిన బంతి నేరుగా గోల్‌లోకి వెళ్లింది. ఇలా తుర్కియే ప్లేయర్ ముల్డర్ ఓన్ గోల్‌తో 2-1 ఆధిక్యం సాధించిన నెదర్లాండ్స్.. ఆ తర్వాత ప్రత్యర్థికి మరో అవకాశం ఇవ్వకుండా మ్యాచ్‌ను సొంతం చేసుకొంది.

సెమీఫైనల్ షెడ్యూల్

స్పెయిన్ × ఫ్రాన్స్ (మంగళవారం రాత్రి 12.30)

ఇంగ్లండ్ × నెదర్లాండ్స్ (బుధవారం రాత్రి 12.30)

క్వార్టర్స్‌కు అల్కారజ్

సిన్నర్, జొకోవిచ్ ముందుకు • వింబుల్డన్



అల్కారజ్

లండన్: డిఫెండింగ్ చాంపియన్ కార్లోస్ అల్కారజ్, టాప్‌సీడ్ జానిక్ సిన్నర్ వింబుల్డన్‌లో జోరు కొనసాగిస్తూ క్వార్టర్‌ఫైనల్‌కు దూసుకుపోయారు. ఆదివారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రీక్వార్టర్‌ఫైనల్లో మూడోసీడ్ అల్కారజ్ 6-3, 6-4, 1-6, 7-5తో 13వ సీడ్ యుగో హంబర్ట్ (ఫ్రాన్స్)పై, సిన్నర్ 6-2, 6-4, 7-6(9)తో 14వ సీడ్ బెన్ షెల్టన్‌పై విజయం సాధించారు. కాగా, ప్రత్యర్థి 10వ సీడ్ దిమిత్రోవ్ వాకోవర్ ఇవ్వడంతో 5వ సీడ్ మెద్వెదెవ్ క్వార్టర్స్‌లో ప్రవేశించాడు. ఇక ఏడుసార్లు చాంపియన్ నొవాక్ జొకోవిచ్ నాలుగో రౌండ్‌లో ప్రవేశించాడు. శనివారం రాత్రి జరిగిన సింగిల్స్ మూడో రౌండ్ మ్యాచ్‌లో జొకో తొలి సెట్ కోల్పోయినా ఆపై అద్భుతంగా పుంజుకున్నాడు. 4-6, 6-3, 6-4, 7-6 (3)తో ఆస్ట్రేలియా యువ ఆటగాడు అలెక్సీ పాపిరిన్‌ను చిత్తు చేశాడు. తద్వారా ఆల్ ఇంగ్లండ్ క్లబ్ నొవాక్ 15వ సారి నాలుగో రౌండ్‌లో అడుగుపెట్టాడు. సోమవారం జరిగే ప్రీక్వార్టర్స్‌లో 15వ సీడ్ హోల్గర్ రూన్‌తో అమీతుమీ తేల్చుకుంటాడు. ఇతర మూడో రౌండ్ మ్యాచుల్లో రూన్ 1-6, 6-7 (7), 6-4, 7-6 (4), 6-1తో క్వెంటిన్ హేల్స్ (ఫ్రాన్స్)పై, 13వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ 7-6 (3), 6-3, 7-5తో టబీలోపై, 25వ సీడ్ ముసేటి 6-2, 6-7 (7), 7-6 (3), 6-3తో ఫ్రాన్సిస్కోపై నెగ్గారు.

కీస్ అవుట్: మహిళల సింగిల్స్‌లో ఏడో సీడ్ జాస్మిన్ పొలిని క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టింది. రౌండ్-16 మ్యాచ్‌లో పొలిని 6-3, 6-7 (8), 5-5తో ఉన్న దశలో ప్రత్యర్థి, 12వ సీడ్ మాడిసన్ కీస్ గాయంతో వైదొలగింది. డొన్నా వెకిక్ 6-2, 1-6, 6-4తో పౌలా బడోసాపై నెగ్గి క్వార్టర్స్ చేరింది.

30 మందితో బరిలో..

ఒలింపిక్స్‌కు ట్రాక్ అండ్ ఫీల్డ్ అథ్లెట్ల జాబితా

న్యూఢిల్లీ: లాంగ్ జంపర్ జస్విన్ ఆల్‌డ్రిన్, 5000 మీటర్ల రన్నర్ అంకిత దయాని ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు. వరల్డ్ ర్యాంకింగ్ కోటా ఆధారంగా వరల్డ్ అథ్లెటిక్స్ (డబ్ల్యూఏ) ఆదివారం తాజాగా విడుదల చేసిన జాబితాలో వీరికి ఒలింపిక్స్ బెర్త్‌లు ఖరారయ్యాయి. శ్రీశంకర్ గాయపడడంతో.. జస్విన్‌కు మార్గం సుగమమైంది. దీంతో ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో బరిలోకి దిగే భారత అథ్లెట్ల సంఖ్య 30కి పెరిగింది. 5వేల మీటర్ల రేస్‌లో పారుల్ చౌదరితోపాటు అంకిత కూడా పోటీపడనుంది. ఇక, తెలుగు అథ్లెట్లలో జ్యోతి ఎర్రాజీ 100 మీటర్ల హర్డిల్స్‌లో, జ్యోతికశ్రీ 4x400 మీటర్ల రిలే బరిలో దిగనున్నారు.

ఆసియా స్క్వాష్‌లో డబుల్ ధమాకా

జోహోర్ (మలేసియా): ఆసియా డబుల్స్ స్క్వాష్ చాంపియన్‌షిప్‌లో భారత్ డబుల్ ధమాకా సాధించింది. పురుషుల డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగంలో భారత స్క్వాష్ ప్లేయర్లు టైటిళ్లు కొల్లగొట్టారు. ఆదివారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో అభయ్ సింగ్-సెంథిల్ కుమార్ జోడీ 11-4, 11-5తో ఒంగ్ సాయి హంగ్-సయఫిక్ కమల్ (మలేసియా) ద్వయాన్ని ఓడించి విజేతగా నిలిచింది. అనంతరం జరిగిన మిక్స్‌డ్ తుదిపోరులో భారత జంట అభయ్-జోష్నా చిన్నప్ప 11-8, 10-11, 11-5తో టాంగ్ వింగ్-టాంగ్ మింగ్ (హాంకాంగ్) జోడీపై నెగ్గి టైటిల్ అందుకుంది.

బిజినెస్

పన్ను రాయితీలు పెంచాలి

ఫార్మా బడ్జెట్ కోరికల చిట్టా

న్యూఢిల్లీ: ఫార్మా రంగంలో పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) కార్యకలాపాలను ప్రోత్సహించేందుకు వచ్చే కేంద్ర బడ్జెట్‌లో మరిన్ని చర్యలు తీసుకోవాలని పరిశ్రమ వర్గాలు కేంద్ర ఆర్థిక మంత్రిని కోరాయి. ఇందుకోసం చేసే పెట్టుబడులకు 200 శాతం పన్ను మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే కంపెనీలు అభివృద్ధి చేసే కొత్త ఔషధాలకు పటిష్ఠమైన మేధో సంపత్తి హక్కుల రక్షణ (ఐపీఆర్) కల్పించాలని విజ్ఞప్తి చేశాయి. కొత్త ఔషధాల అభివృద్ధిలో నష్ట భయం ఎక్కువగా ఉన్నందున ఈ రెండు చర్యలు తప్పనిసరని భారత ఔషధ ఉత్పత్తుల సంస్థ (ఓపీపీఐ) డైరెక్టర్ జనరల్ అనిల్ మతాయ్ ఆర్థిక మంత్రికి విజ్ఞప్తి చేశారు. ప్రత్యేక వైద్య సేవల్లో ఉద్యోగులకు శిక్షణ సదుపాయలు కల్పించే సంస్థలకూ పన్ను రాయితీలు కల్పించాలని సూచించారు. క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధుల చికిత్సకు అవసరమైన ప్రాణ రక్షక ఔషధాలపై జీఎస్‌టీ, దిగుమతి సుంకాలు పూర్తిగా ఎత్తివేయాలని పరిశ్రమ వర్గాలు కోరాయి

అపోలో హెల్త్‌లో రూ.103 కోట్ల విలువైన షేర్ల కొనుగోలు

అపోలో హాస్పిటల్స్

న్యూఢిల్లీ: రైట్స్ ఇష్యూ ద్వారా తమ అనుబంధ సంస్థ అపోలో హెల్త్ లైఫ్‌స్టైల్ లిమిటెడ్ (ఏహెచ్ఎల్ఎల్) ఈక్విటీలో 35,12,107 షేర్లను అపోలో హాస్పిటల్స్ ఎంటర్‌ప్రైజెస్ (ఏహెచ్ఈఎల్) కొనుగోలు చేయనుంది. ఇందుకోసం రూ.10 ముఖ విలువ ఉన్న ఒక్కో షేరుకు రూ.284 ప్రీమియం చెల్లించనుంది. ఇందుకు మొత్తం రూ.103 కోట్లు అవసరమవుతాయని పేర్కొంది. 2000లో ఏర్పాటైన ఏహెచ్ఎల్ఎల్.. ప్రత్యేక ఆస్పత్రులు, మెటర్నిటీ ఆస్పత్రులు, షుగర్, డెంటల్ క్లినిక్‌లు, వ్యాధి నిర్ధారణ కేంద్రాలు, డయాలసిస్ కేంద్రాల ద్వారా సమగ్ర వైద్య సేవలు అందిస్తోంది.

ఎఫ్‌పీఐ పెట్టుబడులు రూ.లక్ష కోట్లు

న్యూఢిల్లీ: విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ) ఈ ఏడాది ఇంతవరకు భారత ఈక్విటీ మార్కెట్లో పెట్టిన పెట్టుబడులు రూ.1.16 లక్షల కోట్లకు చేరుకున్నాయి. జూలై 5వ తేదీ నాటికి డిపాజిటరీల సమాచారం ప్రకారం ఈ నెలలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐ పెట్టుబడి రూ.7,962 కోట్లుంది. ఈ నెల చివరిలో ప్రతిపాదించనున్న కేంద్ర బడ్జెట్, త్వరలో ప్రారంభం కానున్న కార్పొరేట్ కంపెనీల త్రైమాసిక ఫలితాలు ఈ పెట్టుబడుల భవిష్యత్‌ను నిర్దేశిస్తాయని నిపుణులంటున్నారు. దేశంలో రాజకీయ స్థిరత్వం, మార్కెట్లలో ఏర్పడిన పునరుజ్జీవం ఆధారంగా జూన్‌లో కూడా ఎఫ్‌పీఐలు రూ.26,565 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. ఇది కాకుండా వారు డెట్ మార్కెట్లో రూ.6,304 కోట్లు పెట్టుబడులుగా పెట్టారు.

గ్రామీణ డిమాండ్ పుంజుకుంటోంది

ఎఫ్ఎంసీజీ కంపెనీలు

న్యూఢిల్లీ: గ్రామీణ మార్కెట్లో ఏర్పడిన పునరుజ్జీవంతో ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో తాము ఏక అంకె వృద్ధిని నమోదు చేయగలమని, మార్జిన్లు కూడా విస్తరించే ఆస్కారం ఉన్నదని ఎఫ్ఎంసీజీ కంపెనీలు అంటున్నాయి. దీనికి తోడు అర్బన్ మార్కెట్లో స్థిరత్వం కూడా సానుకూల అంశమని చెబుతున్నాయి. దేశంలో వస్తువులకు డిమాండ్ క్రమంగా మెరుగుపడుతోందని, ఇది ఆశించిన స్థాయిలోనే ఉన్నదని డాబర్, మారికో, అదానీ విల్మర్ అంటున్నాయి. "ఈ త్రైమాసికంలో ధరలు సాధారణంగా స్థిరంగా ఉన్నాయి. అయితే గతంలో అమలుపరిచిన ధరల పెంపు, వ్యయ నియంత్రణ విధానాల సహాయంతో స్థూల మార్జిన్లు పెరగవచ్చు" అని డాబర్ చెబుతోంది. ఈ ఏడాది రుతుపవనాలు సాధారణంగా ఉంటాయన్న అంచనాలతో పాటు స్థూల ఆర్థిక వృద్ధికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంతో రాబోయే రోజుల్లో గ్రామీణ డిమాండ్ మరింత పెరగవచ్చని పేర్కొంది

24,650 పైన బుల్లిష్

(జూలై 8-12 తేదీల మధ్య వారానికి)

ఆస్ట్రో ట్రెండ్



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 24,401-23,993 పాయింట్ల మధ్యన కదలాడి 313 పాయింట్ల లాభంతో 24,324 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 24,650 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20,50,100,200 రోజుల చలన సగటు స్థాయిలు 24,294, 24,191, 23,916, 23,488 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి: 24,600 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24,150

నిరోధ స్థాయిలు: 24,525, 24,625, 24,725 (24,425 పైన బుల్లిష్)

మద్దతు స్థాయిలు: 24,225, 24,125, 24,025 (24,325 దిగువన బేరిష్)

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



8వ తేదీ			
హైదరాబాద్	530	విజయవాడ	550
వరంగల్	532	గోదావరి	550
చిత్తూరు	573	విశాఖపట్నం	570
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	114	విజయవాడ	118
వరంగల్	114	గుంటూరు	118
కరీంనగర్	114	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	114	చిత్తూరు	127
కర్నూలు	114	నెల్లూరు	127
విశాఖపట్నం	114		
గోదావరి	118	అనంతపురం	118

అదానీ గ్రూప్ వ్యవహారంలో

హిండెన్‌బర్గ్ నివేదిక వెనక పెద్ద కథ

రెండు నెలల ముందే హెడ్జ్ ఫండ్ మేనేజర్ చేతికి నివేదిక: సెబీ



న్యూఢిల్లీ: అదానీ గ్రూప్‌పై పెద్దఎత్తున ఆరోపణలు చేసిన హిండెన్‌బర్గ్ రీసెర్చ్ నివేదిక పుట్టుపూర్వోత్తరాలను మార్కెట్ నియంత్రణ మండలి సెబీ తవ్వి తీస్తోంది. గత ఏడాది అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్ల దందాపై ఈ సంస్థ విడుదల చేసిన నివేదికతో.. ఆ గ్రూప్ మార్కెట్ క్యాప్ 15,000 కోట్ల డాలర్లు (సుమారు రూ.12.51 లక్షల కోట్లు) తుడిచి పెట్టుకుపోయిన సంగతి తెలిసిందే. అయితే హిండెన్‌బర్గ్ ఈ నివేదికను అధికారికంగా విడుదల చేయడానికి రెండు నెలల ముందే న్యూయార్క్ కేంద్రంగా పని చేసే మార్క్ కింగ్డన్ అనే హెడ్జ్ ఫండ్ మేనేజర్ చేతికి అందించిందని సెబీ తన షోకాజ్ నోటీసులో పేర్కొంది. ఈ ముందస్తు సమాచారం ఆధారంగా ఈ హెడ్జ్ ఫండ్ మేనేజర్.. కోటక్ మహీంద్రా బ్యాంక్ నిర్వహణలోని ఒక బ్రోకరేజీ సంస్థ ద్వారా అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీ అదానీ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్ (ఏఈఎల్) కంపెనీ షేర్లలో ముందే షార్ట్ పొజిషన్లు తీసుకుని.. నివేదిక వెలువడిన వెంటనే అమ్ముకుని లాభాలు సొమ్ము చేసుకున్నట్టు సెబీ తెలిపింది.

చైనా లింక్!

మరోవైపు హిండెన్‌బర్గ్ నివేదిక వెనక చైనా హస్తం ఉందనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హెడ్జ్ ఫండ్ మేనేజర్ మార్క్ కింగ్డన్ భార్య అన్లా చెంగ్ చైనా గూఢచారి అని గతంలో అదానీ గ్రూప్ తరఫున వాదించిన లాయర్ మహేశ్ జెఠ్మలానీ 'ఎక్స్' వేదికగా ఆరోపించారు. ఈవిడ ప్రమేయంతోనే మార్క్ కింగ్డన్, హిండెన్‌బర్గ్ ద్వారా అదానీ గ్రూప్ కంపెనీలపై నివేదిక తయారు చేయించి విడుదల చేయించినట్టు తెలిపారు. ఈ మొత్తం వ్యవహారంలో కోటక్ మహీంద్రా (ఇంటర్నేషనల్) బ్యాంక్ అనుబంధ బ్రోకరేజీ సంస్థ ఒక పావుగా మారిందని తెలిపింది.

డెరివేటివ్స్ కట్టడి కోసం కఠిన చర్యలు!

కోల్‌కతా: చిన్న మదుపరులు కొంప ముంచుతున్న డెరివేటివ్స్ కట్టడికే సెబీ నియమించిన కమిటీ మొగ్గు చూపుతున్నట్టు సమాచారం. ఇందుకోసం ఈ కమిటీ ఏడు నిర్దిష్ట ప్రతిపాదనలు చేయబోతున్నట్టు తెలుస్తోంది. వీటి ట్రేడింగ్‌ను హేతుబద్ధం చేయడం లేదా వీక్లీ ఆప్షన్లను పరిమితం చేయడం, స్ట్రైక్ ప్రైస్‌ను హేతుబద్ధం చేయడం వంటి చర్యలను సెబీ నిపుణుల కమిటీ సిఫారసు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. పొజిషన్ల పరిమితిని ఇంట్రాడేలో పర్యవేక్షించడం, లాట్ సైజులు పెంచడం, కాంట్రాక్టు తుది గడువు దగ్గరపడేటప్పుడు మార్జిన్లు పెంచడం వంటి చర్యలను కూడా సెబీ తీసుకునే అవకాశం ఉందని సమాచారం. స్వల్పకాలిక లాభాల కోసం ఇటీవల పెద్ద ఎత్తున రిటైల్ మదుపరులు ఫ్యూచర్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్ అండ్ ఓ)లో ట్రేడింగ్ చేస్తున్నారు. నష్టభయాలపై సరైన అవగాహన లేక, ఈ ట్రేడింగ్‌లో నూటికి 90 శాతం మంది నష్టపోతున్నారు. దీంతో ఈ ట్రేడింగ్ జరిపే రిటైల్ మదుపరులను కట్టడి చేయాలని సెబీ యోచిస్తోంది.

అప్రమత్తంగా ఉండటం బెటర్!

ఇన్వెస్టర్లు ఈ వారం అప్రమత్తంగా ఉండటం మంచిది. బెంచ్‌మార్క్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ సరికొత్త జీవితకాల గరిష్ఠాలకు చేరటమే ఇందుకు కారణం. రానున్న రోజుల్లో సూచీల గమనం ఎలా ఉంటుందో తెలియదు కానీ సమీప భవిష్యత్‌లో కొంత కరెక్షన్‌కు ఆస్కారం ఉంది. ఈ వారం రైల్వే, డిఫెన్స్ రంగాల షేర్లు వెలుగులోకి వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి.

స్టాక్ రికమండేషన్స్

ఐఆర్‌సీటీసీ: సుదీర్ఘకాలం అప్‌ట్రెండ్‌లో కొనసాగిన ఈ షేరు కొన్నాళ్లుగా కరెక్షన్ అవుతోంది. అయితే డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్ తగ్గటాన్ని బట్టి చూస్తే మరికొన్ని రోజుల్లోనే పుంజుకునే అవకాశం కనిపిస్తోంది. సాధారణ ప్రయాణికుల కోసం కోచ్‌లు పెంచనున్నట్లు రైల్వే శాఖ ప్రకటించటంతో ఇన్వెస్టర్లు ఈ షేరుపై ఆసక్తిని కనబరుస్తున్నారు. గత శుక్రవారం ఈ షేరు 1.98 శాతం లాభంతో రూ.1,026 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,000/1,010 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,155/1,120 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.975 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

హెచ్‌బీఎల్ పవర్: టెక్నికల్‌గా చూస్తే ఈ షేరుకు చాలా సానుకూలతలు కనిపిస్తున్నాయి. భారీ డెలివరీ, ట్రేడింగ్ వాల్యూమ్‌తో ట్రయాంగిల్ ప్యాటర్న్ బ్రేక్ అయ్యింది. గత శుక్రవారం ఈ షేరు 7.5 శాతం లాభంతో రూ.569 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.550 శ్రేణిలో ప్రవేశించి రూ.590/660 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.525 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఐఆర్ఎఫ్‌సీ: ఈ కౌంటర్‌లో ఫిబ్రవరి నుంచి కొనసాగుతున్న కన్సాలిడేషన్ ముగింపు దశకు చేరుకుంది. గత శుక్రవారం మంచి వాల్యూమ్‌తో అంతకు ముందు వారం గరిష్ఠాన్ని బ్రేక్ చేసి చివరకు 5.91 శాతం లాభంతో రూ.188.23 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.185 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.199/210 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.182 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

బీఈఎల్: ప్రభుత్వ రంగానికి చెందిన ఈ షేరు తాజాగా జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. వాల్యూమ్ కూడా పెరుగుతోంది. చివరి మూడు సెషన్లలో ప్రైస్ యాక్షన్ చాలా బాగుంది. గత శుక్రవారం ఈ షేరు 2.11 శాతం లాభంతో రూ.324 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.320 స్థాయిలో ఎంటరై రూ.345/390 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ. 314 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఎస్‌బీఐ లైఫ్: కరెక్షన్ తర్వాత ఈ షేరులో మూమెంటమ్ పెరిగింది. మళ్లీ అప్‌ట్రెండ్ మొదలైంది. పెద్దపెద్ద క్యాండిల్స్ ఫామ్ అవుతున్నాయి. పైగా నిఫ్టీతో పోలిస్తే మెరుగైన ప్రదర్శన చేస్తోంది. అప్పర్ బొలింజర్ బ్యాండ్ బ్రేక్ చేసింది. గత శుక్రవారం ఈ షేరు 1.04 శాతం లాభంతో రూ.1,529 దగ్గర క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.1,520/1,500 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.1,575/1,640 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,475 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్

niftymasterlive@gmail.com +91 98855 59709

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

కరెక్షన్‌కు చాన్స్

టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం పాజిటివ్ ట్రెండ్‌లో ప్రారంభమై కీలకమైన 24,000 కన్నా పైన నిలదొక్కుకుని మరింత అప్‌ట్రెండ్‌లో పురోగమించింది.ఆ క్రమంలో 24,400 వరకు వెళ్లి మైనర్ రియాక్షన్‌కు గురైనా వారం మొత్తం మీద 310 పాయింట్లు లాభపడి 24,320 వద్ద పటిష్ఠంగా ముగిసింది. గత ఎనిమిది వారాలుగా సాగుతున్న ర్యాలీలో 21,300 (జూన్ 4వ తేదీన ఏర్పడిన మహాపతనంలో నమోదైన ఇంట్రాడే కనిష్ఠ స్థాయి) నుంచి 3,000 పాయింట్ల మేరకు లాభపడింది. ప్రతీ ఒక్క నిరోధ స్థాయిలోనూ బలంగా నిలదొక్కుకుంటూ ఆ నిరోధాలను ఛేదించుకుంటూ అప్‌ట్రెండ్‌ను కొనసాగించింది. టెక్నికల్‌గా మార్కెట్ అప్‌ట్రెండ్‌లోనే ఉన్నప్పటికీ స్వల్పకాలిక ఇన్వెస్టర్లు ప్రస్తుత గరిష్ఠ స్థాయిల్లో అప్రమత్తంగా ఉండాలి. ర్యాలీకి దీటుగా కన్సాలిడేషన్ లేదా కరెక్షన్ ఏర్పడడం తప్పనిసరి. కాగా అదే ధోరణిని కొనసాగించిన మిడ్‌క్యాప్-100 సూచీ 1,350 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 620 పాయింట్లు లాభపడ్డాయి.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధ స్థాయి 24,410 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం, మానసిక అవధి 24,550.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్‌లో పడినా మైనర్ మద్దతు స్థాయి 24,150 వద్ద నిలదొక్కుకోవాలి. విఫలమైతే మైనర్ బలహీనతకు ఆస్కారం ఉంటుంది. ప్రధాన మద్దతు స్థాయి 23,950.

బ్యాంక్ నిఫ్టీ: గత వారం మైనర్ అప్‌ట్రెండ్ సాధించిన ఈ సూచీ 320 పాయింట్లు లాభపడి గరిష్ఠ, కనిష్ఠ స్థాయిలకు నడుమన 52,660 వద్ద ముగిసింది. గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి ఏర్పడుతోందనేందుకు ఇది సంకేతం. మరింత అప్‌ట్రెండ్ కోసం నిరోధ స్థాయి 53,100 కన్నా పైన నిలదొక్కుకోవాలి. బలహీనత ప్రదర్శించినట్టయితే 52,300, 51,900 వద్ద గట్టి మద్దతు స్థాయిలున్నాయి.

పాటర్న్: మార్కెట్లో ఓవర్‌బాట్ స్థితి కొనసాగుతోంది. అప్రమత్తంగా ఉండాలి. రియాక్షన్‌లో పడి 24,150 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే స్వల్పకాలిక బలహీనతకు ఆస్కారం ఉంటుంది.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,410, 24,470
మద్దతు	24,250, 24,190

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 8-7-2024
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

ఏటా 2 ఇంజెక్షన్లతో ఎయిడ్స్‌కు చెక్



గిలియడ్ సైన్సెస్ అభివృద్ధి చేసిన లెనాకాపవిర్‌పై సౌతాఫ్రికా, ఉగాండాలో ట్రయల్స్.. సక్సెస్

ఈ ఇంజెక్షన్ తీసుకున్న 2134 మందీ సురక్షితం

మాత్రలు తీసుకున్న 55 మందికి సోకిన వైరస్

9

ఎన్‌హెచ్65పై ట్రామా కేర్ సెంటర్

హైదరాబాద్-విజయవాడ హైవే మీద కొర్లపాడు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు

10 పడకలు.. అత్యాధునిక వసతులతో.. నేడు శంకుస్థాపన

ఈ రోడ్డుపై నెలకు 30-40 మరణాలు

10

పోలవరం పాపం ఖరీదు 20,000 కోట్లు!

జగన్ సర్కారు అరాచకం, మేఘా అలసత్వమే కారణం

- అధికారంలోకి రాగానే నిర్మాణ పనుల ఆపివేత
- నవయుగను మార్చి మేఘాకు కాంట్రాక్టు అప్పగింత
- సకాలంలో పనులు చేపట్టకపోవడంతో భారీ నష్టం
- భారీ వరదలకు దెబ్బతిన్న డయాఫ్రమ్‌వాల్
- కాఫర్ డ్యామ్‌లకు సీపేజీ, కూలిన గైడ్ బండ్
- రూ.1,771 కోట్లతో పూర్తికావాల్సిన ప్రాజెక్టు పడక
- మరో ఐదేళ్లయినా పూర్తి కావడం కష్టమే
- మరోవైపు భారీగా పెరిగిన నిర్మాణ వ్యయం
- కేంద్ర ప్రాథమిక అంచనా రూ.15,511 కోట్లు
- 20 వేలకోట్లు అవుతుందని నిపుణుల అంచనా

ఏపీ జీవనాడికి జగన్ గ్రహణం



జగన్ సర్కారు కాంట్రాక్ట్ సంస్థను మార్చకుండా యథాతథంగా పనులు కొనసాగించినట్టయితే రూ.1,771 కోట్లతో ఈపాటికి ఎప్పుడో పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యేది. కానీ ఆ క్రెడిట్ చంద్రబాబుకు దక్కుతుందనే అక్కసుతో అధికారంలోకి రాగానే పనులు ఆపేసింది. గిన్నిస్ రికార్డు ఉన్న నవయుగ సంస్థను తప్పించి, రివర్స్ టెండరింగ్ పేరిట మేఘా సంస్థకు కాంట్రాక్టు అప్పగించింది. జగన్ అడ్డగోలు నిర్ణయాలు, మేఘా అలసత్వం కారణంగా పోలవరం ప్రాజెక్టు విధ్వంసమైంది. మేఘా సకాలంలో పనులు చేపట్టకపోవడంతో వరదలకు డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. గైడ్ బండ్ కూలింది. ఫలితంగా ప్రాజెక్టు ఎప్పుడు పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి. ప్రాజెక్టు పూర్తి చేయడానికి కేంద్ర ప్రాథమిక అంచనా ప్రకారం రూ.15,511 కోట్లు కావాలి. వాస్తవానికి 20 వేల కోట్లు అవుతుందని నిపుణుల అంచనా. జగన్ సర్కారు తప్పిదాలతో వేల కోట్లు భారం పడటమే గాక ఏళ్ల కొద్దీ సమయం వృథా అవుతోంది.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అటు బందరు పోర్టును బలి చేశారు. రాష్ట్రానికి జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును ముంచేశారు. నవ్యాంధ్రకు కీలకమైన ఈ రెండు ప్రాజెక్టులు నాశనం కావడానికి కారకుల్లో.. ఒకటి జగన్ సర్కారు అయితే, రెండోది కాంట్రాక్టు సంస్థ మేఘా. టీడీపీ ప్రభుత్వంలో సవ్యంగా సాగుతున్న బందరు పోర్టు, పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులను జగన్ సర్కారు రాగానే నిలిపేసింది. అప్పటి వరకు రెండింటి నిర్మాణ పనులను చేస్తున్న నవయుగ సంస్థను తొలగించింది. టీడీపీ ప్రభుత్వంపై రాజకీయ కక్షసాధింపులతో రివర్స్ టెండరింగ్ పేరుతో డ్రామాలు ఆడింది. అడ్డగోలు విధానాలతో బందరు పోర్టుతో పాటు

మిగతా 7వ పేజీలో...



ఎమ్మెల్యే పదవికి జగన్ రాజీనామా?

- అవినాశ్‌రెడ్డితో రాజీనామా చేయించి కడప ఎంపీగా పోటీ చేసే యోచన!
- పులివెందుల నుంచి విజయలక్ష్మి లేదా సతీమణి భారతిలను దింపే ఆలోచన
- విపక్ష హోదా లేకపోవడంతో రాజకీయ భవిష్యత్తుపై మాజీ సీఎంకు ఆందోళన
- చంద్రబాబును ఎదుర్కోలేమనే ఆవేదన
- ఢిల్లీలో ఉంటే 'కేసుల' మేనేజ్‌కూ చాన్స్
- వైఎస్ జయంతి సందర్భంగా నేడు ప్రకటన?
- సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం
- నిర్ధారించని వైసీపీ సీనియర్ నాయకులు

అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): తాజాగా జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఘోర పరాజయం చవిచూసిన వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి సంచలన నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తున్నారా? కేవలం 11 స్థానాలకు మాత్రమే పరిమితమైన నేపథ్యంలో విపక్ష హోదా కూడా దక్కకపోవడంతో.. వచ్చే ఐదేళ్ల కూటమి సర్కారును, ముఖ్యంగా సీఎం చంద్రబాబును ఎదిరించి నిలవలేనని ఆయన ఓ నిర్ణయానికి వచ్చారా? అంటే ఔననే అంటున్నారు పరిశీలకులు. ఈ క్రమంలో పులివెందుల ఎమ్మెల్యే స్థానానికి జగన్ రాజీనామా చేస్తారని, అదేవిధంగా తన సోదరుడు, కడప

మిగతా 11వ పేజీలో...

ఇక ఇసుక ఉచితం

నేటి నుంచే కొత్త విధానం అమల్లోకి

- మార్గదర్శకాల విడుదలకు సర్వం సిద్ధం.. ప్రతి ఒక్కరికీ గృహనిర్మాణాలకు ఉచితం
- కాంట్రాక్టు నుంచి వైదొలగనున్న ప్రతిమ, జేసీకేసీ.. గనుల శాఖకు రీచ్‌లు, డంప్‌లు అప్పగింత.. డిపోల్లో 44.50 లక్షల టన్నుల ఇసుక రెడీ



(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఐదేళ్లుగా రాష్ట్ర ప్రజలు ఎదుర్కొంటున్న ఇసుక కష్టాలు ఇక ఉండవు. అన్ని వర్గాల ప్రజలకూ ఇసుక ఉచితంగా అందుబాటులోకి రానుంది. తెలుగుదేశం కూటమి సర్కారు ప్రకటించిన ఉచిత ఇసుక విధానం సోమవారం నుంచి అమల్లోకి రానుంది. ప్రభుత్వం అధికారికంగా ఈ మేరకు ఉచిత ఇసుక పాలసీని ప్రకటించనుంది. దాని అమలుకు ఉత్తర్వులతో కూడిన మార్గదర్శకాలు వెలువరించనుంది. ఇందుకు సంబంధించిన విధివిధానాలను గనుల శాఖ సర్వం సిద్ధం చేసింది. జగన్ సర్కారు తీసుకొచ్చిన నూతన ఇసుక పాలసీ-2020 స్థానంలో కూటమి ప్రభుత్వం కొత్తగా నూతన ఇసుక పాలసీ-2024ను ప్రకటించనుంది. ఈ పాలసీ ఏకైక లక్ష్యం.. కులం, మతం, వర్గం తారతమ్యం లేకుండా ప్రతి ఒక్కరికీ గృహనిర్మాణం కోసం ఉచితంగా ఇసుక అందించడమే. ఉచితంగా అందించే క్రమంలో ప్రభుత్వం ఇకపై సీనరేజీ ఫీజులు వసూలు చేయదు. గత తెలుగుదేశం ప్రభుత్వంలో 2016-19 వరకు

మిగతా 10వ పేజీలో...

కృష్ణమ్మ ఒడిలోకి గోదారమ్మ

ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద కృష్ణానదిలో కలిసిన గోదావరి నీరు

నేడు పవిత్ర సంగమం వద్ద మంత్రి నిమ్మల పూజలు

11

ఆ భూతాన్ని భూస్థాపితం చేస్తాం



హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్ వద్ద కార్యకర్తలకు చంద్రబాబు అభివాదం

పెట్టుబడిదారులకు భరోసా ఇస్తున్నా: చంద్రబాబు

- ప్రజాస్వామ్యంలో నియంతృత్వ పోకడలు ప్రమాదం
- భూమ్మీదే నడవాలని మా మంత్రులకూ సూచించా
- ఏపీ, తెలంగాణ.. నాకు రెండు కళ్లు
- తెలుగు జాతి ప్రయోజనాల పరిరక్షణే లక్ష్యం
- పునర్జన్మ ఉంటే తెలుగు గడ్డపైనే పుట్టాలని భగవంతుడిని కోరుకుంటా: చంద్రబాబు
- సీఎం అయ్యాక తొలిసారి ఎన్టీఆర్ భవన్‌కు
- హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించిన నేతలు

ఏపీలో వచ్చిన సునామీలో ఓ సైకో కొట్టుకుపోయాడు. పెట్టుబడిదారులను ఆహ్వానిస్తుంటే మీపై నమ్మకం ఉంది కానీ.. ఆ భూతం మళ్లీ వస్తే పరిస్థితి ఏంటని అడుగుతున్నారు.. అలాంటివారికి నేను భరోసా ఇస్తున్నా.. ఆ భూతాన్ని భూస్థాపితం చేస్తాం.

- చంద్రబాబు


హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): తెలుగు రాష్ట్రాలు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తనకు రెండు కళ్లని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. తెలుగు జాతి ప్రయోజనాల పరిరక్షణే తన లక్ష్యమని, ఇరు రాష్ట్రాల మధ్య చర్చల ద్వారానే విభజన సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన

మిగతా 11వ పేజీలో...

సంక్షోభంలో ఇంధనం

జగన్ అడ్డగోలు నిర్ణయాలతో జనానికి షాక్!

విద్యుత్ రంగంపై రూ. 1,38,000 కోట్ల భారం



- ప్రజలపై బాదుడు.. ఇటు ఇష్టారీతిన రుణాలు
- మరోవైపు భారీ ధరలకు విద్యుత్ కొనుగోళ్లు
- అదానీ, షిర్డీసాయికి మేళ్లు చేసేలా నిర్ణయాలు
- స్మార్ట్ మీటర్లు, పంప్డ్ స్టోరేజీ అప్పగింత
- చివరికి విద్యుత్ సంస్థలు అప్పుల ఊబిలోకి
- ఇంకా జనం మెడపై 17,137 కోట్ల 'ట్రూఅప్' కత్తి
- నేడు సీఎం చంద్రబాబు శ్వేతపత్రం విడుదల

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ఐదేళ్లుగా జగన్ సర్కారు అస్తవ్యస్త విధానాల కారణంగా ఇంధన రంగం తీవ్ర సంక్షోభంలో పడింది. జనంపై భారం మోపుతూ.. అస్మదీయ కంపెనీలకు మేలు చేస్తూ దివాలా తీసేలా చేశారు. జగన్ సర్కారు తప్పిదాల కారణంగా ఇంధన రంగం ఏకంగా రూ.1,38,000 కోట్ల అప్పుల్లో కూరుకుపోయింది. అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలో కంటే రెట్టింపు ధరలకు ఎడాపెడా విద్యుత్ కొనుగోళ్లు చేశారు. వినియోగదారులపై భారం పడేలా ట్రూఅప్ పేరిట భారీగా విద్యుత్ చార్జీలను పెంచేశారు. అదేసమయంలో అదానీ, షిర్డీసాయి వంటి అస్మదీయ కంపెనీలకు లబ్ధిచేకూర్చేలా అడ్డగోలు నిర్ణయాలు తీసుకున్నారు. తాడేపల్లి ఆదేశాల మేరకు ప్రణాళికా లోపంతో

మిగతా 11వ పేజీలో...



అదానీ కోసం దోచిపెట్టారు

జనంపైనే స్మార్ట్ మీటర్ల భారం

- 24.4 లక్షల గృహాలపై రూ.73 కోట్లు.. 9.2 లక్షల పారిశ్రామిక మీటర్లపై 456 కోట్లు.. మొత్తం రూ.529 కోట్ల దోపిడీ
- వ్యవసాయ పంపుసెట్ల మీటర్లు షిర్డీసాయికి
- అదానీకేమో పట్టణ స్మార్ట్ మీటర్లు.. ధరకు మించి వసూలుకు సిద్ధం
- ఈ దోపిడీపై సీఎం దృష్టిపెట్టాలని విద్యుత్ నిపుణుల డిమాండ్

11

గృహాలు, వ్యవసాయ పంపు సెట్లకు మీటర్లను బిగించడంపై రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున నిరసనలు వ్యక్తమైనా జగన్ సర్కారు పట్టించుకోలేదు. అదానీకి జనం సొమ్మును దోచిపెట్టేందుకు పెద్ద స్కెచ్ వేసింది. పట్టణ ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్ల బిగింపు వ్యవహారంలో ఆ సంస్థకు రూ.529 కోట్లను దోచిపెట్టేందుకు సిద్ధమైంది. ఆ మొత్తాన్ని జనం నుంచే వసూలుచేసి ఇవ్వడానికి డిస్కంలు పూనుకున్నాయి.

పాంగాంగ్ సరస్సు వద్ద చైనా తవ్వకాలు

- భారీగా భూగర్భ బంకర్ల నిర్మాణం
- వాటిలో ఆయుధాలు, ఇంధనం నిల్వ
- సాయుధ వాహనాలకు షెల్టర్లు
- ఉపగ్రహ చిత్రాలతో వెలుగులోకి

మోదీ ప్రభుత్వం కళ్లకు గంతలు కట్టుకుంది: ఖర్గే

9


చార్‌ధామ్ యాత్ర తాత్కాలిక నిలిపివేత

భారీ వర్షాల నేపథ్యంలో నిర్ణయం

సీఎం సార్‌కు సారీ చెప్పాలి!

బాబు ఇంటి చుట్టూ నిఘా మాజీ చీఫ్ ప్రదక్షిణ

- ఆంజనేయులుకు సీఎం అపాయింట్మెంట్ లేదన్న అధికారులు
- హైదరాబాద్‌లో గేటు వద్దే పీఎస్ఆర్‌ను అడ్డుకున్న సెక్యూరిటీ
- పోలీస్ బాస్ అవ్వాలని గత ప్రభుత్వంలో అడ్డగోలు పనులు
- వీఆర్ఎస్‌కు అనుమతిస్తే వెళ్లిపోయేందుకు ఇప్పుడు పాట్లు



అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఏమి చేసైనా జగన్ కళ్లలో ఆనందం చూడాలి... ఎలాగైనా పోలీస్ బాస్ పోస్టు సాధించాలి! ఇలాంటి లక్ష్యంతో ఐదేళ్లపాటు చేయకూడని పనులన్నీ నిఘా విభాగం మాజీ చీఫ్ చేశారు. ఇప్పుడు ఆయన పడుతున్న పాట్లు పోలీసుశాఖలో చర్చనీయాంశమయ్యాయి. మాజీ సీఎం జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో ప్రత్యేకంగా ఒక గదిలో కూర్చుని నిన్నటిదాకా రాజకీయ సమస్యలు పరిష్కరించిన పీఎస్ఆర్ ఆంజనేయులు, ప్రభుత్వం మారడంతో హైదరాబాద్‌లోని ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి చుట్టూ ఇప్పుడు ప్రదక్షిణ చేస్తున్నారు. రాష్ట్ర పోలీసు శాఖనే తన గుప్పిట్లో పెట్టుకుని డీజీపీగా అధికారం చెలాయించాలని చూసిన సీనియర్ ఐపీఎస్ అధికారి.... రెండేళ్ల సర్వీసు ఉండగానే వీఆర్ఎస్ తీసుకోవడానికి సిద్ధమైనట్లు ఉన్నతస్థాయి వర్గాల్లో చర్చ జరుగుతోంది. జిల్లాల్లో ఎస్పీగా ఎన్‌కౌంటర్లతో ఒక వెలుగు వెలిగారు. విజయవాడ పోలీస్ కమిషనర్‌గా మహిళా వైద్యురాలితో జరిపిన ఫోను సంభాషణతో అభాసుపాలై రాష్ట్రం వదిలి కేంద్ర సర్వీసులకు వెళ్లిపోయారు. 2019లో ఏపీలో

మిగతా 7వ పేజీలో...



నేడు వైఎస్ జయంతి

మంగళగిరిలో షర్మిల ఆధ్వర్యాన కార్యక్రమం

హాజరుకానున్న తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి

ఉదయం ఇడుపులపాయలో ఏకకాలంలో జగన్, షర్మిల నివాళి!

10

సిమెంట్ ఫ్యాక్టరీలో పేలిన బాయిలర్

- వేడి మిశ్రమం పడి ఓ కార్మికుడి దుర్మరణం
- 15 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- ఎన్టీఆర్ జిల్లా అల్ట్రాటెక్ ఫ్యాక్టరీలో దుర్ఘటన



కర్మాగారంలో బాయిలర్ పేలిన ప్రాంతం

7



పూరీ రథయాత్రలో పాల్గొన్న అశేష జనం

పూరీ రథయాత్రలో తొక్కిసలాట

ఒక భక్తుడి మృతి.. ఐదుగురికి తీవ్ర గాయాలు

9

- డీహైడ్రేషన్, శ్వాస సమస్యలతో 300 మంది ఆసుపత్రిలో చేరిక
- బలభద్రుడి రథం లాగుతుండగా ఘటన.. వేడుకలకు హాజరైన రాష్ట్రపతి ముర్ము
- తొలిరోజు యాత్ర పూర్తి.. నేడు కొనసాగింపు.. 53 ఏళ్ల తర్వాత 2 రోజులపాటు

వివిధ

బొమ్మలు: అక్బర్

బుక్ బ్రహ్మ ఫెస్టివల్

2500 ఏళ్ళ సుదీర్ఘ చరిత్రగల దక్షిణ భారతీయ భాషల (తెలుగు, కన్నడ, తమిళ, మలయాళం) ఘన వారసత్వాన్ని, ప్రపంచ సాహిత్య సంస్కృతిపై వాటి ప్రభావాన్ని చాటేందుకు, దక్షిణ భారతీయ భాషల రచయితలు, ప్రచురణకర్తలందరినీ ఒకే వేదిక మీదకు తెచ్చేందుకు 'బుక్ బ్రహ్మ లిటరేచర్ ఫెస్టివల్ - 2024' జరుగుతున్నది. 'ఆంధ్రజ్యోతి' పత్రిక మీడియా భాగస్వామిగా ఉన్న ఈ కార్యక్రమం ఆగస్ట్ 9 నుంచి 11 దాకా సెయింట్ జాన్స్ ఆడిటోరియం, కోరమంగల, బెంగళూరులో జరుగుతుంది. కె. సచ్చిదానందన్, జెయమోహన్, పెరుమాళ్ మురుగన్, కె. శివారెడ్డి, వివేక్ శాన్‌భాగ్, ఓల్గా, వసుదేంద్ర, గిరిష్ కాసరవల్లి, వాడ్రేవు చినవీరభద్రుడు, అక్కినేని కుటుంబరావు, ప్రకాష్ రాజ్, సి. మృణాళిని, జూపాక సుభద్ర, ఎమ్.ఎమ్. వినోదిని, కాత్యాయనీ విద్మహే, సన్నపురెడ్డి వెంకట్రామిరెడ్డి, మహమ్మద్ ఖదీర్ బాబు, మల్లిపురం జగదీష్, వేంపల్లె షరీఫ్, ఉణుదుర్తి సుధాకర్, కె.ఎన్. మల్లీశ్వరి, కుప్పిలి పద్మ, వివిన మూర్తి, పూర్ణిమ తమ్మిరెడ్డి, మానస ఎండ్లూరి, రమేష్ కార్తీక్ నాయక్... ఇంకా అనేకమంది దక్షిణ భారత భాషల ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. కార్యక్రమంలో సాహిత్యకారుల సమావేశాలతోపాటు ప్రచురణ కర్తల సమావేశాలు, సాంస్కృతిక కళా ప్రదర్శనలు ఉంటాయి. ఈ ఉత్సవంలో పాల్గొనదలచిన వారు www.bookbrahmalitfest.com వెబ్‌సైట్‌కు వెళ్ళి మీ పేర్లను ఉచితంగా రిజిస్టర్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకున్న డెలిగేట్స్‌కు ఎంట్రీపాస్ లభిస్తుంది. వారికి మాత్రమే ఫెస్టివల్ గ్రౌండ్స్‌లో ప్రవేశం ఉంటుంది.

ఔషధం వంటి గుణమున్న మనిషి

ఎప్పుడు ఫోన్ చేసినా "ఎవురూ.. షరీఫా.. ఏం నాయనా.. బావుండావా.. భార్యా పిల్లోల్లు.. బావుండారు గదా.." అంటారు కేతు గారు. ఆయన ఆత్మీయ పలకరింపులు ఆయనతో స్నేహం చేసిన ఎవరికైనా అంత సులువుగా మరుపుకు రావు.

"ఈ ముండాకొడుకులు సాహిత్య రంగాన్ని గబ్బు పట్టిచ్చాండారు నాయనా.. నువ్వేమి పట్టించుకోగాకు, నీ పని నువ్వు జేసుకో.. రాసుకుంటా పోతా ఉండు... ఏమి మాట్లాడేదానికి కాలం గాదు.." అని ఆయన ఆవేదనతో చేసిన సూచనలు ఇంకా నన్ను కలవరపెడుతూనే ఉన్నాయి.

ఎప్పుడో 2011లో 'జుమ్మా' కథల పుస్తకం వేసుకుంటున్నప్పుడు ముందుమాట కోసం హైదరాబాద్‌లోని సంజీవరెడ్డినగర్‌లో ఉండే ఆయన్ని వెతుక్కుంటూ వెళ్లి కలిశాను. అంతకుముందు ఆయన కథలతో పరిచయం కానీ ఆయనతో కాదు. కథలు ఒక దమ్ముతో రాసేవాళ్లను కలవాలంటే నాకు భయం. వాళ్లముందు తేలిపోయే ముఖం పెట్టుకుని ఎక్కడ కూర్చునేది? ఇక అప్పుడంటే తప్పదు కాబట్టి, అవసరం నాది కాబట్టి వెళ్లి కలిశాను. చక్కగా డిటిపి చేసిన కథల ప్రతిని ఆయనకిచ్చి వచ్చేశాను.

మళ్లీ ఆర్నెల్లకు ఆయనింటి ముందుకెళ్లి నసిగితే అప్పుడు ఆయన "నాకు రాసే ఓపిక లేకుండా పోతాండాది నాయనా. సెప్తాంటే రాసుకుంటావా?" అన్నారు. ఇదే భాగ్యం అనుకుని పెన్నూ, పేపర్ అడిగి తీసుకున్నాను. నన్ను తీసుకెళ్లి ఆయన బెడ్ రూము పక్కనున్న వరండాలో కుర్చీ వేసి కూర్చోబెట్టారు. ఒక పక్కన ఆయన కూడా కూర్చోని సిగరెట్టు వెలిగించారు. అప్పుడప్పుడు కాగితంలో నా కథల పక్కన రాసుకున్న నోట్సు చూసుకుంటూ చెప్పడం మొదలుపెట్టారు. ఒక గంటన్నర తర్వాత "పిల్లోల్లు నాయనా మీరు.. ఇంకా చెబితే పాడైపోతారు.. సాల్లే.." అని ముసిముసిగా నవ్వుతూ ముగించారు. "అప్పటికే ఎక్కువ చెప్పేశారు సార్" అని నేను నవ్వుతూనే చెప్పి అక్కడి నుంచి వచ్చేశాను. ఈ కాలం కుర్రాళ్ల ప్రతిభను ఏ కొద్దిగా కూడా అతిశయోక్తి లేకుండా ఎంత మెచ్చుకోవాలో అంత మాత్రమే మెచ్చుకుని మేలు చేసే ఔషధం వంటి గుణం ఆయనది.



నా కథల పుస్తకానికి ఒకింత గుర్తింపు రావడం మొదలయ్యాక నేను ఆయన్ని తరచూ కలవడం మొదలుపెట్టాను. వెళ్లినప్పుడల్లా నా పుస్తకానికి సంబంధించిన సంగతులు చెప్పేవాణ్ని. ఆయన కూడా తనకు తెలిసిన మిత్రులకు పుస్తకం పంపారు. నా కథలను ఇంగ్లీషులోకి అనువాదం చేసిన దాసు కృష్ణమూర్తి గారు ఆయన ద్వారా పరిచయమైన వారే. ఇలా ఇంకొకరికి పరిచయం చేసేంత ప్రేమ నా కథల మీద ఆయనకుందని నేరుగా ఎప్పుడూ చెప్పలేదు. తనకు నచ్చిన పని మౌనంగా చేసుకుపోతారని, నచ్చిన సాహిత్యాన్ని కూడా అంతే మౌనంగా ప్రచారం చేస్తారని తర్వాత నాకు అర్థమైంది.

ఆయనకెప్పుడూ నా ఉద్యోగ జీవితానికి సంబంధించిన బెంగ ఉండేది. జర్నలిజంలో పిహెచ్‌డి చేస్తున్నానని చెబితే సంతోషించి అంబేద్కర్ యూనివర్సిటీలో ఆయన సంపాదకత్వం వహించిన ప్రచార, ప్రసార మాధ్యమాల పుస్తకాల సెట్టును బహూకరించారు. "కతలు అన్నం పెట్టవని ఈ కీర్తికి బానిస కావొద్దని" ఆయన పదే పదే చెప్పే మాటలు నన్ను నిత్యం వెంటాడుతూనే ఉన్నాయి.

మాటల సందర్భంలో ఒకసారి ఆయనకు 'మటన్ ఖీమా' ఇష్టమని తెలిసి తీసుకెళ్తే ఆ ఖీమా డబ్బులకు తోడు బోనస్‌గా పిల్లలకు చాక్లెట్ ప్యాకెట్ తీసుకోకుండా వెనక్కి రాలేకపోయాను. ఎదుటివాళ్ల అభిమానాన్ని ఎప్పుడూ తన వ్యక్తిగత అవసరాలకు వాడుకోవాలని ఆలోచించని ఉత్తముడు ఆయన.

హైదరాబాద్ వంటి నగరంలో ఎవరికి ఎవరూ కారు. ఒకర్నొకరు నిత్యం కలుసుకోవడం సాధ్యం కాదు. కాకపోతే మనకు తెలిసిన ఫలాన వ్యక్తి ఒకరు ఈ నగరంలోనే ఎక్కడో ఒక చోట ఉంటున్నారంటే అదో తెలీని భరోసా. ఆ భరోసాకు దెబ్బ తగిలింది. హైదరాబాద్ వదిలేసి ఆయన సొంత ప్రాంతం కడప చేరారు. అది నాకు కొంత వెలితిగా అనిపించినా.. ఇక నాదీ కడప ప్రాంతమే కాబట్టి.. ఊరెళ్లినప్పుడల్లా కలిసేవాణ్ని. కడప కేంద్రంగా ఆయన సాహితీ సేద్యం మొదలుపెట్టారు. అడపాదడపా సిపి బ్రౌన్ కార్యక్రమాల్లోనూ, యూనివర్సిటీ వ్యవహారాల్లోనూ పాల్గొనేవారు. కొన్ని కార్యక్రమాలకు నేనూ హాజరయ్యేవాణ్ని. కనిపించినప్పుడల్లా ఆప్యాయంగా పలకరించి పక్కన కూర్చోబెట్టుకుంటారు కానీ ఏమీ మాట్లాడరు. మాట్లాడకుండా పక్కన కూర్చోని ఉండటం నాకు ఇబ్బందే అయినా ఆయన అభిమానం చూపించే తీరే.. ఇలా ఉంటుందని గ్రహించి మౌనంగా ఉండిపోయేవాణ్ని.

కడపలో రెండేళ్ల కిందట 'రాయలసీమ కథా కార్యశాల' పెట్టినప్పుడు చివరిసారిగా కలిశాను. ఆ కార్యక్రమం పోస్టర్లు ఆయనే ఆవిష్కరించారు. తగిన సలహాలు ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై 'రాయలసీమ యువత ఎక్కువగా సాహిత్యంలోకి రావాలని, సమాజంలో ప్రతిపక్షపాత్ర పోషించాలని' మాట్లాడారు. రెండు రోజుల శిక్షణా కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు.

నాలుగు నెలల తర్వాత కడపలో శాంతి నారాయణ గారి 'సాధన' నవల పరిచయ సభలో ఆయన మాట్లాడాల్సి ఉంది. నేనూ వక్తనే కాబట్టి కడప వెళ్లాను. కానీ కేతు గారు రావడం లేదని ఆయన సతీమణికి ఆరోగ్యం బాగాలేక కూతురి దగ్గరికి ఒంగోలు వెళ్తున్నారని తెలిసింది. సాధన నవల పరిచయ సభను ముగించుకుని మరుసటి రోజు ఉదయానే ప్రస్తుతం నేను నివాసం ఉంటున్న ఊరు విజయవాడ చేరుకున్నానో లేదో జీర్ణించుకోలేని వార్తను పాలగిరి విశ్వప్రసాద్ అన్న ఫోన్ చేసి తెలిపాడు. అట్నుంచటే ఒంగోలు వెళ్లి ఆస్పత్రిలో ఉన్న ఆయన భౌతిక కాయాన్ని సందర్శించాను. ఆయన నిర్జీవ దేహాన్ని చూశాకైనా నేను ఆయన లేడనే వార్తను నమ్మాలి కదా.. ఎందుకనో నమ్మలేకపోతున్నాను.

అయితే కడపలో సాహితీ ధర్మానికి విరుద్ధంగా ఏదైనా జరుగుతోందంటే 'పెద్దాయన ఉండాడు.. ఏమంటాడో..' అని భయం ఒకటి ఉండేది. ఆ భయం ఇప్పుడు లేనందుకు మాత్రం నేను నిజంగానే దు:ఖిస్తున్నాను.

(జూలై 10న కేతు విశ్వనాథరెడ్డి జయంతి)

వేంపల్లె షరీఫ్



సాధారణ చరిత్ర, సాహిత్య చరిత్ర కలిసి నడవాలి

- వకుళాభరణం రామకృష్ణ

మానవ ప్రయాణ కథనమే చరిత్ర అని స్థూలంగా అనుకుంటే, అందులో సాహిత్య ప్రయాణ కథనమే సాహిత్యచరిత్ర. అనేక శాస్త్రాల అన్వయం అవసరమయ్యే ప్రక్రియ సాహిత్యచరిత్ర. తెలుగు సాహిత్యచరిత్రకు చాలా చరిత్ర ఉంది. అందులో చాలా పాయలు, కోవలు ఉన్నాయి. ప్రాధాన్యాలున్నాయి. వివక్షలున్నాయి. ఉల్లేఖనలకు, విస్మరణలకు సామాజిక, రాజకీయ కోణాలున్నాయి. ఆధునిక సాహిత్య ఉద్యమాలన్నిటిలోను చరిత్ర ఒక ప్రధాన సంవాదాంశంగా ఉంటూ వచ్చింది. తెలుగు సాహిత్య చరిత్ర ప్రస్థానాన్ని సమీక్షించుకోవడానికి, కొత్త చూపులు జోడించడానికి, ఖాళీలు పూరించడానికి ఉపయుక్తమయ్యే ప్రయత్నంగా, సాహిత్య, సామాజిక చరిత్రకారులతో చేస్తున్న సంభాషణలలో మొదటిది వకుళాభరణం రామకృష్ణతో ఈ ఇంటర్వ్యూ. బ్రిటిషాంధ్ర సాంఘికోద్యమాల చరిత్రపై సాధికారమైన పరిశోధన చేసి, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్‌తో గాఢానుబంధం కలిగి, ఆంధ్రప్రదేశ్ సమగ్రచరిత్ర సంపుటాల రూపకల్పనకు సారథ్యం వహించిన రామకృష్ణ, సాహిత్య, సాధారణ చరిత్రల మధ్య సంబంధం గురించి ఈ ఇంటర్వ్యూలో మాట్లాడారు.

చరిత్ర రచన భారతీయులకు అలవాటు లేని విషయమని, వలసవాదులతోనే అది మొదలయిందని అనుకోవడం ఇప్పటికీ సరిఅయినదేనా?

మనం యివ్వాళ చరిత్రగా పరిగణించే రీతిలో, చరిత్ర రచన వలసపాలనకు ముందు లేని మాట, ఒప్పుకోడానికి కష్టమైనా, నిజమే! అంతకు ముందు చారిత్రక గ్రంథాలంటూ ప్రత్యేకించి లేవు. శాసనాలు (అశోకుడు, సముద్రగుప్తుడి కాలంలో వెలువడ్డ శాసనాలు- ప్రధానంగా, చరిత్రకు ఉపకరించే (గుప్తుల చరిత్ర), అలహాబాద్ స్తంభ శాసనం, సాహిత్యపరంగా బాణుడి "హర్ష చరిత్రము" (ఇందులో ప్రశస్తి, పొగడ్తలు, అతిశయోక్తులున్నాయి), మొగలుల కాలంలో వెలువడ్డ విదేశీయాత్రికుల రచనలు, అప్పటి ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వులు లభిస్తున్నాయి. ఆ తర్వాత వచ్చిన వలసవాదులు జారీచేసిన ఉత్తర్వులు, వారి వాణిజ్య కార్యకలాపాలు రికార్డయ్యాయి. శాస్త్రీయ రచనా పద్ధతికి ఇదే మొదలు.

తెలుగువారి చరిత్ర రచన ప్రారంభం ఎట్లా జరిగింది? మొదటి ఆధునిక తెలుగు చరిత్ర రచనగా దేనిని పరిగణించవచ్చు?

19వ శతాబ్దంలో ఆవిర్భవించిన సాంస్కృతిక పునరుజ్జీవనంలో తెలుగువారి చరిత్ర మొదలైంది. జాతీయస్థాయిలో వచ్చిన మేధోమధనంలో భాగంగా, తెలుగు మేధావులు తెలుగు జాతి చరిత్ర, సంస్కృతులపై దృష్టి సారించారు. జాతీయోద్యమ భావజాలానికి మరింత బలం చేకూరుతుందన్న భావంతో, చరిత్రకారులు, జాతీయవాద చరిత్ర రచన అనే ఆలోచనా సరళిని ప్రోత్సహించారు. ఈ క్రమంలో విద్వాంసులు, సాహిత్యకారులైన కల్నల్ మెకంజీ, చార్లెస్ బ్రౌన్, జిల్లా మాన్యువల్స్, గెజిటీర్లను వెలికితీసి చరిత్రనిర్మాణానికి పూనిక చేశారు.

1900 సంవత్సరంలో లండన్ నుంచి ప్రచురితమైన రాబర్ట్ సీవెల్ రాసిన విస్మృత సామ్రాజ్యం (Forgotten Empire), ఆంధ్రుల చరిత్రరచనకు దోహదం చేసింది. కొమర్రాజు లక్ష్మణరావు విజ్ఞాన చంద్రికా గ్రంథమండలిని స్థాపించారు. ఈసంస్థ ద్వారా 1910-36 మధ్య కాలంలో, కొమర్రాజు వారి ప్రోత్సాహంతో, మధ్యాంధ్ర దేశ చరిత్రపై విజయనగర సామ్రాజం వరకు, మూడు సంపుటాలు వెలువరించారు. 1925లో చిలుకూరి, కొమర్రాజు, మల్లంపల్లి, భావరాజు ప్రభృతులు కలిసి 'ఆంధ్రా హిస్టారికల్ రిసెర్చి సొసైటీ' ని స్థాపించారు. ఒక త్రైమాసిక పరిశోధక సంచికను ప్రారంభించారు. ఆంధ్రదేశ చరిత్ర రచనలో యిదొక పెద్ద మలుపు.

ఆంధ్రుల చరిత్ర సాధికారికంగా విజ్ఞానచంద్రికాగ్రంథమండలి ఆధ్వర్యంలో, కొమర్రాజు లక్ష్మణరావు రచనతో ఆరంభమైందని భావించడం కద్దు. నిజమే! కానీ, ఆ ప్రచురణకు ముందు, కొన్ని ప్రయత్నాలు జరిగాయి. గంగాదేవి రాసిన 'మధురా విజయం' (వీరకంపరాయ చరిత్ర) సంస్కృతంలో రాసిన సాహిత్యగ్రంథం. విజయనగర సామ్రాజ్య స్థాపకులైన హరిహర రాయ, బుక్కరాయల వంశానికి చెందిన వీరకంపరాయ జీవితం, అందులో వస్తువు. గంగాదేవి వీరకంపరాయని భార్య. వీరకంపరాయడు మధురను క్రీ.శ. 1371లో జయించాడు. ఆ చారిత్రక సందర్భంలో చోటు చేసుకొన్న ముఖ్యఘటనలను ఈ గ్రంథంలో గంగాదేవి పేర్కొంది.

19వ శతాబ్ది ప్రథమభాగంలో, కావలి సోదరుల (వెంకట బొర్రయ్య, వెంకట రామశాస్త్రి) పూనికతో, విస్తారమైన, ముఖ్యమైన చారిత్రక ఆధారాలను, స్థానికంగా లభిస్తున్న ప్రాచీన, ఇతిహాస, పురాణ వ్యాఖ్యలను, వివరణలను, వాటితో పాటు తాటాకులపై రాసిన సమాచారాన్ని, అనువాదాలు, పటాలు (Maps), చిత్రలేఖనాలు, పురావస్తు ఆధారాలు, శిల్పాలు, రాగి రేకులపై లభించిన శాసనాలను, తాటియాకులపై రాసి భద్రపరిచిన చారిత్రక, సామాజిక అంశాలను, నాణేలను సేకరించి భద్రపరిచారు. అనేక లిపులను వెలికితీసి, సరిచేసి, తుదిరూపాన్నిచ్చారు.

కావలి సోదరులు రాసిన దక్కన్ కవుల చరిత్ర, దక్షిణదేశ చారిత్రక పరిణామాల ఆనవాళ్లను సేకరించి భద్రపరిచారు. కావలి వెంకట బొర్రయ్యను శాసన సాహిత్య ప్రముఖుడిగా, వాస్తవానికి తెలుగు ప్రజల చరిత్రకు ఆద్యుడిగా పరిగణించాలి.

కావలి వెంకట బొర్రయ్య తర్వాత, బుక్కపట్నం రాఘవాచార్యులు రచించిన 'History of Andhras' గ్రంథంలో కళింగ రాజవంశాల గూర్చిన సమాచారం లభ్యమవుతున్నది. మద్రాసులోని 'ప్రాచీన చరిత్ర, సంస్కృతికి సంబంధించిన ప్రతుల గ్రంథాలయం (Manuscripts Library)లో దీనికి సంబంధించి రాతప్రతులు లభ్యమవుతున్నాయి.

ఓరియంటలిస్టులు మొదలైనవారు భారతదేశం మీద కల్పించిన దృక్పథ చట్రం ప్రభావంతోనే, దానికి ప్రతిక్రియగానో భారతీయ చరిత్ర రచన మొదలైందనుకుంటే, తెలుగువారి చరిత్ర రచనను ఎజెండా మీదకు తెచ్చినవి ఏ కారణాలు?

మీరన్నట్టు, భారతీయ చరిత్ర విషయంలో జరిగిందదే! తెలుగువారి చరిత్ర భారతదేశ చరిత్రలో అంతర్భాగంగా, అదే నేపథ్యంలో ప్రారంభమైంది. యూరోపియన్ సాహిత్యం ద్వారా పాశ్చాత్య సంస్కృతిని ఆకళింపు చేసుకొన్న తెలుగు రచయితలు, నూతన సాహిత్యసృష్టిలో భాగంగా తెలుగు కవుల చరిత్రను ఆధునిక దృక్పథంతో రాయనారంభించారు. పత్రికారచనలో కూడ కొత్త పుంతలు, దీని ప్రభావంతో ఏర్పడ్డాయి. కందుకూరి సాహిత్య కృషికి, గురజాడ, గిడుగులు మరింతగా దోహదం చేసి, వస్తుపరంగా, భాషా పరంగా తెలుగు సాహిత్యసంస్కృతులను ముందుకు తీసుకెళ్లారు. గురజాడ స్థానిక చరిత్రల రచనకు కూడా శ్రీకారం చుట్టారు. విజ్ఞాన చంద్రికా గ్రంథమండలి స్థాపన ద్వారా కొమర్రాజు లక్ష్మణరావు చరిత్ర, సంస్కృతులపై పరిశోధనా దృక్పథాన్ని జోడించి రచనలు చేశారు. 1912లో ఆంధ్రమహాసభ ఏర్పడింది. ఒక పరిశోధనా త్రైమాసిక పత్రిక ప్రారంభమైంది. కాలగర్భంలో కలిసిపోయిన శాసనాలను వెలికితీసి, వాటిలోని సారాంశాన్ని చరిత్ర రచనకు పనిముట్టుగా ఉపయోగించుకున్నారు. అప్పుడు వెలువడ్డ ముఖ్యమైన రచనల్లో, ఈ ప్రశ్నకు సమాధానంగా చెప్పుకోదగ్గవి- మారేమండ రామారావు రాసిన 'కాకతీయ చరిత్ర', నేలటూరు వెంకట రమణయ్య రాసిన 'విజయనగర మూడవ రాజవంశములోని పతనములు', సురవరం ప్రతాపరెడ్డి 'ఆంధ్రుల సాంఘికచరిత్ర' మొదలైనవి.

> **సాహిత్య చరిత్ర కారులకు సామాజిక, మానవీయ శాస్త్రాలతో, కొద్దిమందిని మినహాయిస్తే, పరిచయం, పరిజ్ఞానం తక్కువ. ఇది సాహిత్య కారుల లోపం కాదు. సాహిత్య చరిత్రను బోధించే ప్రక్రియలోనే లోపం వుంది. సాహిత్యకారులకు ఇతర సామాజిక శాస్త్రాల విషయాలు బోధించే, పరిశోధించే విధానాల్లో మార్పు రావాలి. ఈ విషయంలో విశ్వవిద్యాలయాల్లో తగు మార్పులు చేయాలి.**

సాధారణ చరిత్రకు, సాహిత్య చరిత్రకు ఉండే సంబంధం ఏవిటి? సామాజిక, రాజకీయ, సాంస్కృతిక చరిత్రరచనకు అనేక దినుసులను సాహిత్యం సమకూరుస్తున్నది, మరి సాహిత్యచరిత్ర కారులు సాధారణ చరిత్ర నుంచి తీసుకోవలసినంత తీసుకుంటున్నారా?

సాధారణ చరిత్ర అన్ని అంశాలను (చారిత్రక, సామాజిక, రాజకీయ, సాహిత్య, సాంస్కృతిక) సవివరంగా వ్యక్తీకరిస్తుంది. ఈ కృషికి దోహదం చేస్తూ, సాహిత్యం, ఆయా కాలాల్లో, అప్పటి సమాజాల్లో నెలకొన్న పరిస్థితుల్ని వ్యక్తపరుస్తుంది. ఈ వ్యక్తీకరణ నేరుగా, సరళరేఖలా వుండదు.

సాహిత్య చరిత్రకారులు, కొద్దిమందిని మినహాయిస్తే, సాధారణ చరిత్రాంశాలను తీసుకోడం లేదు. దీనికి ఈ రెంటిమధ్య వున్న ముఖ్య సంబంధం తెలియకపోవడం ఒక కారణమైతే, సాధారణ చరిత్రపొరలలో దాగివున్న సాహిత్యాంశాలను గ్రహించగలిగిన శిక్షణ, నైపుణ్యం లేకపోవడం మరో కారణం. ఇలా జరగనప్పుడు, సాహిత్య చరిత్ర సమగ్రం కాదు.

సాధారణ చరిత్ర రచన కేవలం పాలకుల వంశావళులు, దండయాత్రలు యుద్ధాల జాబితాలను దాటి జనజీవనంలోని స్థితిగతులను సూక్ష్మస్థాయి దాకా పట్టుకోగలుగుతోంది. సాహిత్య చరిత్ర రచన కవుల, రచయితల, ప్రక్రియల, ఉద్యమాల కాలక్రమ చరిత్రగానే కొనసాగుతోందా? ఇతర సామాజిక, మానవీయ శాస్త్రాలతో సమన్వయం ఎంత వరకు జరుగుతోంది?

అవును. అంతర్ సామాజిక శాస్త్ర అధ్యయనం (inter- social sciences disciplinary studies) ప్రక్రియ ఈనాడు ప్రాముఖ్యం లోకి వచ్చింది. దీని వల్ల చరిత్ర అధ్యయనంలో విషయ పరిజ్ఞానం పెరిగింది. సాహిత్య చరిత్రలో ఈ ప్రక్రియ జరుగుతున్నది కానీ, ఊపందుకోలేదు. సాహిత్య చరిత్ర కారులకు సామాజిక, మానవీయ శాస్త్రాలతో, కొద్దిమందిని మినహాయిస్తే, పరిచయం, పరిజ్ఞానం తక్కువ. ఇది సాహిత్యకారుల లోపం కాదు. సాహిత్య చరిత్రను బోధించే ప్రక్రియలోనే లోపం వుంది. సాహిత్యకారులకు ఇతర సామాజిక శాస్త్రాల విషయాలు బోధించే, పరిశోధించే విధానాల్లో మార్పు రావాలి. ఈ విషయంలో విశ్వవిద్యాలయాల్లో తగు మార్పులు చేయాలి. తెలుగు భాష, బోధన, సాహిత్యం, పరిశోధన రంగాల్లో కొనసాగుతున్న మునుపటి, కాలం చెల్లిన సంప్రదాయాలు, పద్ధతులు మారాలి.

ఆంధ్రలో సామాజికోద్యమాల చరిత్ర రచనలో మీది ప్రత్యేకమైన కృషి. అందులో సాహిత్యంతో సహా రకరకాల వాఙ్మయాన్ని ఆధారాలుగా తీసుకున్నారు. తెలుగు సాహిత్యచరిత్ర కారులకు తప్పనిసరిగా అవసరమయ్యే వాచక, వాచకేతర వనరుల గురించి మీ సూచనలు, సలహాలు..?

'వాచక', 'వాచకేతర' వనరుల గూర్చి ఒక పట్టిక ఇక్కడ ఇవ్వలేను. కొన్ని సూచనలు, సలహాలు: 1) చారిత్రక దృక్పథంతో, కొద్దోగొప్పో, చారిత్రక అంశాలతో కూడిన సాహిత్యం. 2) ఏ అంశంపై పరిశోధన చేస్తున్నారో, దానిపై లభ్యమయ్యే రచనలు సేకరించడం. 3) యాత్రా చరిత్రలు; స్వీయ చరిత్రలు; రచయితల, సామాజిక, రాజకీయ వేత్తల ఆత్మకథలు, అనుభవాలు, జ్ఞాపకాలు. 4) వాచకేతర వనరుల్లో... ఇంటర్వ్యూలు 5) ఆయా కాలాలపై, అప్పటి కాలంలో ప్రచురించిన సమకాలీన అనుభవాలతో కూడిన రచనలు.. ఇలా ఎన్నైనా చెప్పుకుంటూ పోవచ్చు. సాహిత్యచరిత్ర కారులు విస్తారంగా, తమ పరిశోధనకు సంబంధించి లభ్యమయ్యే సామాజిక శాస్త్రాల్లోని విషయాలను సంప్రదించడం చేయాలి. ఇక, వనరుల గూర్చి ఇతమిత్థంగా, ఫలానా అని చెప్పలేము. అవి పరిశోధించే విషయాలను బట్టి, ఒక ఆధారాన్ని సంప్రదిస్తే, అది మరొక వనరుకు దోహదం చేస్తుంది. ఇది, ఈ ప్రక్రియ, పరిశోధన మొదలై ఆఖరు దాకా అవిచ్ఛిన్నంగా కొనసాగాలి.

చరిత్రకారుడిగా మీరు అభిమానించే తెలుగుసాహిత్యచరిత్ర కారులెవరు?

అందరి పేర్లూ ఇక్కడ ఉటంకించలేను. ముఖ్యంగా ఇంకా రాస్తున్నవారిని ఎంచి చెప్పలేను. పూర్వులలో గురజాడ, కె.వి. రమణారెడ్డి తరువాత కె.వి. రమణారెడ్డి, జి.యస్. రెడ్డి, ఆరుద్ర, వెల్చేరు నారాయణరావు, కె.కె. రంగనాథాచార్యులు... వీరి చరిత్ర రచనను నేను అభిమానించాను.

(ఇంటర్వ్యూ: కె. శ్రీనివాస్)

పురిటిల్లు

చిన్నారి నవ్వింది
బాంబు ఫ్యూజ్ మాడిపోయింది
కొండ మీది సూర్యుడు
కోటి చేతులతో మందుగుండు గుప్పిస్తున్నాడు
పాల బువ్వతో తల్లి నిప్పును
నీరు గార్చింది


నేల మాళిగలు
జన హృదయాలను
అస్త్రాలుగా మలుస్తున్నాయి
అవి తెల్ల మేడ గుండెల్లో పేలుతున్నాయి

చెట్లు ఆయుధాలను పూస్తున్నాయి
ఆత్మీయతలను కాస్తున్నాయి
సామూహిక బలిదానాలు
భూగర్భాన్ని మానవీకరిస్తున్నాయి

కలిసి బతికేచోట కలలు పూలవనాలవుతాయి
దాడులను దండలుగా ధరించిన నేలలో
ప్రాణాలు పోరు బాణాలవుతున్నాయి
నేటి నెత్తుటి మడుగులు
రేపటి రెక్కల వినువీధి విహారాలు

విశ్వం నిరంతర యుద్ధ భూమి
మానుష అమానుషాల సమర క్షేత్రం
ప్లస్ మైనస్సుల కదన సీమ
రక్త ప్రసవంలో మనిషిని కనే పురిటిల్లు

నిజం



'నల్లకొడిసె వన్నెకాడు' కవిత్వం

నాగిళ్ళ రమేష్ కవితాసంపుటి 'నల్లకొడిసె వన్నెకాడు' ఆవిష్కరణ జూలై 14 సా.6గంటలకు రవీంద్రభారతి మినీహాల్, హైదరాబాద్‌లో జరుగుతుంది. అధ్యక్షత- కవి యాకూబ్, ఆవిష్కరణ- కె. శివారెడ్డి, తొలిప్రతి స్వీకర్త- నాగిళ్ళ సదానందం, అంకితం- జబ్బు వెంకటేష్, ముఖ్య అతిథి- మామిడి హరికృష్ణ, వక్త- కోయి కోటేశ్వరరావు. ఆత్మీయ స్పందనలు- పల్లిపట్టు నాగరాజు, తగుళ్ళ గోపాల్, నరేష్కుమార్ సూఫీ, వనపాకల దిలీప్, పేర్ల రాము, గుర్రాల అనూష, లిఖిత్ కుమార్ గోదా.

కవిసంగమం

'గ్రేయిన్ చైన్స్' ఆంగ్ల అనువాద కవిత్వం

అన్నవరం దేవేందర్ ఆంగ్ల అనువాద కవితా సంపుటి 'గ్రేయిన్ చైన్స్' ఆవిష్కరణ సభ జూలై 14 ఉ.10 గంటలకు కరీంనగర్ ఫిలిం భవన్‌లో జరుగుతుంది. ఆవిష్కర్త- బి. నరసింగరావు, అధ్యక్షత- బూర్ల వెంకటేశ్వర్లు. నలిమెల భాస్కర్, ఎనిశెట్టి శంకర్, జీవి శ్యాం ప్రసాద్ లాల్, నగునూరి శేఖర్, పొన్నం రవిచంద్ర, సవ్యసాచి గాజోజు నాగభూషణం, నంది శ్రీనివాస్ తదితరులు పాల్గొంటారు. వివరాలకు: 94402 38852.

మాడిశెట్టి గోపాల్

'అన్వేషణ' సాహిత్య వ్యాసాలు

తూర్పు మల్లారెడ్డి సాహిత్య వ్యాసాల పుస్తకం 'అన్వేషణ' ఆవిష్కరణ సభ జూలై 12 సా.6గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి, ఆవిష్కర్త- నందిని సిధారెడ్డి, సభాధ్యక్షులు నాళేశ్వరం శంకరం, గ్రంథ సమీక్ష- వి. శంకర్, ఆప్త వాక్యం- ఏనుగు నరసింహారెడ్డి, మామిడి హరికృష్ణ.

కందుకూరి శ్రీరాములు

మీకేమైనా ఒక పిడికెడు స్వప్నాలు కావాలా?

మీకేమైనా
ఓ పిడికెడు స్వప్నాలు కావాలా?
ఎందుకో ఒకందుకు వాడుకుందురు
ఉచితంగానే ఇచ్చేస్తా

ఎందుకలా క్షణంలో నా మీద
ఎర్రెర్రని అసూయ వర్షం గుమ్మరిస్తారు
సముద్రాలను నింపుకున్న
మేఘపు సంచులు చిరిగినట్టు
నాకేమీ పుట్టుకతో వసంతాలు పట్టం కట్టలేదు
పదపల్లవాలు హరివిల్లు జలపాతాల్లో జలకాలాడి
ఎగిరివచ్చి నా ముంగిట మువ్వన్నెల
రామచిలకలై వాల లేదు
శిశిరాలు చేతులుకట్టుకు తలలు వాల్చి
వినయంగా తమ ఆజ్ఞ అంటూ
విన్నపాలు పంచుకోలేదు

కన్నీటి కడలిని వెయ్యిన్నొక్కసార్లు ఈది, మునిగి తేలుతూ
మెరుపుల మాణిక్యాలను ఏరుకున్నాను
కార్చిచ్చు అడవుల్లో పరుగులు తీసి
పిడికెడు నిప్పుకణికలను ఊది ఊది చల్లార్చుకు
కొంగున కట్టుకున్నాను
ఊపిరి దారిని ఎగసిపడే భావోద్వేగాలకు
పుప్పొడి సుగంధాలనద్ది
స్వప్నాలను పరిమళభరితం చేసుకున్నాను

బాధకు చిరునామాగా మారిన ఉనికిని
భాషకు దాసోహం చేసి
నా మనసు కిటికీ పక్కన పారిజాతంగా
నాటుకున్నాను
సమయం విస్మయమై
నా వాకిట రంగుల స్వప్నమయూరమై నర్తిస్తుంది

భళ్ళున పగిలి బద్దలైన ఊహలూ
ఖాళీ లేకుండా రాలిపడిన శుష్క పలవరింతలూ
చిరిగిన గాలిపటాలై నేల బారున



ఎగరలేక సోలిపోయే కథలూ
ముళ్ళకిరీటాలైన మొహమాటాల
చెత్తాచెదారం ఊడ్చిపారేసిన క్షణం

భయసందేహాలు బాధించని
పచ్చని మైదానాలు ఊహల్లో పరచుకున్నాయి
నింగి దిగి వచ్చే రంగురంగుల పిడికెడంత పిట్టలు
సరిగమలను కాచివడబోసి మధుపాత్ర నింపుతాయి
పండి పరిమళిస్తున్న వేకువ చుట్టూ
హరివిల్లు చారలను అతికించి
సీతాకోక చిలుకలు సొగసుల ఊయలలెక్కుతాయి

ఇంటిపక్కనే ఉబికి వస్తున్న స్వప్న ప్రవాహం
జీవనదిగా కదులుతూనే ఉంది
రెల్లుపూలై తూలిసోలే వయ్యారాలు
సుదూరతీరాలకు మోస్తున్న రంగులు
రండి
ఓ పిడికెడు స్వప్నాలు అందుకోండి
మీ మనసు వాకిట అలంకరించుకుందుకైనా.

స్వాతి శ్రీపాద

దళిత సంస్కృతి, సాహిత్యాలపై సదస్సు

'దళిత చరిత్ర - సంస్కృతి - సాహిత్యం - పునర్మూల్యాంకనం - ఖాళీల పూరింపు' అంశంపై రౌండ్ టేబుల్ సదస్సు జూలై 14 ఉ.10గంటల నుంచి 2 గంటల వరకు తెలుగు యూనివర్సిటి కాన్ఫరెన్స్ హాల్, హైదరాబాద్‌లో జరు గుతుంది. గుడిపల్లి నిరంజన్, దార్ల వెంకటేశ్వరరావు, ఘంటా చక్రపాణి తదితరులు పాల్గొంటారు ఈ సందర్భంగా సంగిశెట్టి శ్రీనివాస్ రచించిన 'ఇమానం' విస్మృత దళిత చైతన్యం, 'దళితోద్యమ వేగుచుక్క భాగ్యారెడ్డి వర్మ పుస్తకాల ఆవిష్కరణ ఉంటుంది.

పూలే అంబేద్కర్ అధ్యయన వేదిక

కథా సంధి

సాహిత్య అకాడెమీ, సాహితీ స్రవంతి సంయుక్త ఆధ్వర్యంలో 'కథా సంధి' కార్యక్రమంలో గంటేడ గౌరు నాయుడు తమ కథ చదివి ఆహూతులతో ముచ్చటిస్తారు. ఈ కార్యక్రమం జూలై 14 సా.5.30గంటలకు జిల్లా పరిషత్ మినిస్టీరియల్ హాల్, విజయనగరంలో జరుగుతుంది.

సాహితీ స్రవంతి

'వీధిచుక్కలు' కవితా సంకలనం

కొసరాజు సామ్రాజ్యం సంపాదకత్వంలో ప్రచురించిన 'వీధి చుక్కలు' కవితా సంకలనం ఆవిష్కరణ జూలై 14న హైదరాబాద్ మోహన్ నగర్‌లోని కొసరాజు ఆర్తి & జాహ్నవి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ హాల్లో జరుగుతుంది. సభలో యస్.వి. రామారావు, రమణ వెలమకన్ని, వై. రామకృష్ణారావు తదితరులు పాల్గొంటారు.

పొత్తూరి సుబ్బారావు



• కృష్ణమ్మలోకి గోదారమ్మ!

పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పరుగులు పెట్టిన గోదావరి జలాలు ఎట్టకేలకు ఆదివారం కృష్ణా నదిలో కలిశాయి. పరవళ్లు తొక్కుతూ ప్రవహిస్తున్న గోదావరి జలాలకు కవులూరు గ్రామంలో మహిళలు ప్రత్యేక పూజలు చేసి పరవశించారు. - జి.కొండూరు





భక్తి పారవశ్యంతో..

• దుర్గమ్మకు 1826 మంది సారె సమర్పణ

భక్తులతో ఇంద్రకీలాద్రి కిటకిటలాడుతోంది. ఆషాఢ ఉత్సవాలతో మోతెక్కుతోంది. ఆషాఢ మాసం తొలి ఆదివారం దుర్గమ్మకు సారె సమర్పించేందుకు భారీగా తరలివచ్చిన భక్తులతో రద్దీ నెలకొంది. 1826 మంది దుర్గమ్మకు సారె సమర్పించారు.

4లో..

గొల్లపూడికి చెందిన ఓ టీడీపీ నాయకుడు 2019 ఎన్నికలకు ముందు గొల్లపూడి చుట్టుపక్కల ప్రాంతాల్లో సుమారు రూ.70 లక్షలు పెట్టి సీసీ రోడ్లు నిర్మించారు. ఈ రోడ్ల నిర్మాణానికి క్వాలిటీ కంట్రోల్ అధికారులు కూడా ఆమోద ముద్ర వేశారు. బిల్లుల చెల్లింపులు జరిగే సమయానికి ప్రభుత్వం మారిపోయింది. బిల్లులు చేయాల్సిన పంచాయతీరాజ్ డిప్యూటీ ఇంజనీరు (డీఈ) బిల్లులను అటకెక్కించేశారు. టీడీపీ నాయకుడికి బిల్లులు చెల్లించేది లేదని తేల్చి చెప్పేశారు. ఇలాంటి బాధితులు ఉమ్మడి కృష్ణాలో పదుల సంఖ్యలోనే ఉంటాన్నారు.

అడ్డదారి అధికారి!



పంచాయతీరాజ్‌లో కమీషన్ల దందా

కట్ చేస్తే..

రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చింది. పరిస్థితి మాత్రం మారలేదు. అదే డీఈ స్థానిక టీడీపీ ఎమ్మెల్యే ఆశీస్సులతో మళ్లీ పెనమలూరు నియోజకవర్గంలో చక్రం తిప్పుతున్నారు. పోనీ అర్హత ఉండి ఆయన డీఈ పోస్టులో ఉన్నారా అంటే ఆయనది అసిస్టెంట్ ఇంజనీరు (ఏఈ) స్థాయి. తన పరిధిలో ఒక ఏఈని మూడు మండలాలకు ఇన్‌చార్జిగా నియమించుకుని కమీషన్ల దందా నడిపిస్తున్నారు.

- వైసీపీ హయాంలో ఏఈకి డీఈగా పోస్టింగ్
- పెద్దిరెడ్డి పేరు చెప్పి ఉమ్మడి కృష్ణాజిల్లాలో వసూళ్ల పర్వం
- ముగ్గురుంటే కమీషన్లలో పోటీ వస్తారని మూడు మండలాలకు ఒకే ఏఈ నియామకం
- ప్రభుత్వం మారడంతో అక్రమాల నుంచి రక్షణకు ప్రయత్నం
- టీడీపీ ఎమ్మెల్యే పంచన చేరి భజన

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : పంచాయతీరాజ్ శాఖలో ప్రాజెక్టు ఇంప్లిమెంటేషన్ యూనిట్ (పీఐయూ), రెగ్యులర్ అనే రెండు విభాగాలు ఉంటాయి. పీఐయూ విభాగానికి చెందినవారు ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఇతర గ్రాంట్ల నిధులతో జరిగే భారీ పనులు పర్యవేక్షిస్తుంటారు. రెగ్యులర్ విభాగానికి చెందిన వారు జిల్లా పరిషత్, మండల పరిషత్ నిధులతో జరిగే పనులను పర్యవేక్షిస్తుంటారు. విజయవాడ పీఐయూ యూనిట్‌లో పనిచేసే ఏఈ స్థాయి అధికారి ఒకరు పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ నిర్వహణ బాధ్యతలు చూసేవారు. 2019లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్నప్పుడు ఏఈకి ఆయనతో పరిచయం పెరిగి క్రమేణా ఆయనకు నమ్మినబంటుగా మారారు. పెద్దిరెడ్డి ఆశీస్సులతో సదరు ఏఈ ఏకంగా డీఈ అయిపోయారు. ఎక్కడో పీఐయూ విభాగంలో పనిచేస్తున్న సదరు ఏఈని విజయవాడ రెగ్యులర్ డీఈగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈయన కోసం విజయవాడ రెగ్యులర్ డీఈగా పనిచేస్తున్న వ్యక్తిని మరో చోటికి డిప్యుటేషన్‌పై పంపేశారు.

కాసులు కురిసే పోస్టు దక్కించుకుని...

పీఐయూ విభాగం కన్నా రెగ్యులర్ విభాగంలో కాసుల వర్షం కురుస్తుంటుంది. అందుకనే సదరు ఏఈ రెగ్యులర్ డీఈగా అడ్డదారిలో పోస్టింగ్ దక్కించుకున్నారు. ఇక అక్కడి నుంచి ఉమ్మడి కృష్ణాజిల్లాలో ఆయన మాటకు తిరుగులేకుండా పోయింది. ఎక్కడ పంచాయతీరాజ్ నిధులతో పనులు చేసినా అక్కడ వాలిపోయి పెద్దిరెడ్డి పేరుతో కమీషన్లు గుంజడం మొదలుపెట్టారు. తనపై అధికారులైన ఈఈ, ఎస్ఈలను సైతం లెక్కచేయని స్థాయికి ఆయన చేరిపోయారు. తన పరిధిలో జరిగే పనులకు 20 శాతం కమీషన్ చెల్లించాలని రేటు కట్టి మరీ వసూలు చేసేవారు. ఇంట్లో కూర్చొని చెక్ మెజర్‌మెంట్లు చేసి బిల్లులు తయారు చేసేవారు.

ఒక్క ఏఈతో మూడు మండలాల్లో వసూళ్లు

ఉమ్మడి కృష్ణాలో ఈయన పరిధిలో విజయవాడ రూరల్, పెనమలూరు, ఉయ్యూరు కంకిపాడు మండలాలుండేవి. జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత ఈయనకు పెనమలూరు, ఉయ్యూరు, కంకిపాడు మండలాలు మాత్రమే మిగిలాయి. ఈయన పరిధిలోని మూడు మండలాలకు ఒక్కో మండలానికి ఒక్కో ఏఈ ఉండాలి. ఎక్కువ మంది ఏఈలు ఉంటే తన అక్రమార్జనకు అడ్డువస్తారని తనకు నమ్మినబంటు లాంటి ఒక్క ఏఈనే మూడు మండలాలకు ఇన్‌చార్జిగా పెట్టుకుని కథ నడిపించేస్తున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లో ఏ మండలంలోనూ ఈ పరిస్థితి లేదు.

అక్కడా ఉంటాం.. ఇక్కడా ఉంటాం..

డీఈ.. ప్రభుత్వం మారడంతో స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పంచన చేరి ఆయనకు భజన చేయడం ప్రారంభించారు. ఈయన ఆశీస్సులతో ఇక్కడే కొనసాగేందుకు ప్రయత్నాలు చేసుకుంటున్నారు. మంత్రి కె.పార్థసారథి కూడా తన సామాజికవర్గమేనని ఆయన ఆశీస్సులు కూడా తనకు ఉన్నాయని ఈయన ప్రచారం చేసుకుంటున్నారు.

ప్రమాదం వెనుక నిర్లక్ష్యం

కిలెన్ వద్ద వరుస ఘటనలు



సైక్లోన్ ప్రీహీటర్ పేలుడు తర్వాత కర్మాగారంపై కమ్ముకున్న సిమెంట్ మేఘాలు

ఒకసారి కాదు. ఇప్పటి వరకు రెండుసార్లు అల్ట్రాటెక్ సిమెంట్ కంపెనీలో కిలెన్ బాయిలర్ వద్ద ప్రమాదాలు జరిగాయి. దీన్ని తక్షణమే మార్పు చేయాలని ఇంజనీర్లు తేల్చారు. అయినా కర్మాగార యాజమాన్యం మాత్రం స్పందించలేదు. కార్మికుల భద్రత విషయంలో నిలువునా నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తూనే ఉంది. ఆ నిర్లక్ష్యంగా ఇప్పుడు ఒక కార్మికుడి ప్రాణాలు తీసింది. మరికొంత మందిని చావుబతుకుల మధ్య పడేసింది. ఇంకొంతమందిని గాయాలపాలు చేసింది.

బాయిలర్‌ను మార్పు చేయని కంపెనీ యాజమాన్యం

- రోడ్డున పడిన కాంట్రాక్ట్ కార్మికుడి కుటుంబం
- పరిహారం ప్రకటించని కంపెనీ
- 'అల్ట్రాటెక్' ముందు గ్రామస్తుల ఆందోళన
- పరిపాలన భవనంపై దాడి
- సీఎం చంద్రబాబు, మంత్రి వాసంశెట్టి ఆరా
- క్షతగాత్రులకు ఎమ్మెల్యే, అధికారుల పరామర్శ

(ఆంధ్రజ్యోతి - విజయవాడ/ జగ్గయ్యపేట రూరల్) : లైమ్‌స్టోన్ ఎర్రమట్టి మిక్సింగ్ చేసే బాయిలర్ (కిలెన్) 1200-1400 సెల్సియస్ హీట్‌లో ఉంటుంది. అది ఒక్కసారిగా పేలటంతో పౌడర్ రూపంలోని క్లింకర్ బయటకు వెదజల్లి పరిసరాల్లోని కార్మికులపై పడింది. దీంతో ప్రాణభయంతో కార్మికులు పరు గులు పెట్టారు. సమీపంలోని 15 మందిపై ఎక్కువ స్థాయిలో బూడిద పడటంతో వారు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో బూదవాడ కు చెందిన ఎనిమిది మంది, మిగిలినవారు బీహార్, ఉత్తర ప్రదేశ్‌లకు చెందిన వారు ఉన్నారు. ప్రమాద సమ యంలో గాయ పడిన వారిని విజయవాడ తరలించారు. గాయపడిన 15 మందిలో 8మంది బూదవాడకు చెందినవారు. - మిగతా 4లో



కాలిన గాయాలతో కార్మికుడు

సైక్లోన్ ప్రీహీటర్ పేలటంతోనే ప్రమాదం

జగ్గయ్యపేట : సిమెంట్ కర్మాగారంలో ప్రీహీటర్‌లో సమస్యలతోనే పేలినట్టు కార్మికులు ఆరోపిస్తున్నారు. గతంలో సైక్లోన్ ప్రీహీటర్‌లో సమస్యలు రావటంతో కార్మికులు సంబంధిత విభాగానికి ఫిర్యాదు చేసినా స్పందించలేదు. కిలెన్‌లో వేసే ముడిపదార్థాల్లో ఉండే యాసిడ్లను తొలగించేం దుకు, సిమెంట్ నాణ్యతను పెంచేందుకు ప్రీహీటర్ సైక్లోన్‌లో ఉంచుతారు. ఇక్కడ 800 డిగ్రీల సెల్సియస్‌పైగా ఉష్ణోగ్రత ఉంటుంది. సైక్లోన్ ప్రీహీటర్‌లో ముడిపదార్థాలు కలిసే సందర్భంలో ఈ పేలుడు సంభవించింది. భారీ వేడితో ఉండే సిమెంట్ కార్మికులకు అంటుకు పోవటంతో కార్మికులు శరీరాలు కాలిపోయాయి.

కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్‌ను ఉన్నట్టుండి పటమట పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. ఆయన రెండు, మూడు రోజుల్లో బాధ్యతలు చేపడతారనే సరికి హఠాత్తుగా బదిలీ ఉత్తర్వులను రద్దు చేశారు. ఆ ఇన్‌స్పెక్టర్‌ను వీఆర్‌కు పంపించారు. ఆగమేఘాల మీద మరో ఇన్‌స్పెక్టర్‌ను ఆ పోస్టులో నియమించారు. వైసీపీ హయాంలో జరిగిన ఘటన ఇది. అసలు ఈవిధంగా ఎందుకు జరిగిందో ఎవరికీ అర్థం కాలేదు. కొన్ని రోజులకు అసలు విషయం వెలుగులోకి వచ్చింది. వైసీపీ ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నించిన డీజీ స్థాయి అధికారి (ఇప్పుడు మాజీ)ని ఒక ఎస్ఐ పదవీ విరమణ వేడుకలో కలిశారు. పుష్పగుచ్ఛం ఇచ్చి ఫొటో దిగారు. పోలీసు సంక్షేమ సంఘం స్థానంలో ఉన్న అడహక్ కమిటీలో ఉన్న నాయకుడు ఒకరు ఈ ఫొటోను బయటకు లీక్ చేసినట్టు విమర్శలు ఉన్నాయి. ఈ ఫొటో కారణంగా పటమటకు ముందుగా నియమించిన ఇన్‌స్పెక్టర్‌కు ఇప్పటి వరకు పోస్టింగ్ ఇవ్వలేదు.



న్యాయం జరిగేనా..?

వైసీపీ పాలనలో ఇన్‌స్పెక్టర్లకు ఇబ్బందులు

- కొంతమందికి దక్కని పోస్టింగ్‌లు
- ఇచ్చిన పోస్టింగ్‌లు వెంటనే రద్దు చేసిన అధికారులు
- పోస్టింగ్‌ల కోసం వైసీపీ విధేయుల ప్రయత్నాలు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఒక ఇన్‌స్పెక్టర్‌కు పోలీసు శాఖలో సౌమ్యుడు అని పేరుంది. ఆయన వద్దకు ప్రముఖుల సిఫార్సులతో వెళ్లినా, మామూలుగా వెళ్లిన ఆయన మాట్లాడే విధానంలో మర్యాద మాత్రం తగ్గదు. ఆయన ఉద్యోగ విరమణకు దగ్గరగా ఉన్నారు. ఐదేళ్లుగా ఆయనను ఎలాంటి ప్రాధాన్యం లేని పోస్టులో కూర్చోబెట్టారు. రెండు రోజుల క్రితమే పశ్చిమ మండలంలో ఒక స్టేషన్‌కు అటాచ్‌మెంట్ ఇచ్చారు. డీజీపీగా రాజేంద్రనాథ్‌రెడ్డి ఉన్నప్పుడు ఆయన క్యాంపు ఆఫీసు నుంచి ఏ మార్గంలో డీజీపీ కార్యాలయానికి వెళ్తారో తెలిసేది కాదు. ఆయన కోసం పోలీసులు రెండు, మూడు మార్గాల్లో బందోబస్తు ఏర్పాటు చేసుకునేవారు. ఒకసారి ఆయన ఒక మార్గంలో వెళ్తానని చెప్పి మరో మార్గంలో వెళ్లారు. ఆయన కాన్వాయ్ వస్తున్న సమయంలో ట్రాఫిక్ ఉండడంతో అక్కడున్న ఇన్‌స్పెక్టర్‌పై వేటు వేశారు. ఈ విషయం బయటకు రాకుండా వాహనదారులకు ఇబ్బంది కలిగించినందుకు ఆయనను సస్పెండ్ చేసినట్టు పోలీసు కమిషనర్ కార్యాలయం నుంచి ప్రకటన విడుదల చేయించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో పోలీసు శాఖలో ఇన్‌స్పెక్టర్లు ఎదుర్కొన్న ఇబ్బందులకు ఈ మూడు ఉదాహరణలు మచ్చుతునకలు మాత్రమే. నాటి పాలనలో ఉన్న అధికారులకు, పాలకులకు జీహుజూర్ అన్న వారిని అందలం ఎక్కించారు. ఆ ఇన్‌స్పెక్టర్లు ఎక్కడ కోరుకుంటే అక్కడ పోస్టింగ్‌లు ఇచ్చారు. కొంతమంది ఇన్‌స్పెక్టర్లకు పోలీసు కమిషనరేట్‌తో సంబంధం లేకుండా డీజీపీ క్యాంపు కార్యాలయం నుంచి రాత్రికిరాత్రి పోస్టింగ్‌లు ఇచ్చిన సందర్భాలున్నాయి. వైసీపీ ప్రజాప్రతినిధులకు, అధికారులకు వత్తాసు పలికిన ఇన్‌స్పెక్టర్లకు పోస్టింగ్‌లు ఇవ్వడం కోసం నిబంధనలను ఉల్లంఘించారు. అప్పటి వరకు ఉన్న అధికారులను బలవంతంగా బదిలీ చేశారు. నాటి వైసీపీ ప్రభుత్వంలో పోస్టింగ్‌ల్లో వివక్ష ఎదుర్కొని అనేక ఇబ్బందులు పడిన ఇన్‌స్పెక్టర్లకు ఇప్పుడు న్యాయం జరుగుతుందా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఎన్నికల ప్రచారంలో వైసీపీ నేతల మాటలను వేదంగా భావించి, వారితో అంటకాగిన వారి పేర్లను రెడ్‌బుక్‌లో రాశామని టీడీపీ నేతలు చెప్పారు.

గొడుగు మార్చుతున్నారు

వైసీపీ హయాంలో డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి విధేయులుగా వ్యవహరించిన ఇన్‌స్పె క్టర్లు, వైసీపీ ప్రజాప్రతినిధుల మాటలను వేదాలుగా భావించి పనిచేసిన ఇన్‌స్పెక్టర్లు ఇప్పుడు గొడుగు మార్చారు. ఆ ప్రభుత్వం హయాంలో తాము వివక్షను ఎదుర్కొన్నామని ఈసారి పోస్టింగ్‌ల్లో ప్రాధాన్యం ఇవ్వాలని కూటమి ప్రజాప్రతినిధుల వద్దకు ప్రదక్షిణలు చేస్తున్నారు. వైసీపీ పాలనలో ప్రాధాన్య పోస్టుల్లో కూర్చున్న ఇన్‌స్పెక్టర్లు ఇప్పుడు స్థానం మారినా ఆ ప్రాధాన్యాన్ని అందుకోవాలని ఆరాటపడుతున్నారు. ఇదే కనుక కార్యరూపం దాల్చితే నాడు ఇబ్బందులు పడిన ఇన్‌స్పెక్టర్లకు న్యాయం జరగదన్న భావన పోలీసు వర్గాల్లో ఉంది. ఈ అంశాన్ని కూటమి ప్రజాప్రతినిధులు గమనించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

విధివిధానాలేమిటో..?

నేటి నుంచి ఉచిత ఇసుక - విధానంపై స్పష్టత ఇవ్వని అధికారులు

- * పేద ప్రజలు, భవన నిర్మాణ రంగ కార్మికులను దృష్టిలో ఉంచుకుని ఉచిత ఇసుక పథకం
- * గత ప్రభుత్వంలో ఇసుక సిండికేట్‌దే రాజ్యం...
- * ఎన్టీఆర్ జిల్లా నుంచి తెలంగాణాకు భారీగా రవాణా
- * దీన్ని నియంత్రించకపోతే సామాన్యులకు ఇసుక కష్టం
- * సరిహద్దు ప్రాంతాలు, రాచమార్గాలు, దొడ్డిదారుల్లో చెక్‌పోస్టులు ఏర్పాటు చేస్తే మేలు



నిర్ణయించిన నామమాత్రపు ధరలు ఇలా :

	స్టాక్‌యార్డు / డిపో	ధర (టన్నుకు)
1.	కంచల	రూ. 313
2.	మాగల్లు	రూ. 228
3.	కొడవటికల్లు	రూ.252
4.	అల్లూరుపాడు	రూ. 234
5.	అనుమంచిపల్లి	రూ. 313
6.	పోలంపల్లి	రూ. 210
7.	కీసర	రూ. 325
8.	మొగలూరు	రూ. 240

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/కంచికచర్ల) : ఉచిత ఇసుక పథకం నేటి నుంచి ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా అమలౌతుంది. ఈ పథకం సాఫీగా సాగాలంటే జిల్లా యంత్రాంగం స్పష్టమైన విధివిధానాలతో ముందుకు వెళ్లాలి. అయితే ఇప్పటివరకు ఇసుక ఎవరికి ఇస్తారన్నదానిపై స్పష్టత లేదు. జిల్లా యంత్రాంగం కూడా ఆ మేరకు స్పష్టత ఇవ్వలేదు. పొరుగున ఉన్న తెలంగాణా రాష్ట్రంలో ఇసుకకు విపరీతమైన డిమాండ్ ఉంది. అక్కడ భారీగా పెరిగిపోతున్న నిర్మాణరంగంతో ఎన్టీఆర్ జిల్లా నుంచి వైసీపీ హయాంలో అక్రమంగా ఇసుక తరలిపోయింది. రోజుకు 20 మెట్రిక్ టన్నుల ఇసుకను ఇస్తామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన శనివారం నాటి సమావేశంలో అధికారులతో చెప్పారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రాధాన్యతలు నిర్ణయించుకోకపోతే మాత్రం శాండ్ సిండికేట్ కూడా ఇసుక కోసం వాలిపోయే పరిస్థితి ఉంటుంది. ప్రాధాన్యతలను నిర్ణయించటంలో జిల్లా యంత్రాంగం సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

■ ప్రాధాన్యత ఇలా ఉంటే మేలు

మొదటి ప్రాధాన్యత సొంతంగా ఇళ్లు, కాంక్రీటు నిర్మాణాలు చేసేవారికి ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆ తర్వాత బిల్డర్లు, రియల్ ఎస్టేట్ సంస్థలు, డెవలపింగ్ సంస్థలు నిర్మించే భవనాలు, అపార్ట్‌మెంట్స్, గ్రూప్ హౌస్‌లు, బహుళ అంతస్థుల భవనాలు, హై రైజ్ భవనాలు, ప్రభుత్వ డెవలప్‌మెంట్ వర్క్స్ చేపట్టే కాంట్రాక్టర్లకు ఇలా ప్రాధాన్యతలు నిర్ణయించుకోవాల్సిన అవసరం ఉంది.

స్పష్టతలేని అంశాలివే..

- సామాన్య ప్రజలు ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేసుకునే వారికి ఏ ప్రాతిపదికన ఇసుక ఇస్తారన్నది ముఖ్యం. ఇల్లు కడుతున్నారో లేదో తెలుసుకోవటానికి క్షేత్రస్థాయిలో సచివాలయ సిబ్బంది ద్వారా తెలుసుకునే విధానాన్ని అమలు చేస్తున్నారా? గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే.. క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపి ధ్రువీకరించిన తర్వాతే ఇసుకను ఇస్తారా? మరేదైనా విధానం ఉందా అన్న దానిపై స్పష్టత లేదు.
- వినియోగదారుడే వాహనాన్ని మాట్లాడుకుని తీసుకురావాల్సి ఉంటుందని జిల్లా యంత్రాంగం నిర్దేశించింది. వైసీపీ ప్రభుత్వ హయాంలో స్టాక్‌యార్డుల్లోనే రవాణా వాహనాల సిండికేట్ రాజ్యమేలింది. రవాణా చార్జీలను అడ్డగోలుగా వసూలు చేశాయి. స్టాక్ యార్డులలో ట్రాన్స్‌పోర్ట్ వాహనాలు ఉండవా? ఉంటే.. జిల్లా యంత్రాంగ పర్యవేక్షణలోనే ఉంటాయా? అనే స్పష్టత లేదు.

■ చెక్ పోస్టులు ఏర్పాటు చేయాలి

ఎన్టీఆర్ జిల్లా.. పొరుగున ఉన్న తెలంగాణా రాష్ట్రానికి సరిహద్దు ప్రాంతంగా ఉంది. ఖమ్మం, హైదరాబాద్‌లలో విపరీతంగా నిర్మాణాలు జరుగుతున్నాయి. దీంతో అక్కడ ఉన్న ఇసుక డిమాండ్ రీత్యా ఎన్టీఆర్ జిల్లా నుంచి ఇప్పటి వరకు అక్రమంగా వివిధ మార్గాల్లో తరలివెళ్లింది. జాతీయ రహదారి - 65తో పాటు, ఎన్‌హెచ్ - 30ల మీదుగానూ అక్రమంగా ఇసుక రవాణా జరిగింది. ఇవి కాకుండా కంచికచర్ల - మధిర, నందిగామ - మధిర ఆర్‌అండ్‌బీ రోడ్ల మీదుగా కూడా అడ్డదారిలో తెలంగాణా ప్రాంతానికి అక్రమంగా ఇసుక తరలివెళ్లేది. వీరులపాడు, నందిగామ, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట రూరల్, వత్సవాయి గ్రామాల నుంచి మొత్తం 15 డొంక రోడ్లు ఉన్నాయి. తెలంగాణా ప్రాంతానికి ఈ డొంక మార్గాల్లోనూ అక్రమంగా ఇసుక తరలివెళ్లేది. ఈ మార్గాల్లో చెక్‌పోస్టులు పెడితే తప్ప ఇసుక అక్రమ వ్యాపారాన్ని నిలువరించే పరిస్థితి ఉండదు.

నామినల్ ధరలు నిర్ణయం

జిల్లా స్థాయి ఇసుక కమిటీలో కలెక్టర్ నిర్ణయం స్టాక్ యార్డులు, డిపోలలో ఇసుక ధరలను ఎన్టీఆర్ జిల్లాస్థాయి ఇసుక కమిటీ ఖరారు చేసింది. నిర్వహణ ఖర్చుల కోసం నామినల్ ఫీజులను మాత్రమే స్థానిక సంస్థల కోసం వసూలు చేయనున్నారు. నామినల్ ఫీజు, సీజీఎస్టీ, ఎస్‌జీఎస్టీ, ర్యాంపులలో తవ్వకం, యార్డులు, డిపోలకు రవాణా ఛార్జీలు వంటివి కలిపి టన్నుకు నామినల్ ధరను నిర్ణయించారు. ఎన్టీఆర్ జిల్లాలో నిర్ణయించిన ధరలను జిల్లా కలెక్టర్ జీ సృజన ఆదివారం రాత్రి ప్రకటించారు.

దుర్గమ్మకు ఆషాఢం సారె







దుర్గమ్మవారికి సారె సమర్పిస్తున్న గణాచారిల బృందం

» మొక్కులు తీర్చుకున్న భక్తులు.. ఆదివారం కిటకిటలాడిన ఆలయం

వన్‌టౌన్, జూలై 7 : దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో ఆషాఢమాసం రెండవరోజైన ఆదివారం వార్షిక సంప్రదాయం ప్రకారం భారీగా సారె సమర్పణలు జరిగాయి. విజయవాడకు చెందిన రామారావు బృందం 200 మంది, జి.రమణి బృందం 150 మంది, కె.దుర్గాభవాని బృందం 300 మంది, వాగు సెంటర్‌కు చెందిన రంగమ్మ బృందం 100 మంది తదితరులు మొత్తంగా 1826 మంది అమ్మవారికి సారె సమర్పించారు. ఇదే సమయంలో భక్తులు సమర్పించిన పట్టు చీరలకు ఈవో కేఎస్ రామారావు క్యూఆర్ కోడ్ రశీదులను అందజేశారు.

సారె సమర్పించిన గణాచారిలు

దుర్గమ్మవారికి విజయవాడ గణాచారిలు పెద్ద సంఖ్యలో ఆదివారం సారె సమర్పించారు. తొలుత బ్రాహ్మణ వీధిలోని జమ్మిదొడ్డిలో పూజలు నిర్వహించి అక్కడ్నుంచి అమ్మవారికి జేజేలు పలుకుతూ ఊరేగింపుగా ఇంద్రకీలాద్రి చేరుకుని సారె సమర్పించారు. కేరళ వాయిద్యాలు, కళాకారుల ప్రదర్శనలు తదితర విశేష అంశాలతో ఘనంగా ఊరేగింపు సాగింది. పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన



వన్‌టౌన్ : దుర్గగుడి ధర్మపథం వేదికపై ఆదివారం విశాఖపట్నానికి చెందిన వరసిద్ధి వినాయక కూచిపూడి కళాశాలకు చెందిన శిష్యబృందం నాట్యప్రదర్శన చేసింది. జి.కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో అంబాష్టకం, మహాకనకదుర్గా నాట్యంతో పాటు మొత్తం 16 కీర్తనలకు కూచిపూడి నృత్యం చేశారు. హావాభావ ఆహార్యం, నటనశైలిలో తమదైన ముద్రను ప్రదర్శించి భక్తులను ఆకట్టుకున్నారు.

భక్తుల భోజనాలపై ఈవో ఆరా..

దేవస్థానంలో రాత్రిపూట బసచేసే భక్తులకు భోజన సదుపాయంపై ఈవో రామారావు ఆదివారం రాత్రి ఆరా తీశారు. స్వయంగా భక్తుల వద్దకు వెళ్ళి భోజనంలో క్వాలిటీ, శుభ్రత తదితర అంశాలపై భక్తుల నుంచి అభిప్రాయ సేకరణ చేశారు. ఇంకా మెరుగ్గా భోజన వితరణ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు ఆయన అధికారులకు సూచన చేశారు.

సుబ్బారాయుడి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



మోపిదేవి, జూలై 7 : మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయాన్ని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామి వారిని దర్శించుకుని విశేషపూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేషవస్త్రాలో వారిని సత్కరించారు. ఆలయ పర్యవేక్షకులు బొప్పన సత్యనారాయణ స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు న్యాయమూర్తి దంపతులకు అందజేశారు.



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఖమ్మం ఎంపీ రఘురామిరెడ్డి

తిరుపతమ్మను దర్శించిన ఖమ్మం ఎంపీ

పెనుగంచిప్రోలు : తెలంగాణ రాష్ట్రం ఖమ్మం ఎంపీ రామ సహాయం రఘురామిరెడ్డి ఆదివారం తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకొని అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ముందుగా ఆలయ రాజగోపురం వద్ద ఎంపీకి ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు, వేదపండితులు, అర్చకులు వేదమంత్రాలతో స్వాగతం పలికారు. అనంతరం వేదపండితులు, అర్చకులు ఆశీర్వచనం అందజేసి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లాకు చెందిన పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. ఆదివారం తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఈవో కె.రమేశ్ నాయుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తి పారవశ్యంలో ముంచెత్తారు..



గీతాలు ఆలపిస్తున్న మనస్వి, మయూఖి

చలపల్లి : వారిద్దరూ అమెరికాలో పుట్టారు. తల్లిదండ్రులు తెలుగువారు కావటం, ఏటా సెలవులకు భారతదేశం వచ్చివెళుతుండటంతో తెలుగుమూలాలతో, తెలుగు సంస్కృతి.. సంప్రదాయాలను పుణికిపుచ్చుకున్నారు. తొమ్మిది నెలలుగా ఆన్‌లైన్‌లో సంగీతం శిక్షణ పొందుతూ ఆదివారం అమ్మ స్వగ్రామంలో పాటకచేరి ఇచ్చి ఔరా అనిపించారు. వారే చల్లపల్లి మండలం మేకావారిపాలేనికి చెందిన పారిశ్రామికవేత్త గుత్తికొండ కోటేశ్వరరావు, విజయలక్ష్మి దంపతుల మనుమరాళ్లు మనస్వి, మయూఖిలు. ప్రవాస భారతీయులైన కొల్ల శ్రీనివాస్-నవదుర్గా భవానీ కుమార్తెలైన మనస్వి.. మయూఖిలు ఆన్‌లైన్ ద్వారా సంగీతం నేర్చుకున్నారు. సెలవులకు తల్లిదండ్రుల స్వగ్రామాలకు వచ్చిన నేపథ్యంలో ఆదివారం మేకావారిపాలెంలోని రామాలయం ఆవరణలో పాటకచేరి ఏర్పాటు చేయగా, భక్తిపాటలను ఆలపించి ఆహూతులను మైమరపింప చేశారు. పాశ్చాత్య మోజులో తెలుగుభాషనే మర్చిపోతున్న నేటికాలంలో అమెరికాలో జన్మించిన వీరు సంప్రదాయబద్ధంగా సంగీతం నేర్చుకుని కచేరి నిర్వహించిన తీరు స్థానికులను మంత్రముగ్ధులను చేసింది. మనస్వి, మయూఖిలను అందరూ అభినందించి ఆశీర్వదించారు.

పోలవరం కాల్వకు గోదావరి నీళ్లు..

» ఆయకట్టు రైతుల హర్షాతిరేకాలు



పోలవరం కాలువలో జలహారతిస్తున్న రైతులు

పాయకాపురం : కూటమి ప్రభుత్వం.. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆయకట్టు రైతులు ఎదుర్కొన్న సమస్యలు తొలగిపోయాయని గన్నవరం నియోజకవర్గ రైతు అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి అన్నారు. నున్న గ్రామ సమీపంలోని పట్టిసీమ పోలవరం గోదావరి నీళ్లకు ఆదివారం రైతులు జలహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి పోలవరం పట్టిసీమ కాలువ సమీపంలో ఏర్పాటు చేసిన విద్యుత్ మోటార్లను ఆన్‌చేసి గోదావరి నీటిని చెరువులకు వదిలారు. అనంతరం గుంటక సుబ్బారెడ్డి మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ హయాంలో అస్తవ్యస్త విధానాలతో ఆయకట్టు రైతులను తీవ్ర ఇబ్బందులకు గురి చేశారన్నారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చీరాగానే ఆయకట్టు రైతుల సంక్షేమం కోరుతూ పంట పొలాలకు నీరు అందించడం ఎంతగానో ఆనందంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు కలకోటి శ్రీనివాస్ రెడ్డి, మాదు శివరామ్ ప్రసాద్, గంపా శ్రీనివాస్ యాదవ్, బొకినాల తిరుపతిరావు, యార్కారెడ్డి వెంకటరెడ్డి, ఈడే పోతురాజు, ఢిల్లీ కోటేశ్వరరావు, బేతపూడి సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవా సంస్థ ఏపీ గౌరవాధ్యక్షుడిగా కొల్లి



జి.కొండూరు, జూలై 7 : తెలుగు వెలుగు సాహితీ వేదిక జాతీయ స్వచ్ఛంద సేవా సంస్థ జాతీయ కమిటీ నిర్ణయం మేరకు ఏపీ గౌరవాధ్యక్షునిగా జి.కొండూరు ఆక్స్‌ఫర్డ్ హైస్కూల్ చైర్మన్, విద్యావేత్త కొల్లి నాగేశ్వరరావును నియమిస్తూ ఆసంస్థ వ్యవస్థాపకులు, చైర్మన్ పోలోజు రాజ్‌కుమార్ ఆదివారం నియామక పత్రాన్ని అందించారు. ఈమేరకు కొల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ సంస్థ అభివృద్ధి ఎల్లావేళాలా అందుబాటులో ఉంటానని శక్తివంచన లేకుండా కృషి చేస్తానని అన్నారు. తనపై ఇంత బాధ్యత పెట్టినందుకు చైర్మన్‌కు, జాతీయ అధ్యక్షుడు రంగిశెట్టి రమేష్‌కు, జాతీయ ప్రధాన కార్యదర్శి వలబోజు మోహన్‌రావుకు కొల్లి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా యూపీఎస్సీ పరీక్షలు

విజయవాడ లీగల్, జూలై 7 : ఎన్టీఆర్ జిల్లాలో ఆదివారం యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించిన ఈపీఎఫ్‌వో పర్సనల్



అసిస్టెంట్, ఈఎస్ఐసీ నర్సింగ్ ఆఫీసర్ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్టు కలెక్టర్ జి.సృజన తెలిపారు. ఈపీఎఫ్‌వో పరీక్షకు 2,401 మంది, ఈఎస్ఐసీ పరీక్షకు 5,433 మంది అభ్యర్థులకు విజయవాడలో 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేయగా కలెక్టర్ సృజన పీబీ సిద్ధార్థ కళాశాలలోని కేంద్రాన్ని తనిఖీ చేశారు. అభ్యర్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మార్గనిర్దేశనం చేశారు. ఈపీఎఫ్ఓ పరీక్షకు 526 మంది (21.91 శాతం), ఈఎస్ఐసీ పరీక్షకు 4,074 మంది (74.99 శాతం) హాజరైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా అధికారులకు అభినందనలు తెలిపారు.

బూదవాడ ఘటనపై పూర్తిస్థాయి విచారణ

» క్షతగాత్రులకు మెరుగైన వైద్యం
» బాధిత కుటుంబాలను ఆదుకుంటాం
» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సృజన

విజయవాడ లీగల్, జూలై 7 : జగ్గయ్యపేట మండలం, బూదవాడలోని అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాద ఘటనపై పూర్తి విచారణకు ఆదేశించినట్టు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన తెలిపారు. నివేదికలను అనుసరించి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.



ఘటనను కలెక్టర్‌కు వివరిస్తున్న బాధితులు

క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక వైద్య బృందాలు కృషి చేస్తున్నట్టు కలెక్టర్ తెలిపారు. తాడేపల్లి మణిపాల్ ఆసుపత్రి, గొల్లపూడి ఆంధ్రా హాస్పటల్‌లో చికిత్స పొందుతున్న వారిని కలెక్టర్ పరామర్శించారు. ఆంధ్రా హాస్పటల్‌లో 8 మంది, మణిపాల్ హాస్పటల్‌లో 8 మంది చికిత్స పొందుతున్నారని, 16 మందిలో ఐదుగురి పరిస్థితి ఆందోళనకరంగా వుందన్నారు. మెరుగైన వైద్యం అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించినట్టు ఆమె తెలిపారు. ప్రమాదంలో గాయపడిన వారి బంధువులతో మాట్లాడారు. ప్రభుత్వం అన్నివిధాల ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారిలో 8 మంది ఎన్టీఆర్ జిల్లాకు చెందిన వారు కాగా, పల్నాడు జిల్లాకు చెందిన వారు ఒకరు ఉన్నారన్నారు. ఐదుగురు ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారు కాగా, ఒకరు జార్ఖండ్, మరొకరు బీహార్‌కు చెందిన వారు ఉన్నట్టు ఆమె తెలిపారు. కలెక్టర్ వెంట డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని తదితరులున్నారు.

ప్రమాదం వెనుక నిర్లక్ష్యం

(3వ పేజీ తరువాయి)

వారిలో ఆవుల వెంకటేశ్ మృతి చెందాడు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. బాణావత్ స్వామి, గుగులోతు బాలాజీ, గుగులోతు గోప్యా నాయక్, బాణావత్ సైదా, వేముల సైదులు, దారావత్ వెంకటేశ్వరరావు, పరిటాల అర్జున్, ఆవుల వెంకటేశ్వరరావులు బూదవాడ వాస్తవ్యులు. వివేక్‌సింగ్, నగేంద్ర సుదాసింగ్, శుభం సోనీ, గుడ్డు కుమార్, అరవింద్ జైపాల్, దినేష్ కాస్యప, రవికుమార్ విశ్వకర్మ బిహార్, ఉత్తరప్రదేశ్‌కు చెందిన కార్మికులు. బాణావత్ స్వామిని కుటుంబ సభ్యులు జగ్గయ్యపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మిగిలిన వారిని విజయవాడకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం స్వామిని విజయవాడ తరలించారు. గాయపడిన కార్మికులను గొల్లపూడిలోని ఆంధ్రా ఆసుపత్రి, తాడేపల్లిలో ఉన్న మణిపాల్ ఆసుపత్రికి తరలించారు. వారిని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాంగోపాల్, కలెక్టర్ సృజన, పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ పరామర్శించారు.

కట్టలు తెంచుకున్న ఆగ్రహం

అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో కెలన్ బాయిలర్ పేలడంతో బూదవాడ గ్రామవాసుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ప్రమాద ఘటన గురించి తెలియగానే చుట్టుపక్కల ఉన్న వాళ్లంతా అక్కడికి పరుగులు తీశారు. క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించిన తర్వాత ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. అయినా గ్రామస్థులు ఆగలేదు. కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా ఆందోళన చేశారు. మధ్యాహ్నం నుంచి కంపెనీ వద్ద గ్రామస్థులు గుమిగూడారు. యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిపై నినాదాలు చేశారు. బాయిలర్ వద్ద ఇంతకుముందు రెండు, మూడు సార్లు ప్రమాదాలు జరిగినా యాజమాన్యంలో చలనం లేదని ధ్వజమెత్తారు. దీనివల్ల రెక్కాడితే గానీ డొక్కాడని కార్మికులు కనుమరుగైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొంతమంది కార్మికులు కంపెనీ ఆవరణలో ఉన్న పరిపాలనా భవనంపై రాళ్లు రువ్వడంతో కార్యాలయం లోపల ఉన్న కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లు, టీవీలు ధ్వంసమయ్యాయి. గ్రామస్థులు ఆగ్రహంతో ఊగిపోతుండడంతో పోలీసులు వారితో చర్చలు జరిపి శాంతింపచేశారు.

రోడ్డున పడిన కుటుంబం

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులు. పాపంపుణ్యం తెలియని ఇద్దరు పసిపాపలు. తానే జీవితం అనుకున్న భార్య. ఇదీ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఆవుల వెంకటేష్ (36) కుటుంబపరిస్థితి. బూదవాడ గ్రామానికి చెందిన వెంకటేష్ నాలుగైదేళ్ల క్రితం కంపెనీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా చేరాడు. అతడి తండ్రి వీరయ్య పక్షవాతంతో బాధపడుతున్నాడు. తల్లి రమాదేవి వృద్ధురాలు. వీరు కాకుండా భార్య ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మొత్తం కుటుంబభారాన్ని వెంకటేశ్ మోస్తున్నాడు. చాలీచాలని వేతనంతో కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామంలోనే సిమెంట్ కంపెనీ ఉండటంతో ఇక్కడే పనిచేసుకుంటూ కుటుంబాన్ని చూసుకోవచ్చన్న ఆలోచనలో అతడు ఉన్నాడు. కెలన్ బాయిలర్ వద్ద పేలుడు ఘటనలో ఆ మిశ్రమంపై పడటంతో వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించిన కొద్ది సేపటికి అతడు ప్రాణాలు కోల్పోయాడు. విషయం తెలిసిన కుటుంబ సభ్యులు గుండెలు పగిలేలా రోదిస్తున్నారు. వృద్ధాప్యంలో తమకు దిక్కు ఎవరని తల్లిదండ్రుల రోదన వర్ణనాతీతం. కష్టానికి వెళ్లిన కట్టుకున్న భర్త ప్రాణాలు కోల్పోవడంతో ఆమె కన్నీరుమున్నీరవుతోంది.

చంద్రబాబు, మంత్రి ఆరా

అల్ట్రాటెక్ కంపెనీలో ప్రమాద ఘటనపై సీఎం చంద్రబాబు, కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అధికారులతో మాట్లాడారు. ఘటన జరగడానికి గల కారణాలు క్షుణ్ణంగా తెలుసుకున్నారు. దీనిపై ఒక నివేదికను రూపొందించాలని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు.

నరక ప్రయాణం!

» జనరల్ బోగీలలో ప్రయాణికుల దుస్థితి
» బోగీల కుదింపు.. రైళ్ల రద్దుతో దయనీయం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

ఒక వైపు రైళ్ల రద్దు.. మరోవైపు జనరల్ బోగీల కుదింపు.. వెరసి సామాన్యులు రైలు ప్రయాణంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జనరల్ బోగీలు సరిపోక అష్ట కష్టాలు పడుతున్నారు. దీంతో రైలు ప్రయాణం నరకప్రాయంగా మారింది. విజయవాడ-కాకినాడ మధ్య నడిచే రైళ్లలో జనరల్ బోగీలు



కిటకిటలాడిపోతున్నాయి. ఉన్న బోగీలు సరిపోక కిందే కూర్చుంటున్నారు. మరుగుదొడ్లకు వెళ్లే చోటునూ ప్రయాణికులు ఆక్రమించేస్తున్నారు. అటువైపు కాలుకూడా పెట్టలేని పరిస్థితి నెలకొంది. ఎవరైనా బాత్రూమ్‌కు వెళ్లాలన్నా.. వీరిని దాటుకుని వెళ్లలేని దైన్యపరిస్థితి. అన్ని రైళ్లలోనూ కూడా ఇదే పరిస్థితి నెలకొంది. రైళ్లలో ఉండాల్సిన నాలుగు జనరల్ బోగీలను రెండింటికి తగ్గించారు. స్లీపర్ కోచ్‌లను సగానికి సగం తగ్గించారు. దీంతో సామాన్య ప్రయాణికులకు బోగీలు సరిపోవటం లేదు. దీనికితోడు రైళ్ల రద్దుతో పరిస్థితి మరింత జఠిలంగా మారుతోంది. రైల్వేబోర్డు అయినా కళ్లు తెరిచి సామాన్యుల కష్టాలను తీర్చాలన్న డిమాండ్ వ్యక్తం అవుతోంది.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

» బొప్పరాజు వెంకటేశ్వర్లు

బస్‌స్టేషన్, జూలై 7 : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు త్వరలోనే ముఖ్యమంత్రిని కలవనున్నట్టు ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. ఆదివారం విజయవాడలో ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యవర్గ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఇటీవల ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ను కలిసి 11వ పీఆర్సీ బకాయిలు, 2018 నుంచి డీఏ బకాయిలు, తదితర అంశాలను వివరించామని త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబును కూడా కలిసి సమస్యలను వివరిస్తామని తెలిపారు. 16 లక్షల మంది ఉద్యోగుల ఆవేదన, వారు పడుతున్న ఇబ్బందులను వివరించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. స్టేట్ జనరల్ సెక్రటరీ పలిశెట్టి దామోదరరావు మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులను విలీనం చేసి రిఫరల్ ఆసుపత్రుల వైద్య సౌకర్యాలను తొలగించారన్నారు. ప్రస్తుతం ప్రతి ఉద్యోగి నుంచి రూ.300 వరకు జీతాల నుంచి రికవరీ చేస్తున్నా వైద్య సౌకర్యాలు అందుబాటులో లేని పరిస్థితి ఉందన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడం వల్ల ఆర్టీసీ లాభపడుతుందని, అయితే బస్సుల సంఖ్యను పెంచి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య మాట్లాడుతూ, మాజీ ఎండీ ద్వారకా తిరుమలరావును కలిసి పెన్షనర్లు పదవీ విరమణ చేసిన ఉద్యోగులతో పాటు ఉద్యోగులకు సంబంధించి అనేక అంశాలపై లేఖలు ఇచ్చి చర్చించామని తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ పి.సుబ్రహ్మణ్యంరాజు, ఉపప్రధాన కార్యదర్శి జి.నారాయణరావు, ఎండీ ప్రసాద్, ఇ.భానుమూర్తి, స్టేట్ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కె.నాగేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి ఎండీఏ సిద్ధిక్‌తో పాటు 26 జిల్లాలకు చెందిన రాష్ట్ర కమిటీల బాధ్యులు, జోన్ల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బొప్పరాజు



సమావేశంలో పాల్గొన్న సమతా సైనికదళ్

జగన్ అహంకారం వీడాలి

» సమతా సైనికదళ్

గవర్నర్‌పేట, జూలై 7 : దళిత, బడుగు, బలహీన వర్గాల పట్ల నిరంకుశ వైఖరి వల్లే వైఎస్ జగన్మోహనరెడ్డి ప్రభుత్వాన్ని, పార్టీని ఎస్సీ, ఎస్టీ, బీసీలు పాతాళానికి నెట్టేశారని, ఇప్పటికైనా జగన్ తన అహంకార వైఖరి విడనాడాలని సమతా సైనిక్‌దళ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం సూచించింది. ఆదివారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకెలో సమతా సైనికదళ్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి అన్ని జిల్లాల నుంచి అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. సమావేశంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు, హైకోర్టు న్యాయవాది పాలేటి మహేశ్వరరావు మాట్లాడుతూ, చంద్రబాబు నేతృత్వంలో నూతన ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలు వైసీపీని పూర్తిగా తిరస్కరించినా జగన్ మంత్రివర్గంలో పనిచేసిన కొందరు మాజీలు విద్వేష పూరిత ప్రసంగాలు చేసి రాష్ట్రంలో దాడులకు కుట్ర పన్నుతున్నారని, ప్రజలు వీటిని గ్రహించి అప్రమత్తంగా ఉండాలని కోరారు. అంబేద్కర్ విదేశీ విద్యా పథకాన్ని మరల ప్రవేశపెట్టడం, బడుగు, బలహీన వర్గాల వారికి, మహిళలు, వికలాంగులకు పెన్షన్ పెంచినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. జగన్ ప్రభుత్వం రద్దు చేసిన పథకాలను పునరుద్ధరించాలని చంద్రబాబును కోరారు. ఎమ్మెల్సీ అనంతబాబు చేతిలో హత్యకు గురైన దళిత యువకుడు సుబ్రహ్మణ్యం కేసును సీబీఐ విచారణకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగన్ ప్రభుత్వంలో దుర్వినియోగం చేసిన ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంస్థ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లి సురేంద్రబాబు, సంఘం అధ్యక్షుడు గొల్ల వరప్రసాద్ తదితరులు ప్రసంగించారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

» మంత్రి కొల్లు రవీంద్ర



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, జూలై 7 : ఏళ్ల తరబడి అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని రాష్ట్ర మైన్స్, ఎక్సైజ్, జియాలజీశాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. స్థానిక అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయం వద్ద ఆదివారం మంత్రి రవీంద్ర ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పెద్ద సంఖ్యలో ప్రజలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, టీడీపీ నాయకులు తమ డివిజన్లలోని సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. ఆదివారం మంత్రికి 620 మంది వినతిపత్రాలు సమర్పించారు. అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను పరిష్కరించాలని మంత్రి రవీంద్రకు సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, టీడీపీ నాయకులు, జనసేన నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా అధికారులతో మాట్లాడి కొన్ని సమస్యలను మంత్రి అక్కడికక్కడే పరిష్కరించారు.

నూతన కార్యవర్గం



వన్‌టౌన్, జూలై 7 : ఏపీ అగ్రికల్చరల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ కృష్ణాజిల్లా శాఖ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. ఎన్నికల అధికారిగా ఎం.శ్రీనివాస్, పరిశీలకులుగా శ్యామ్‌సుందర్ వ్యవహరించారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్, ప్రధాన కార్యదర్శి రవికుమార్ కార్యక్రమానికి హాజరై నూతనంగా ఎన్నికైన కృష్ణాజిల్లా కార్యవర్గ సభ్యులను అభినందించారు. అధ్యక్షుడిగా విజయవాడకు చెందిన వెన్నా రమేష్, సహ అధ్యక్షుడిగా మచిలీపట్నానికి చెందిన ఎం.శ్రీహరి బాబ్జి, ఉపాధ్యక్షులుగా వి.శ్రీనివాసురావు, వీవీ దుర్గారావు, జి.చెన్నకేశవరావు, కార్యదర్శిగా కేవీ కోటేశ్వరరావు, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఎస్కే అమీర్‌బాషా, మహిళా కార్యనిర్వాహక కార్యదర్శిగా వై.రేణుక, సంయుక్త కార్యదర్శులుగా జేవీఆర్ రాజా, జి.మాధవరావు, జె.పద్మజవాణి, మహిళా సంయుక్త కార్యదర్శిగా ఎ.సుకన్య, కోశాధికారిగా జీవీ రాకేష్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా డి.బాలకృష్ణ, స్టేట్ కౌన్సిలర్‌గా పి.వాసుదేవరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

పక్కా వార్డుల్లోనే పత్తా లేకుండా పోయాం..

సామినేని నిర్వేదం!

జగ్గయ్యపేట, జూలై 7 : ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుంచి రాత్రింబవళ్లు ఆలోచిస్తునే ఉన్నా.. నిద్ర పట్టడంలేదు.. ఇంత ఘోర ఓటమి ఎలా పొందాం.. పేటలో పక్కా వార్డులలో పత్తా లేకుండా పోయాం.. గ్రామాల్లోను అదే పరిస్థితి.. అని జగ్గయ్యపేట నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను ఆవేదన వ్యక్తం చేశారు. కళ్లెదుటే ఇవీఎంలు సీల్ వేశారు.. తీశారు. అవకతవకలు జరిగాయి.. ఆధారాల్లేవు అంటూ వాపోయారు. ఆదివారం బి.కన్వెన్షన్ హాలులో ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి కార్యకర్తల సమావేశంలో తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో ఒక కార్యకర్త తరచు అడ్డు తగులుతుండటంతో ఆయన స్టేజి దిగి వచ్చి చేయిచేసుకుని బయటకు పంపించారు. ఈ సందర్భంగా ఎన్నికల ఫలితాల అనంతరం దాడుల్లో నష్టపోయిన ఆరుగురు కార్యకర్తలకు రూ.3.50లక్షల పరిహారాన్ని అందజేశారు. సమావేశంలో మాజీ చైర్మన్‌లు, మునిసిపల్ కౌన్సిలర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

అసాంఘిక శక్తులకు వంత పాడిన వైసీపీ నేత

తిరువూరు: గ్రామంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న రౌడీషీటర్ కాలసాని చెన్నారావు(రాడ్డు)ను సమర్థిస్తూ వైసీపీ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు వ్యాఖ్యలు చేయడం శోచనీయమని టీడీపీ నాయకులు వాసం మునియ్య బొమ్మసాని మహేశ్‌లు విమర్శించారు. ఆదివారం పట్టణంలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, గతంలో ఎ.కొండూరు మండలం కంభంపాడు గ్రామంలో ప్రజల్ని భయభ్రాంతులకు గురిచేస్తూ అరాచకాలు చేస్తున్నాడని, ఎ.కొండూరు స్టేషన్‌లో చెన్నారావుపై కేసు పెట్టిన స్వామిదాసుకు.. వైసీపీలోకి వెళ్లగానే రౌడీషీటర్ మహాత్ముడైనట్టు నంగనాచి కబుర్లు చెప్పడం ఆయన రాజకీయ దౌర్భాగ్యమన్నారు. ఎమ్మెల్యే కొలికపూడిపై తప్పుడు ఆరోపణలు చేస్తూ వైసీపీ నేతలు ప్రజల్ని మభ్యపెట్టేలా కుయుక్తులు పన్నుతున్నారని ఆరోపించారు. సమావేశంలో పార్టీ నాయకులు సింధు శ్రీను, చిత్తలూరి శశి, మొహిద్దీన్, మస్తాన్, భూమా సురేశ్, చిత్తలూరి నరసింహారాజు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఉసురు తీసిన ఇసుక గుంత

» మునేరులో దిగి బాలుడి మృతి



జగ్గయ్యపేట, జూలై 7 : పోలంపల్లి వద్ద మునేరు ఆనకట్ట వద్ద ఆదివారం ఇసుక కోసం అక్రమార్కులకు తీసిన గుంత బాలుడి ప్రాణాన్ని బలిగొన్నది. ఆంధ్రా, తెలంగాణ సరిహద్దు వత్సవాయి మండలం పోలంపల్లి వద్ద మునేరు డ్యాంను చూసేందుకు వత్సవాయి సమీపంలో బోనకల్లు నుంచి ఆరుగురు స్నేహితులు సరదాగా వచ్చారు. వారిలో సాయి (14) మునేటిలోకి దిగాడు. అంతంతమాత్రం నీటి ప్రవాహం ఉండటంతో డ్యాంలోకి వెళ్లగా అక్కడ ఇసుక కోసం తవ్విన గుంతను గమనించక అందులో పడి పైకి రాలేకపోయాడు. స్నేహితుల కేకలు విని పక్కన ఉన్న రైతులు వచ్చి బాలుడిని బయటకు తీసేలోపే మృతి చెందాడు. ఇసుక కోసం 10- 20 అడుగుల లోతున గోతులు తవ్వటం, అక్కడ నీరు చేరటంతో గమనించని బాలుడు మృత్యువాత పడ్డాడు. ఈ ప్రాంతం తెలంగాణలో పెద మండవ గ్రామ పరిధిలో ఉండటంతో ముదిగొండ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	236
చికెన్ స్కిన్‌లెస్	246



నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.50

భోజన ప్యాకెట్ల పంపిణీ

చిట్టినగర్, జూలై 7: నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం జనసేన కార్యకర్తలు రోడ్ల వెంబడి అనాథలకు, పేదలకు భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. బీఆర్టీఎస్ రోడ్డు, చిట్టినగర్ సొరంగం, గవర్నమెంట్ హాస్పిటల్ వద్ద భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. జనసేన కార్యకర్తలు డి.కార్తీక్, టి.కోటి, ఎన్.శ్రీకాంత్, జి.కిరణ్, ఇ.గిరి, కె.సతీష్, డి.దుర్గారావు, సీహెచ్ చరణ్, సీహెచ్ రమణయ్య తదితరులు పాల్గొన్నారు

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

చిట్టినగర్, జూలై 7: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నగరాల యువజన సంఘం ఆధ్వర్యంలో ఆదివారం చిట్టినగర్‌కు చెందిన ఓ పేద విద్యార్థికి ఫీజు నిమిత్తం ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పోతిన రమేష్, పైలా సురేష్, బెవర మురళి, పొట్నూరి సింహాచలం, గూడేల శ్రీను, జగుపిళ్ల భాను తదితరులు పాల్గొన్నారు.

కొండ ప్రాంత ప్రజలంటే

అంత చులకనా?

● కార్పొరేటర్ చంటిని, మునిసిపల్ అధికారులను నిలదీసిన పెద్దమ్మగుడి ప్రాంతవాసులు

వన్‌టౌన్, జూలై 7: కొండ ప్రాంత ప్రజలంటే అంత చులకన ఎందుకని, మేము మనుషుల్లా కనిపించడం లేదా అని 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి)ని, మునిసిపల్ కార్పొరేషన్ అధికారులను పెద్దమ్మ గుడి ప్రాంత స్థానికులు నిలదీశారు. శుభోదయం ప్రజాదర్బార్ కార్యక్రమంలో భాగంగా పెద్దమ్మ గుడివద్ద ఆదివారం స్థానికులను చంటి పలకరించారు. మునిసిపాలిటీ సిబ్బంది వ్యర్థపదార్థాల సేకరణకు రావడం లేదని, కాలువల్లో చెత్త తీసేవారు రావడం లేదని, పలు సమస్యలను స్థానికులు ప్రస్తావించారు. కాలువల్లో చెత్త పేరుకుపోతోందని, దోమలు పెరిగిపోతున్నాయని, మంచినీటిలో నలకలు వస్తున్నాయని, మెట్ల మార్గాలు సరిగ్గా లేవని, చెట్లు పెరిగి పాములు ఎక్కువగా తిరుగుతున్నాయని తెలిపారు. స్పందించిన కార్పొరేటర్ సమస్యలను కార్పొరేషన్ అధికారుల దృష్టికి, ఎంపీ, ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళతానని స్థానికులకు హామీ ఇచ్చారు.

ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చేలా

అమరావతిని అభివృద్ధి చేస్తాం

● ప్రధాని మోదీతో చంద్రబాబు భేటీలో అనేక ప్రాజెక్టులకు ఆమోదం: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, జూలై 7: "అమరావతి రాజధానికి ప్రపంచస్థాయి గుర్తింపు వచ్చేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి చేస్తారు. ఇటీవల ప్రధాని నరేంద్రమోదీతో జరిగిన భేటీలో అనేక ప్రాజెక్టులు ఆమోదం పొందాయి. విజయవాడలో ఇప్పుడు ఉన్న ఫ్లైఓవర్‌కు అనుసంధానంగా ప్రభుత్వ హాస్పిటల్ వద్ద నుంచి నిడమానూరు వరకు ఫ్లైఓవర్ నిర్మాణానికి కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీ సూత్రప్రాయంగా అంగీకరించారు. ఈ ఫ్లైఓవర్ నిర్మిస్తే నగరంలో ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరుకుతుంది." అని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. కరెన్సీనగర్లోని స్థల యజమానుల సంక్షేమ సంఘం కార్యాలయంలో లక్ష్మీఫౌండేషన్ హాస్పిటల్స్ సహకారంతో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గద్దె రామ్మోహన్ మాట్లాడారు. విజయవాడ కార్పొరేషన్‌పై భారం పడకూడదన్న ఆలోచనతో జీతాలను 010 ద్వారా ప్రభుత్వమే చెల్లిస్తోందని తెలిపారు. నెలకు రూ.18కోట్ల భారం కార్పొరేషన్‌కు తగ్గుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, వంగల కృష్ణప్రసాద్, మురళీకృష్ణ, బాయన బాబ్జి, గద్దె రమేష్, తిరుమల విశ్వేశ్వరరావు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అనురాధ దంపతులను సత్కరిస్తున్న రాధామాధవ్ అపార్టుమెంట్‌వాసులు

ప్రజల బలమైన కోరికతోనే కూటమికి అధికారం: గద్దె రామ్మోహన్

మొగల్రాజపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్రం బాగుపడుతుందని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమిని ప్రజలు నమ్మి ఓట్లేశారని, పదివేల ఓట్ల మెజార్టీ వస్తేనే గొప్పగా చెప్పుకొనే ఈ రోజుల్లో మూడోసారి పోటీలో ఉన్న తనకు యాభైవేల పైన మెజార్టీ వచ్చిందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 8వ డివిజన్ పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో ఉన్న జీఈవీ రాధామాధవ్ అపార్టుమెంట్‌వాసులు అపార్టుమెంట్ ఆవరణలో ఆదివారం గద్దె రామ్మోహన్‌కు ఆయన భార్య జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ అనురాధకు ఆత్మీయ సన్మానం చేశారు. ప్రజలు వైసీపీకి బుద్ధి చెప్పి ప్రతిపక్ష హోదా ఇవ్వకపోయినా పోలవరం పూర్తికాకుండా అడ్డుకునే కుట్రలు ఇంకా చేస్తూనే ఉందని గద్దె రామ్మోహన్ ఆగ్రహం వ్యక్తంచేశారు. వైసీపీ దుష్ప్రచారాలను తిప్పికొట్టాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో అపార్టుమెంట్ సంఘం అధ్యక్షుడు డాక్టర్ చంద్రశేఖర్, కార్పొరేటర్లు చెన్నుపాటి ఉషారాణి, జాస్తి సాంబశివరావు, ముమ్మనేని ప్రసాద్, అనూప్, సీతారామరాజు, శిరీష్, ఏవీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో నార్నెపాడు శాసనం

● శాసనాన్ని భద్రపరచాలంటున్న పురావస్తు పరిశోధకుడు డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి

విజయవాడ కల్చరల్, జూలై 7: పల్నాడు జిల్లా, ముప్పాళ్ల మండలం, నార్నెపాడు భీమేశ్వరాలయం బయట క్రీ.శ 12వ శతాబ్ది శాసనం నిర్లక్ష్యానికి గురవడంపై పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈవో డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. చరిత్ర అభిమానులు మణిమేల శివశంకర్, స్వర్ణ చినరామిరెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు ఆయన ఆదివారం ఈ శాసనాన్ని పరిశీలించారు. ఆలయ జీర్ణోద్ధరణ సందర్భంగా ఈ శాసనాన్ని రోడ్డుపై పడేశారని, కింద పీఠం, పైన శాసన రాయి, దానిపైన నంది, విగ్రహం అలనాటి శాసన విధానాన్ని తెలియజేస్తుందని తెలిపారు. శాసనరాయిపై క్రీ.శ 1151 నాటివి రెండు, క్రీ.శ 1198 నాటిది ఒకటి, క్రీ.శ 12వ శతాబ్ది తేదీ లేనివి రెండు, క్రీ.శ 1266 నాటిది ఒకటి కలిపి మొత్తం ఆరు శాసనాలున్నాయని తెలిపారు. వీటిని 1933లో నకళ్లు తీశారన్నారు. ఇటీవల కేంద్ర పురావస్తుశాఖ, శాసన విభాగ సంచాలకుడు, డాక్టర్ కె.మునిరత్నంరెడ్డి ప్రచురించారని పేర్కొన్నారు. శ్రీనారాయణపాడు అని శాసనంలో పేర్కొన్న నార్నెపాడులో క్రీ.శ 1151 శాసనాల్లో వొరిగొండ పోలనామాత్యుడు, మందాడి కొమ్మినామాత్యుడు, క్రీ.శ 1198 శాసనంలో వల్లూరి నామనాయకుడు స్థానిక సోమేశ్వర (సోమనాథ), కేశవస్వామి అఖండ దీపాలకు గొఱ్ఱెల్ని దానం చేసినవి, గ్రామంలోని సోమనాథాలయంలో మండెపూడి సూరమనాయుడు నందిని ప్రతిష్ఠించిన వివరాలు ఉన్నాయని తెలిపారు. క్రీ.శ 12 శతాబ్దినాటి వెలనాటి రాజేంద్రుని శాసనంలో బాపట్ల సమీపంలోని చందోలు నుంచి పాలిస్తున్న రెండో గొంకరాజు, ఆయన భార్య ప్రోలాంబిక, మంత్రి కొమ్మనామాత్యులు, రెమ్మన అనే కమ్మ దేశాధిపతి ప్రస్తావనలు ఉన్నాయని తెలిపారు. అదే గ్రామంలో ద్రోణ (దొర) సముద్రమనే చెరువును తవ్వించిన వివరాలున్నాయని తెలిపారు. కమ్మదేశాన్ని (కమ్మనాడు) ప్రస్తావిస్తున్న చారిత్రక ప్రాధాన్యం గల 800 ఏళ్లనాటి ఈ శాసనాన్ని ఆలయంలోకి తరలించి, యథావిధిగా నిలబెట్టి కాపాడుకోవాలని గ్రామస్థులకు సూచించారు.



నార్నెపాడు శాసనాన్ని పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి

రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

వన్‌టౌన్, జూలై 7: విజయవాడ, కృష్ణా కెనాల్ మధ్య ఆదివారం ఓ గుర్తు తెలియని 45 ఏళ్ల వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. మృతుడి దేహంపై తెల్లటి పొడుగుచేతుల చొక్కా, నల్ల ప్యాంటు ఉన్నాయని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లలితా విష్ణు సహస్రనామ స్తోత్ర వైభవం గ్రంథాల వితరణ

వన్‌టౌన్, జూలై 7: ఆషాఢ మాసం సందర్భంగా ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు సారె సమర్పించేందుకు వచ్చే మహిళాభక్తులకు పురాణపండ శ్రీనివాస్ రచించిన లలిత విష్ణు సహస్రనామ స్తోత్ర వైభవం గ్రంథాలను దేవస్థానం ఈవో కేఎస్ రామారావు ఉచితంగా పంపిణీ చేశారు. ఆదివారం సారె సమర్పణకు వచ్చిన భక్తులకు ఆయన పుస్తకాలు పంపిణీ చేశారు. నలభై రోజులుగా ఏడు ఆధ్మాత్మిక గ్రంథాలను దుర్గమ్మ సన్నిధిలో ఆవిష్కరించడం అమ్మ అనుగ్రహమేనని స్థానాచార్యుడు విష్ణుభట్ల శివప్రసాదశర్మ అన్నారు. ఆదివారం పలు ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారికి సారె సమర్పించారు. రద్దీ దృష్ట్యా భక్తులు అమ్మవారిని శీఘ్రంగా దర్శించుకునేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులు ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. ఆషాఢమాసం సందర్భంగా నిర్వహిస్తున్న వారాహి నవరాత్రుల్లో రెండో రోజైన ఆదివారం అర్చక బృందాలు పూజలు చేశాయి.



దుర్గాదేవి వేషంలో ఉన్న భక్తురాలికి గ్రంథాన్ని అందజేస్తున్న ఈవో రామారావు



కాపు విద్యాభవన్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ప్రతి పార్లమెంట్ కేంద్రంలో కాపు విద్యాభవన్లు

● కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రమణ్యం

గవర్నర్‌పేట, జూలై 7: ప్రతి పార్లమెంట్ నియోజకవర్గ కేంద్రంలో కాపు విద్యాభవన్లు అందుబాటులోకి తెస్తున్నామని కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రమణ్యం తెలిపారు. కాపునాడు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న కాపు విద్యాభవన్ల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించారు. బాలికల కోసం కృష్ణలంకలో ఏర్పాటు చేసిన కాపు విద్యాభవన్-1ను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించారు. పేద కాపు విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించే లక్ష్యంతో విద్యాభవన్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. కాపునాడు అనుబంధ కాపునాడు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని గాళ్ల సుబ్రమణ్యం తెలిపారు. తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసరావు, కాపునాడు రాష్ట్ర అధ్యక్షుడు అర్జా రామకృష్ణ, కాపునాడు సిద్ధాంతకర్త లక్కినేని ప్రసాద్, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

శ్రవణానందకరంగా త్యాగరాజస్వామి పంచరత్న కృతుల గోష్టిగానం

విజయవాడ కల్చరల్, జూలై 7: ఎందరో మహానుభావులు అందరికీ వందనములు అంటూ సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి పంచరత్న కృతులను బృందగానం చేసి శ్రోతలకు శ్రవణానందభరితంగా నిర్వహించారు. సత్యనారాయణపురం శివరామకృష్ణక్షేత్రంలో శ్రీవారి శిష్య ప్రశిష్య బృందం అధ్వర్యంలో రెండో రోజు ఆదివారం సంగీత సద్గురువర్యుల సంగీత ఆరాధన ఉత్సవాల్లో భాగంగా ఘనరాగ పంచరత్న కృతుల గోష్టి గానం నిర్వహించారు. 30 మంది విద్వాంసులు గోష్టిగానంలో పాల్గొన్నారు. బృందగానంలో సంగీత విద్వాంసులు మోదుమూడి సుధాకర్, కె.హేమలక్ష్మి, ఎస్.నాగలక్ష్మి, ఆర్.పద్మ చక్రవర్తి, ముకుంద ప్రవీణ్, పి.నందకుమార్, పారుపల్లి ఉజ్వలకార్తికేయ, ఆర్.అమూల్య, కల్పన, స్వరజ, జి.ద్రోణేంద్రఫణికుమార్, దుర్గాభవాని పాల్గొన్నారు



పంచరత్న కృతులు గానం చేస్తున్న మోదుమూడి సుధాకర్ బృందం

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

మొగల్రాజపురం, జూలై 7: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి 30 ఆవిర్భావ దినోత్సవాన్ని 8వ డివిజన్ పెటెంగేల్ పేటలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. టీడీపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి మల్లెల రామకృష్ణ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలు నిర్వహించారు. జంతిక నారాయణ, మామిడి రాంబాబు, మల్లెల రమేష్, దేవపొంగు కృపారావు, ఎలీషా, సుగుణమ్మ, జైహింద్‌రావు, మెరకనపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.



వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఇంటి నుంచి వెళ్లిన లారీడ్రైవర్ తిరిగి రాలేదని ఫిర్యాదు

వన్‌టౌన్, జూలై 7: కృష్ణలంక రాఘవయ్య వీధికి చెందిన లారీ డ్రైవర్ చోడె రమేష్ ఈ ఏడాది మార్చి 19వ తేదీన రాత్రి 8.30 గంటలకు ఇంటిలో నుంచి బయటకు వెళ్లిపోయి, అప్పట్నుంచి తిరిగి రాలేదని అతని అక్క మంగినేడు ధనలక్ష్మి ఆదివారం కృష్ణలంక పోలీసులకు ఫిర్యాదు చేసింది. రమేష్‌కు అతని భార్యకు మధ్య గొడవ జరగడంతో బయటకు వెళుతూ అక్క ఇంటికి వెళ్తొస్తానని చెప్పాడని, మళ్లీ తిరిగిరాలేదని, వెదికినా ఆచూకీ తెలియలేదని ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



ఈస్ట్ లయన్స్ క్లబ్ ప్రతినిధులతో డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి

విజయవాడ ఈస్ట్ లయన్స్ క్లబ్ కార్యవర్గం ప్రమాణస్వీకారం

వన్‌టౌన్, జూలై 7: విజయవాడ ఈస్ట్ లయన్స్ క్లబ్ నూతన ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని ఆదివారం మారుతీనగర్‌లోని లయన్స్‌క్లబ్‌లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మానసిక వైద్యుడు డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి విచ్చేశారు. క్లబ్ అధ్యక్షుడు బోడేపూడి హనుమమయ్య, కార్యదర్శి రఘురామశర్మ, కోశాధికారి బెల్లాని రమేష్, కార్యవర్గంతో లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మిరియాల వెంకటేశ్వరరావు ప్రమాణస్వీకారం చేయించారు. అత్యధిక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి మధుమేహం, కేన్సర్ వంటి వ్యాధులపై సామాన్యులకు అర్థమయ్యేలా కౌన్సెలింగ్ ఇవ్వాలని, వైద్య పరీక్షలు నిర్వహించాలని వెంకటేశ్వరరావు సూచించారు. వైద్య శిబిరాలు నిర్వహించి 111 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు నూతన అధ్యక్షుడు హనుమయ్య తెలిపారు. ఇంకా మరిన్ని వైద్యశిబిరాల ద్వారా వ్యాధులపై అవగాహన కల్పిస్తామని ఆయన తెలిపారు.

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి 7వ డివిజన్ సమస్యలు

మొగల్రాజపురం, జూలై 7: 7వ డివిజన్‌లోని సీఆర్ నగర్, పుట్టరోడ్డు, జెండా రోడ్డు ప్రాంతాల్లో సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టిలో పెట్టామని తెలుగుయువత తూర్పు నియోజకవర్గ అధ్యక్షుడు కర్రి రాజేష్ తెలిపారు. నడకదారిలో సరైన రోడ్లు లేవని, తాగడానికి మంచినీరు లేక అక్కడి స్థానికులు పడుతున్న ఇబ్బందులను వివరిస్తూ, వాటిని పరిశీలించి పరిష్కరించాలని కోరుతూ యువ నాయకుడు గద్దె క్రాంతికి ఆదివారం వినతిపత్రం ఇచ్చామని ఆయన పేర్కొన్నారు. తమ సమస్యలను ఫొటోల రూపంలో ఇవ్వడంతో వాటిని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని క్రాంతి హామీ ఇచ్చారని రాజేష్ తెలిపారు. తనతో పాటు డివిజన్ ఐ టీడీపీ ఇన్‌చార్జి జాగరాపు బాలు పాల్గొన్నారని తెలిపారు.

దిక్సూచి
DIKSUCHI

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

జాతీయ అత్యవసర పరిస్థితి (1975)
ఒక సమగ్ర అవగాహన

ఇటీవల 18వ లోక్‌సభ కొలువుతీరిన తొలి రోజున భారతదేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించి 49 ఏళ్లు కావస్తున్న సందర్భంగా ప్రధాని ఆనాటి దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడిన యోధులకు నివాళి అర్పించారు. అదేవిధంగా స్పీకర్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెడుతూ 1975 నాటి అత్యవసర పరిస్థితి కాలాన్ని భారతదేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా వర్ణించారు. సభలో ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ వాయిదా పడింది. ఈ సంఘటన 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితిపై దేశప్రజలందరూ దృష్టిసారించేలా చేసింది. ఈ నేపథ్యంలో 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితి విధింపునకు కారణాలు, ఎమర్జెన్సీ కాలపు నిరంకుశ పద్ధతులు, రాజ్యాంగ సవరణలు, తదనంతర కాలంలో తీసుకొచ్చిన రాజ్యాంగ మార్పులు తదితర అంశాలపై అవగాహన ఆవశ్యకం.

భారత రాజ్యాంగంలో అత్యవసర పరిస్థితి నిబంధనల చేర్పు

ఏదైనా అంతర్గత లేదా బాహ్య కారణాలు లేదంటే ఆర్థిక పరిస్థితుల కారణంగా దేశ భద్రత, ఐక్యత, సమగ్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉంటే ఆ పరిస్థితులనే అత్యవసర పరిస్థితులుగా పరిగణిస్తారు. వీటిని ఎదుర్కొనడానికి, దేశాన్ని ఏకతాటిపై ఉంచడానికి కేంద్రానికి ప్రత్యేక అధికారాలు అవసరమని, ఆ అధికారాలను రాజ్యాంగ నిబంధనల పరంగా అందించాలని డా.బీ.ఆర్. అంబేద్కర్, టీ.టీ.కృష్ణమాచారి, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ వంటి న్యాయ కోవిదులు రాజ్యాంగ రచన సమయంలో భావించారు. ఈ అధికారాల నిరంకుశత్వాన్ని గ్రహించిన ప్రొ.కె.టి. షా, పీ.డీ.దేశ్‌ముఖ్, హెచ్.వీ.కామత్ వంటివారు వ్యతిరేకించడంతో వీటిని ప్రయోగించాల్సిన పరిస్థితులు పెద్దగా రాకపోవచ్చని, అన్యథా అవసరాల కోసమే వీటిని క్రోడీకరిస్తున్నామని వీటిని మృతాక్షరాలుగా పేర్కొనవచ్చని రాజ్యాంగ పరిషత్ చర్చల్లో అంబేద్కర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ 1975 నుంచి 1977 మధ్యకాలంలో 21 నెలలు దేశం చూసిన చీకటి రోజులు అంబేద్కర్ ఆకాంక్షకు గండికొట్టాయి.

> అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీదళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

భారతదేశంలో 1975 నాటి అత్యవసర పరిస్థితి-పరిణామాలు

1971లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజక వర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఎన్నికల సమయంలో ఆమె ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951ని ఉల్లంఘించారని, నిబంధనలకు వ్యతిరేకంగా తన ప్రచార కార్యక్రమాలకు ప్రభుత్వ వనరులను పెద్ద ఎత్తున వినియోగించారు కాబట్టి ఇందిర ఎన్నిక చెల్లదని ఆమె ప్రత్యర్థి రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(7) ప్రకారం ఇందిరాగాంధీ చర్యలను చట్ట ఉల్లంఘనగా పేర్కొంటూ, ఎన్నిక చెల్లదని స్పష్టం చేసింది. అలాగే ప్రధానిగా కొనసాగరాదని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరేళ్ల నిషేధం వర్తిస్తుందని తీర్పు చెప్పింది.

ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇందిరాగాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 1975 జూన్ 24న సుప్రీంకోర్టు ఇందిరాగాంధీ ప్రధానిగా కొనసాగవచ్చని అయితే ఆమె పార్లమెంట్‌లో జరిగే ఏ ఓటింగ్‌లోనూ పాల్గొనరాదని, ఎంపీగా ఆమెకు లభిస్తున్న అన్ని సదుపాయాలను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.



అప్పటికే దేశంలో అనేక ప్రాంతాల్లో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల్లో అవినీతి; నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అశాంతి మొదలైంది. 1979లో గుజరాత్‌లో 'నవ నిర్మాణ్ ఆందోళన్', బిహార్‌లో జయప్రకాష్ నారాయణ్ ఉద్యమం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, మధ్యతరగతి ప్రజలు భారీగా ఈ ఉద్యమాల్లో పాల్గొన్నారు. దేశంలోని అన్ని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మద్దతునిచ్చాయి. నవ నిర్మాణ్ ఉద్యమం కారణంగా గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. జార్జి ఫెర్నాండెజ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున రైల్వే సమ్మె నిర్వహించారు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హై కోర్టు తీర్పునివ్వడం ఈ పరిస్థితులకు ఆజ్యం పోసింది. ఇందిరాగాంధీ రాజీనామా కోసం విపక్షాలు పట్టుబట్టాయి.

సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొంది ప్రధానిగా కొనసాగే అనుమతిని ఆమె తెచ్చుకోవడంతో తరవాతి రోజు 1975 జూన్ 25న ప్రతిపక్ష పార్టీలు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. పోరాటం తీవ్రం చేసేందుకు నిర్ణయించాయి. ఇటువంటి అననుకూల పరిస్థితుల్లో 1975 జూన్ 25 అర్ధరాత్రి జాతీయ అత్యవసర పరిస్థితి విధించారు. మంత్రిమండలిని సంప్రదించకుండానే రాష్ట్రపతికి అత్యవసర పరిస్థితి విధించాల్సిందిగా ఇందిరాగాంధీ సిఫార్సు చేశారు. ప్రతిపక్షాలను అణచివేసి తాను పదవిలో కొనసాగేందుకే రాజ్యాంగ ప్రకరణ 352లో ఉన్న 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని వక్రీకరించి అత్యవసర పరిస్థితి విధించారనే అపకీర్తిని ఇందిర మూటగట్టుకున్నారు. ఈ అత్యవసర పరిస్థితి కాలంలో ఆచరించిన అనేక నిరంకుశ విధానాలు కూడా తీవ్ర విమర్శలకు గురయ్యాయి.

1975 అత్యవసర పరిస్థితి కాలం నాటి వివిధ పరిణామాలు

అత్యవసర పరిస్థితి విధించిన కొన్ని గంటల్లోనే అనేక రాజకీయ పార్టీల నాయకులు అరెస్ట్ అయ్యారు. విజయ రాజే సింధియా, జయప్రకాష్ నారాయణ, ములాయం సింగ్ యాదవ్, మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్, జార్జ్ ఫెర్నాండెజ్, అటల్ బిహారీ వాజపేయి, జ్యోతిబసు, అద్వానీ, అరుణ్ జైట్లీ వంటి పలువురు ప్రముఖులు వీరిలో ఉన్నారు. వీరందరూ ప్రధానంగా 'మీసా'(ఎంఐఎస్ఏ- మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్), డీఐఎస్ఐఆర్(డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్ట్ అండ్ డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్), సీఓఎఫ్ఈపీఓఎస్ఏ(కన్జర్వేషన్ ఆఫ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ స్మగ్లింగ్ యాక్టివిటీస్ యాక్ట్) వంటి కఠిన చట్టాల కింద అరెస్టయ్యారు. జమాతే ఇస్లామీ, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలపై నిషేధం విధించారు.

అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీదళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

దిశలు - దూరాలు


రీజనింగ్



ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-2

ముఖ్య రేఖాచిత్రం




నోట్: ఈ చాప్టర్‌కు సంబంధించి అడిగే ప్రశ్నలకు పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకోవాలి. పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకొంటే విడిల్ పాయింట్‌కు కుడివైపు అంటే తూర్పు, ఎడమవైపు అంటే పడమర, పై వైపు అంటే ఉత్తరం, కిందవైపు అంటే దక్షిణానికి అని అర్థం.

1. **వినయ్ 40మీ. పడమరకు నడిచిన తరవాత దక్షిణం వైపునకు తిరిగి 30మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు 25మీ. నడిచిన తరవాత ఉత్తరానికి తిరిగి 20మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు తిరిగి 15 మీ॥ నడిచాడు. అయితే ఇప్పుడు వినయ్ బయలుదేరిన స్థానం నుంచి ఎంతదూరంలో ఏ దిశలో ఉన్నాడు?**

ఎ) ఉత్తరం 10 మీ. బి) దక్షిణం 10 మీ.
సి) తూర్పు 10 మీ. డి) పడమర 10 మీ.

సమాధానం: (బి)

వివరణ:



పై రేఖాచిత్రంలో బయలుదేరిన స్థానం (L)నకు, చేరుకున్న స్థానం (M) కిందకు ఉంది.

ముఖ్యరేఖాచిత్రం(మెయిన్ డయాగ్రమ్)ను పరిశీలిస్తే విడిల్ పాయింట్ నుంచి కిందకు అంటే దక్షిణం అని చెప్పారు. అంతేకాక పై రేఖాచిత్రాన్ని బట్టి వినయ్ బయలుదేరిన స్థానం నుంచి 10 మీ. దూరంలో ఉన్నాడని తెలుస్తుంది. సమాధానం దక్షిణం 10 మీ.

షార్ట్‌కట్: ముందుగా ప్రశ్నలో ఇచ్చిన సమాచారాన్ని రాసుకోవాలి. అది ఏమంటే పడమర 40, దక్షిణం 30, తూర్పు 25, ఉత్తరం 20, తూర్పు 15. తరవాత ఒకే దిశకు సంబంధించినవి రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు ఉంటే కూడాలి. పై సమాచారంలో తూర్పు 25, తూర్పు 15లను కూడితే తూర్పు 40 అవుతుంది. ఇప్పుడు పై సమాచారం కింది విధంగా ఉంటుంది.

పడమర$_{40}$, దక్షిణం$_{30}$, తూర్పు$_{40}$, ఉత్తరం$_{20}$.


ఇప్పుడు వ్యతిరేక దిశల విలువ సమానంగా ఉంటే అది క్యాన్సిల్. పై సమాచారంలో పడమర $_{40}$, తూర్పు $_{40}$లు క్యాన్సిల్ అవుతాయి. మిగిలిన రెండింటిలో ఏది ఎక్కువ, ఎంత ఎక్కువ అదే సమాధానం అవుతుంది. తూర్పు$_{40}$, పడమర$_{40}$ క్యాన్సిల్ అవగా మిగిలిన దక్షిణం$_{30}$, ఉత్తరం$_{20}$లలో దక్షిణం$_{10}$ ఎక్కువ ఉంది అదే సమాధానం అవుతుంది.

2. **వినోద్ 5మీ. ఉత్తరానికి నడిచిన తరవాత కుడివైపునకు తిరిగి 6మీ. నడిచాడు. తదుపరి మరల ఎడమవైపునకు తిరిగి 3 మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వినోద్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?**

ఎ) 10 మీ. బి) 14 మీ. సి) 12 మీ. డి) 18 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:



D- బయలుదేరిన స్థానం, E- చేరుకున్న స్థానం.
DF- ఒక భుజము 6 మీ॥. EF- మరో భుజము 8 మీ॥ (5 + 3)
DE- కర్ణము

పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం కర్ణము^{2} = భుజము^{2} +భుజము^{2}

కర్ణము^{2} = $6^2 + 8^2$
కర్ణము^{2} = 36 + 64
కర్ణము^{2} = 100

కర్ణము = $\sqrt{100}$ = 10మీ॥

వినోద్ బయలుదేరిన స్థానం (D)కు చేరుకున్న స్థానం (E) 10 మీ. దూరంలో ఉంది.

3. **A, B, C, D అనే నలుగురు బల్లకు నాలుగు వైపుల కూర్చొని క్యారమ్స్ ఆడుతున్నారు. B, D భాగస్వాములు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడు. D తూర్పునకు ముఖభాగం కలిగి ఉన్నాడు. అయితే దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి ఎవరు?**

ఎ) B బి) C సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: A, B, C, D నలుగురు నాలుగువైపులా కూర్చుంటారు. ఎదురెదురు వ్యక్తులు భాగస్వాములౌతారు. B, D భాగస్వాములని చెప్పారు. కాబట్టి A, C మరొక భాగస్వాములు అవుతారు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడని ప్రశ్నలో చెప్పారు. A, Cలు భాగస్వాములు కనుక దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి 'C' అవుతారు.

సమాధానం: సి



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

వార్షిక పనితీరు నివేదికలో 15 వరకు మార్పులకు అవకాశం

● ఎస్ఆర్ఈఎస్ డివిజన్ కార్యదర్శి ఆమంచి



రైల్వేస్టేషన్, జూలై 7: రైల్వే కార్మికుల వార్షిక పనితీరు మదింపు నివేదికలో మార్పులకు ఈ నెల 15 వరకు అవకాశం ఉందని సౌత్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ విజయవాడ డివిజన్ కార్యదర్శి ఆమంచి వెంకటేశ్వర్లు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సంఘ్ జాతీయ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య రైల్వే బోర్డుతో చర్చించి ఈ అవకాశాన్ని కల్పించారన్నారు. ఏడాది పాటు శ్రమించిన రైల్వే కార్మికులకు పదోన్నతులు, ఇంక్రిమెంట్లు, వారి పనితీరు నివేదికపై ఆధారపడి ఉంటాయన్నారు. పదేళ్లుగా ఒక్క పదోన్నతి కూడా రాకుంటే ఆ కార్మికులకు మాడిఫైడ్ ఎష్యూర్‌కెరీర్ ప్రొగ్రెస్ ఆధారంగా ఒక్క ఇంక్రిమెంట్ ఇస్తారన్నారు. కొందరు కార్మికులకు వరుసగా మూడేళ్ల నివేదికలో గుడ్ అని ఉండడం వల్ల ఇంక్రిమెంట్‌ను కోల్పోతున్నారన్నారు. దీనిపై మర్రి రాఘవయ్య బోర్డుతో చర్చించి 2022-2023కు వార్షిక పనితీరు మదింపు నివేదికలో సరిచేసుకునేందుకు ఈ నెల 15 వరకు అవకాశం కల్పించారన్నారు. దీనిపై సీ అండ్ డబ్ల్యు బ్రాంచ్ కార్యదర్శి కర్నూల్ సుకుమార్ సంఘ నేతలకు ధన్యవాదాలు తెలిపారు.



విజేతలతో ముఖ్య అతిథులు

అండర్-19 చెస్ విజేతలు శామ్యూల్, సోనిక

విజయవాడ స్పోర్ట్సు, జూలై 7: సక్సెస్ చెస్ అకాడమీ, ది విజయవాడ చెస్ అసోసియేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని ఐజీఎంసీ లో జిల్లా అండర్-19 బాలబాలికల చెస్ పోటీలు నువ్వానేనా ఆదివారం జరిగాయి. విజేతలుగా బాలురలో మందుల బాబూ శామ్యూల్ 6 పాయింట్లకు 5.5 పాయింట్లతోను, పడాల మహీధర్ (ద్వితీయ), పుచ్చలపల్లి హర్ష సాయిరామ్ (తృతీయ), నడింపల్లి ప్రీతం దర్శన్ (4వ)స్థానంలోను నిలిచారు. బాలికల విభాగంలో దేశెట్టి సోనికా 5 పాయింట్లకు 4.5 పాయింట్లతో ప్రథమస్థానంలో నిలవగా, వై నిశ్చల, ఎస్‌కే నబిహా, ఏ జ్యోతిర్మయి వరుసగా 2, 3, 4 స్థానాల్లో నిలిచారు. వీరంతా నంద్యాల లో 18, 19న జరిగే రాష్ట్రస్థాయి చెస్ టోర్నీలో బరిలో దిగుతారు. విజేతలకు ట్రోఫీల ప్రదానోత్సవంలో ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ ఏజెన్సీ మేనేజర్ అంబటి జయంతి, జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ అక్బర్ పాషా, మందుల రాజీవ్ పాల్గొని అందించారు.

గత ప్రభుత్వంలోనే దెబ్బతిన్న విద్యారంగం

● యూటీఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రసాద్

గవర్నర్‌పేట, జూలై 7: గత ప్రభుత్వం విద్యారంగంలో అమలు చేసిన లోపభూయిష్ట విధానాలతో ప్రభుత్వ విద్యారంగం పూర్తిగా దెబ్బతిందని యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. యూటీఎఫ్ జిల్లా ఆఫీసు బేరర్ల సమావేశం ఆదివారం ఎంజీ రోడ్డులోని యూటీఎఫ్ ప్రధాన కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గాయని, దీని వల్ల భవిష్యత్తులో ప్రభుత్వ విద్య నిరుపేదలకు దూరమయ్యే పరిస్థితి కనబడుతోందన్నారు. నూతన ప్రభుత్వం విద్యారంగాన్ని కాపాడటం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు. 117 జీవోను రద్దు చేయాలని, పాఠశాలల విలీనం ప్రక్రియను నిలిపేయాలని డిమాండ్ చేశారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె. శ్రీనివాసరావు, ఏ సుందరయ్య, డి. అపర్ణ, మచ్చా శ్రీనివాస్, పి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

'అమ్మ' స్ఫూర్తి అభినందనీయం

● కలెక్టర్ డాక్టర్ సృజన

మొగల్రాజపురం/కృష్ణలంక, జూలై 7: ఆంధ్రామోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) 60 ఏళ్లుగా సేవా కార్యక్రమాలు కొనసాగిండమంటే సాధారణ విషయం కాదని అలాంటి అసోసియేషన్‌ను మిగిలిన వారు స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ సృజన అన్నారు. మొగల్రాజపురంలోని అసోసియేషన్ హాల్‌లో ఆదివారం 2024-25 సంవత్సరానికి ఉపకారవేతనాల పంపిణీ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె తమ సిబ్బంది పిల్లల అభ్యున్నతికి అండగా ఉంటున్న సంఘ సభ్యులను అభినందించారు. ప్రపంచంలో పెద్దపెద్ద కార్పొరేట్ సంస్థలు మాత్రమే ఇలా చేస్తుంటాయని కానీ సంఘం 6దశాబ్దాలుగా మనుగడలో ఉంటూ సేవ చేయడం సాధారణ విషయం కాదన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ 400 మందికి సుమారు రూ.16 లక్షల మేర స్కాలర్‌షిప్‌లు అందిస్తున్నామని చెప్పారు. ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్ మాట్లాడుతూ ఆంధ్రామోటార్ మర్చంట్స్ అసోసియేషన్ వజ్రోత్సవాల సందర్భంగా రూ.2లక్షల విలువైన నోటు పుస్తకాలను కార్మికుల పిల్లలకు అందిస్తున్నామన్నారు. మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ పాఠశాలను దత్తత తీసుకొని ముగ్గురు కంప్యూటర్ టీచర్లకు జీతాలను చెల్లించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవడం ద్వారా నగరంలోనే ఉత్తమ పాఠశాలగా గుర్తింపు తీసుకువచ్చారన్నారు. ఈ పాఠశాలలో ప్రవేశం పొందడం కోసం విద్యార్థులు ఉత్సాహపడే స్థాయికి పాఠశాల అభివృద్ధి చెందాలని కోరారు. ఇందులో భాగంగా నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ఎస్ఆర్ఐ వైద్య కళాశాల డిప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ కేవీఎస్ కుమార్ చౌదరి, ఎస్ఆర్ఐ వైద్య కళాశాల డీన్, నేత్ర విభాగం హెచ్ఓడీ ప్రొఫెసర్ లక్ష్మీచౌదరి, వ్యాధిగ్రస్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేశారు. అనంతరం కలెక్టర్ డాక్టర్ సృజన చేతుల మీదుగా వజ్రోత్సవాల లోగోను ఆవిష్కరించారు. ఉపాధ్యక్షుడు గోనుగుంట వెంకట సుబ్బారావు, గారపాటి సతీష్‌బాబు, సంయుక్త కార్యదర్శి దోనేపూడి దుర్గా ప్రసాద్, కోశాధికారి అన్నే శ్రీనివాసరావు, అమ్మ సభ్యులు వడ్లమూడి వెంకటేశ్వరరావు, సుంకర చంద్రశేఖర్, మిరియాల వెంకటేశ్వరరావు, మాజీ అధ్యక్షుడు బొబ్బానారాయణరావు, యార్లగడ్డ సుబ్బారావు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్

విద్యార్థులపై దాడి.. ఇద్దరికి గాయాలు

విద్యాధరపురం, జూలై 7: కిరాయికి కారు తీసుకెళ్లి బకాయి డబ్బులివ్వలేదని ఐదుగురు విద్యార్థులపై దాడి జరిగిన సంఘటన ఈ నెల 3న అర్ధరాత్రి జరిగింది. భవానీపురంలో ఉంటున్న కోపూరి గగన్ బీటెక్ చదువుతున్నాడు. స్నేహితులైన మారుపాకల సందీప్, మణికంఠ, కోపూరి జశ్వంత్ ఈ నెల 3న రాత్రి భవానీపురం క్రాంబ్వే రోడ్డులోని రిలయన్స్ ట్రెండ్స్ ఎదురుగా నిలబడి మాట్లాడుకుంటున్నారు. భవానీపురానికి చెందిన జష్టుల దినేష్, అతడి స్నేహితులు వేముల ప్రవీణ్, బూరి రాజేష్, మోజెస్, సోహెల్ మరికొందరితో కలిసి కారులో వచ్చి మణికంఠతో నీ స్నేహితుడు కారు తీసుకువెళ్లి 6నెలలైనా బకాయి రూ.1500 చెల్లించలేదని, ఫోన్ చేసినా లిఫ్ట్ చేయడం లేదని ప్రశ్నించాడు. ఈ విషయం తనకు తెలియదని మణికంఠ చెప్పడంతో దినేష్ గొడవపడ్డాడు. తనతోపాటు స్నేహితులైన వన్‌టౌన్‌కు చెందిన షేక్ సిద్ధిక్, మోహన్‌రెడ్డి అలియాస్ భూతంను కూడా పిలిచి విద్యార్థులపై బీరుసీసాలు, ఐరన్ రాడ్లు, కట్టర్లు, రాళ్లతో దాడి చేశారు. గగన్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. సందీప్ ముఖంపై కట్టర్స్‌తో కోసేసి గాయపరిచారు. భవానీపురం పోలీసులు ఘటనా ప్రాంతానికి వెళ్లి బాధితుల నుంచి వివరాలు తెలుసుకుని అధికారుల ఆదేశాలతో చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తీసుకువెళ్లారు. దాడికి పాల్పడిన దినేష్ అతడి స్నేహితులు కారులో అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడు గగన్ ఫిర్యాదు మేరకు పోలీసులు దినేష్, ప్రవీణ్, రాజేష్, మోజెస్, సోహెల్, సిద్ధిక్, మోహన్‌రెడ్డి మరికొందరిపై కేసు నమోదు చేశారు.

సీసీ ఫుటేజీని డిలీట్ చేయించిన దినేష్

గొడవ జరిగిన ప్రదేశం వద్ద టీస్టాల్‌లో సీసీ ఫుటేజీ ఉంది. దినేష్, అతడి స్నేహితులు దాడి చేసిన సంఘటన మొత్తం సీసీ ఫుటేజీలో నమోదైంది. అయితే ఆ టీస్టాల్ భవనంపైన దినేష్‌కు వస్త్రదుకాణం ఉంది. దాడి సంఘటన మొత్తం సీసీ ఫుటేజీలో నమోదైందని తెలుసుకున్న దినేష్ అతడి స్నేహితుడిని అక్కడకు పంపి ఆ ఫుటేజీ మొత్తాన్ని డిలీట్ చేయించారని బాధితులు ఆరోపిస్తున్నారు.

ప్రమాదవశాత్తు ఆటో బోల్తా... బాలుడి మృతి

గుణదల, జూలై 7: కుక్కను తప్పించబోయి ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయడంతో ఆటో బోల్తాపడగా బాలుడు మృతి చెందిన ఘటన స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాల వద్ద ఆదివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎనికేపాడులో నివాసముంటున్న రాచమళ్ల నరేష్, గౌరి లక్ష్మి దంపతులకు ఇద్దరు సంతానం. నరేష్ స్థానికంగా ఓ చికెన్ దుకాణంలో పనిచేస్తుంటాడు. గౌరి లక్ష్మి రోజు వారీ పనులకు వెళుతుంది. కుమార్తె 6వ తరగతి, కుమారుడు భాను సాయికృష్ణ (10) ఎనికేపాడులోని ప్రభుత్వ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. గౌరి లక్ష్మి పిల్లలతో కలిసి కాళేశ్వరరావు మార్కెట్ వెళ్లేందుకు ఆదివారం ఉదయం ఎనికేపాడులో సర్వీస్ ఆటో ఎక్కింది. ఎస్ఆర్ఆర్ కళాశాల వద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో తప్పించేందుకు ఆటోడ్రైవర్ సడన్‌బ్రేక్ వేశాడు. దీంతో ఆటో భాను సాయికృష్ణ ఉన్న వైపునకు బోల్తాపడింది. దీంతో బాలుడికి తీవ్రగాయాలవగా మరో ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అప్పటికే బాలుడు చనిపోయినట్టు వైద్యులు 5వ ట్రాఫిక్ పోలీసుల ఘటనా స్థలానికి చేరుకుని ఆటోను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

జోగి రమేశ్ అనుచరుల బెదిరింపులు!

● తమ ప్లాట్ల కబ్జాకు ప్రయత్నిస్తున్నారు ● ఆర్టీసీ సుబ్బారావు ప్లాట్ల యజమానుల ఆవేదన



స్థలం వద్ద బాధితులు

భవానీపురం, జూలై 7: 2 దశాబ్దాల క్రితం ఇళ్ల కోసం కొన్న స్థలాలను కొంతమంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని, ఇందులో మాజీమంత్రి జోగి రమేశ్ అనుచరుల హస్తం ఉందని నగరంలోని 45వ డివిజన్ జోజినగర్ కరెంట్ ఆఫీసు రోడ్డులోని ఆర్టీసీ సుబ్బారావు ప్లాట్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. రూ.లక్షల్లో వ్యయం చేసి ఇళ్ల నిర్మాణాల కోసం 2001లో షేక్ మజీద్ అనే వ్యక్తి వద్ద 2.17 ఎకరాలను 42 మంది కొన్నామని, ఇందులో 25మంది ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. స్థలాలను కొన్నప్పుడు కనిపించనివారు ఇప్పుడు లక్ష్మీరామ కో-ఆపరేటివ్ సొసైటీ పేరుతో వచ్చి అక్రమాలు చేసేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. స్థానిక రామరాజ్యనగర్ కరెంట్ ఆఫీస్ రోడ్డులోని స్థలాల వద్ద ఆదివారం విలేకరులతో మాట్లాడారు. స్థల యజమానులు తంగా రవి, రమణారెడ్డి, కలవకూరి ప్రవీణ్ మాట్లాడుతూ మాజీమంత్రి జోగి రమేశ్, వైసీపీ కార్పొరేటర్ మహదేవు అప్పాజీ, మహదేవు హరి పేర్లు చెబుతూ తమను భయాందోళనకు గురిచేస్తున్నారన్నారు భూమిని అమ్మినవారే వీరితో కుమ్మక్కై తమను వీధిన పడేయాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు నిర్మించుకునేటప్పుడు ఎలాంటి అభ్యంతరాలు లేవన్నారని, ఇటీవల స్థలాలను వెనక్కి ఇచ్చేయాలని లాయర్ ద్వారా 42మందికి నోటీసులిచ్చారని, తమకు రక్షణ కల్పించాలని కోరారు. రూ.లక్షలు పెట్టి కొన్న స్థలాల పరిరక్షణకు ప్రభుత్వం, కార్పొరేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయాన్ని సీఎం చంద్రబాబు సహా కలెక్టర్, కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ప్లాట్ల యజమానులు విజయలక్ష్మి, రవళి పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో బ్యానర్ల రగడ

ఆగిరిపల్లి: ఏలూరు జిల్లా ఆగిరిపల్లిలో ఆదివారం రాత్రి టీడీపీ బ్యానర్లను వైసీపీ నాయకులు చించివేయటంతో గొడవ రాజుకుంది. స్థానిక పొగడచెట్ల మండపం వద్ద ఉన్న టీడీపీ బ్యానర్‌ని, వైసీపీ పట్టణ అధ్యక్షుడు చిమట శ్రీను, ఎంపీపీ సాదం గోపి చించివేస్తుండగా ఆటుగావెళుతున్న టీడీపీ కార్యకర్తలు కాజా కిషోర్, రాణిమేకల మల్లేశ్వరరావు ప్రశ్నించటంతో వైసీపీ నాయకులు వీరిని కొట్టి గాయపర్చారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేతలు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో చేరుకోవటంతో వైసీపీ నాయకులు పారిపోయారు. నూజివీడు ఎమ్మెల్యే, మంత్రి కొలుసు పార్థసారథి ఉన్న బ్యానర్‌ను చించి ఆయన్ని అవమాన పర్చినవారు బ్యానర్ వద్దకు వచ్చి క్షమాపణ చెప్పాలని టీడీపీ శ్రేణులు ఆందోళనకు దిగాయి. పోలీసులు రంగ ప్రవేశం చేసి నచ్చజెప్పే ప్రయత్నం చేసినా టీడీపీ శ్రేణులు భీష్మించుకొని కూర్చున్నారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



కేక్ కటింగ్‌లో పాల్గొన్న ఏలీషా మాదిగ

ధర్నాచౌక్, జూలై 7: ఎమ్మార్పీఎస్ 30 ఏళ్ల ఆవిర్భావ దినోత్సవం, మందా కృష్ణమాదిగ జన్మదినం సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పేరెల్లి ఏలీషా ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని పలుచోట్ల జెండా ఆవిష్కరణ, కేక్ కటింగ్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణే ప్రధాన లక్ష్యంగా 30ఏళ్ల నుంచి మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) పోరాడుతోందన్నారు. అలాగే సమాజంలోని బడుగు, బలహీన వర్గాలు, దివ్యాంగుల సమస్యలపై పోరాడుతున్నామన్నారు. కొప్పుల మల్లేశ్వరరావు, మామిడి రాంబాబు, వేల్పుల సురేష్, పేరెల్లి ప్రభుకుమార్, చింతా గోపి, వెల్పుల శౌరి, డాక్టర్ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జెండా ఆవిష్కరణ

ఎమ్మార్పీఎస్ 30ఏళ్ల ఆవిర్భావ దినోత్సవ వేడుకలు గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. సంఘం రాష్ట్ర కో-కన్వీనర్లు మానికొండ శ్రీధర్ మాదిగ, లాం దానియేలు మాదిగ జెండా ఆవిష్కరించి, కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాదిగ మాట్లాడుతూ మందా కృష్ణమాదిగ తన సొంత ప్రయోజనాలకు వర్గీకరణకు సరిగా కృషి చేయలేదని ఆరోపించారు. దానియేలు మాదిగ మాట్లాడుతూ వర్గీకరణ అంశంలో సుప్రీంకోర్టులో న్యాయం జరుగుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. మరాబత్తుల గోపాల్ మాదిగ, ప్రసన్నకుమార్ మాదిగ, భాను మాదిగ పాల్గొన్నారు.

సీఎస్‌డబ్ల్యూ ఆర్ఐ సస్పెన్షన్

విజయవాడ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): విజయవాడ సిటీ సెక్యూరిటీ వింగ్(సీఎస్‌డబ్ల్యూ) విభాగంలో విధులు నిర్వర్తిస్తున్న రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎ.శ్రీనివాసరావుపై పోలీసు కమిషనర్ పీహెచ్‌డీ రామకృష్ణ వేటు వేశారు. ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు ఇచ్చారు. మహిళా సిబ్బంది పట్ల అనుచితంగా ప్రవర్తించడంతో వరుసగా ఫిర్యాదులు అందాయి. దీనిపై ప్రాథమిక విచారణ నిర్వహించిన సీపీ ఆయనను సస్పెండ్ చేశారు. తదుపరి విచారణ బాధ్యతలను క్రైమ్స్ ఏసీపీ స్రవంతి రాయ్‌కు అప్పగించారు.

హంతకుడి కోసం ముమ్మర గాలింపు

- 20కి పైగా ప్రత్యేక బృందాల ఏర్పాటు
- బాలిక హత్య కేసులో పోలీసుల ముమ్మర దర్యాప్తు

పరవాడ, జూలై 7: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో తొమ్మిదో తరగతి చదువుతున్న బాలికను శనివారం దారుణంగా హత్య చేసిన నిందితుడు బోడా బత్తుల సురేశ్ (26) కోసం పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు అనకాపల్లి స్పెషల్ బ్రాంచి, పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ పర్యవేక్షణలో 20కి పైగా బృందాలతో బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు, సినిమా హాళ్లు, రద్దీగా ఉండే ప్రాంతాల్లో పోలీసులు మఫ్టీలో గాలిస్తున్నారు. సురేశ్ స్వస్థలం అనకాపల్లి కోట్నివీధి. చిన్నప్పుడే తల్లి చనిపోవడంతో అమ్మమ్మగారి ఊరైన కొప్పుగొండుపాలెంలోనే ఎక్కువగా ఉండేవాడు. ఐటీఐ పూర్తిచేసి, కొంతకాలం ఖాళీగా ఉన్నాడు. నిందితుడి మనస్తత్వం డిఫరెంట్‌గా ఉండేదని పోలీసుల విచారణలో తేలింది. నిందితుడి అన్న స్టిక్కరింగ్ షాపు పెట్టుకుని జీవిస్తుండగా, తండ్రి ఈశ్వరరావు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. చిన్నప్పుడే తల్లి చనిపోవడంతో సురేశ్ చెడు అలవాట్లకు బానిసైనట్టు సమాచారం. కొంతకాలం ఫార్మాసిటీలోని ఓ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేశాడు. దీంతో పోలీసులు ఆ కంపెనీకి వెళ్లి వివరాలు సేకరించినట్టు తెలిసింది. అమ్మమ్మగారి ఊరు కొప్పుగొండుపాలేనికి తరచూ వెళుతుండే క్రమంలోనే హత్యకు గురైన బాలిక అతని కంట పడింది. స్కూల్ నుంచి ఇంటికి వెళ్లే సమయంలో సురేశ్ ఆమెను వేధింపులకు గురిచేసేవాడు. దీంతో బాలిక తల్లిదండ్రుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితుడిని అరెస్టు చేసి జైలుకు పంపగా ఇటీవల బెయిల్‌పై వచ్చాడు. తనను జైలుకు పంపిన బాలికను హతమార్చాలనే ఉద్దేశంతో ప్రణాళిక ప్రకారం కత్తితో ఆమెను గొంతుకోసి హతమార్చాడు. నిందితుడి జేబులో స్వయంగా రాసి పెట్టుకున్న సూసైడ్ నోట్ కూడా ఉన్నట్టు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. డీఎస్పీ కేవీ సత్యనారాయణ ఎప్పటికప్పుడు బృందాలకు దిశానిర్దేశం చేస్తున్నట్టు తెలిసింది. మరోవైపు కొప్పుగొండుపాలెం గ్రామస్థులు కూడా నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

బాలిక హత్య కేసులో నిందితుడ్ని వదలం

- గాలింపునకు ప్రత్యేక బృందాలు
- మృతురాలి కుటుంబాన్ని ఆదుకుంటాం: హోం మంత్రి

అనకాపల్లి టౌన్, జూలై 7: అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం కొప్పుగొండుపాలెంలో బాలికను హత్యచేసిన నిందితుడ్ని వదిలిపెట్టేది లేదని హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టంచేశారు. అనకాపల్లిలో ఆమె ఆదివారం విలేకరులతో మాట్లాడారు. నిందితుడిని అరెస్టు చేసేందుకు పలు బృందాలను ఏర్పాటు చేశామన్నారు. గతంలో నిందితుడు బాలికను ఇబ్బందులకు గురిచేస్తే పోలీసులు జైలుకు పంపారని.. ఇటీవల బెయిల్‌పై వచ్చి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని తెలిపారు. బాలిక హత్యపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆరా తీశారని వెల్లడించారు. హత్యకు గురైన బాలిక కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని హోంమంత్రి హామీ ఇచ్చారు. చీరాలలో సంఘటన జరిగిన 36 గంటల్లో నిందితులను పట్టుకుని, కోర్టుకు తరలించామన్నారు. గంజాయి మత్తులోనే ఇలాంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని, గంజాయి కట్టడికి ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశామని మంత్రి వివరించారు.

పోలవరం పాపం ఖరీదు 20,000 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

పోలవరం నిర్మాణ పనులను మేఘాకు అప్పగించింది. అప్పటి నుంచే బందరు పోర్టుతో పాటు పోలవరం ప్రాజెక్టుకు గ్రహణం పట్టింది. సముద్ర పనుల నిర్మాణాల్లో ఏమాత్రం అనుభవం లేని మేఘా బందరు పోర్టు నిర్మాణ పనులను అతీగతీ లేకుండా చేసింది. మరోవైపు కాంట్రాక్టు తీసుకున్న వెంటనే పనులు చేపట్టకుండా పోలవరం ప్రాజెక్టును సర్వనాశనం చేసింది. జగన్ అరాచక పాలనలో మేఘా కాంట్రాక్టు సంస్థ నిర్వాకం వల్ల రాష్ట్రానికి ఎంతో నష్టం జరిగింది.



జగన్ రాకతో విధ్వంసం

2019 మే 30వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన జగన్.. వారం రోజులు తిరక్కుండానే జూన్ 6వ తేదీన పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థ నవయుగ ఇంజనీరింగ్‌ను తొలగించారు. 2019 ఆగస్టులో పోలవరం ప్రాజెక్టులో రూ.1,771 కోట్ల అంచనాతో మిగిలిన హెడ్‌వర్క్స్ పనులను.. రివర్స్ టెండరింగ్ ద్వారా రూ.1,548.12 కోట్లకు మేఘా ఇంజనీరింగ్‌కు అప్పగించారు. ఇవిగాక పోలవరం హైడల్ పవర్ ప్రాజెక్టు పనులను రూ.2,800 కోట్లకు అప్పగించారు. తద్వారా రూ.680 కోట్ల మేర ఆదా చేశామని జగన్ ప్రభుత్వం అప్పట్లో గొప్పలు చెప్పింది. వాస్తవానికి పోలవరం నిర్మాణ పనుల్లో రూ.222.88 కోట్లు (రూ.1771 కోట్లు-1548.12 కోట్లు) మాత్రమే మిగులు కనిపిస్తున్నా ఏకంగా 680 కోట్ల మేర ఆదా చేశామంటూ ఆర్భాటం చేసింది. జాతీయ స్థాయిలోనూ పత్రికలకు ప్రకటనలు గుప్పించింది. అయితే రివర్స్ టెండరింగ్ పేరిట పోలవరం ప్రాజెక్టుకు ముఖ్యమంత్రిగా జగన్, నిర్మాణ సంస్థగా మేఘా తీరని ద్రోహం చేశాయని నిపుణులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టును 2021 డిసెంబరు నాటికి పూర్తి చేస్తానని 2019 నవంబరులో హెడ్‌వర్క్స్ ఆర్డర్‌ను తీసుకున్న మేఘా ఆమోద పత్రాన్ని సమర్పించింది. అయితే మేఘా సకాలంలో పనులు ప్రారంభించలేదు. 2019 నవంబరు నుంచి 2021 నవంబరు దాకా కీలకమైన ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల గ్యాప్‌లను పూడ్చలేదు. దీని ఫలితంగా డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. ఐఐటీ హైదరాబాద్ అధ్యయన నివేదికలో ఇదే విషయాన్ని పేర్కొంది. కాంట్రాక్టు సంస్థను మార్చడం వల్లే పోలవరానికి తీరని ద్రోహం జరిగిందని అభిప్రాయం వ్యక్తం చేసింది. సకాలంలో పనులు ప్రారంభించకున్నా నాటి ముఖ్యమంత్రి జగన్ ప్రశ్నించలేదని, నిర్మాణ సంస్థగా మేఘా బాధ్యతను తీసుకోలేదని నిపుణులు ఆరోపిస్తున్నారు. పోలవరం పనులు మేఘా చేజిక్కించుకునే సమయానికి హెడ్‌వర్క్స్ పనులు 72 శాతం పూర్తయ్యాయి. వాస్తవానికి మిగిలిన 28 శాతం పనులు ఇప్పటికే పూర్తి చేసి, రాష్ట్రానికి గోదావరి జలాలు అందించాల్సి ఉండాలి. సకాలంలో నిర్మాణ పనులు చేపట్టని కారణంగా నిర్మాణం ధ్వంసమైంది. ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2ను పూడ్చక పోవడంతో 2020లో 22 లక్షల క్యూసెక్కుల వరదకు డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. ఎగువ దిగువ కాఫర్ డ్యామ్‌లకు సీపేజీ కారణంగా నీరు ఉబుకుతుంది. గైడ్ బండ్ కూలింది. గ్యాప్-1, గ్యాప్-2 మధ్య భారీ గుంత ఏర్పడింది. డయాఫ్రమ్ వాల్ మరమ్మతులకు కూడా అవకాశం లేకుండా పోయింది. జగన్ సర్కారు తప్పిదాలు, మేఘా అలసత్వం కారణంగా 2021 నవంబరు నాటికే పూర్తి కావాల్సిన ప్రాజెక్టు హెడ్‌వర్క్స్ పనులు 2030 నాటికైనా పూర్తవుతాయా అనే ఆందోళన నెలకొంది. మరో వైపు రూ.1,771 కోట్లతో పూర్తి కావాల్సిన పనుల వ్యయం కేంద్ర ప్రాథమిక అంచనా ప్రకారం రూ.15,511 కోట్లకు చేరింది. నిర్మాణ డిజైన్లు దెబ్బతినడంపై నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా, కెనడాలకు చెందిన అంతర్జాతీయ నిపుణుల సలహాలను తీసుకోవాల్సి వచ్చిందని జల వనరుల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

కేంద్ర అంచనా రూ.15,511 కోట్లు

పోలవరం ప్రాజెక్టు దెబ్బతినడంతో మరమ్మతులకు రూ.15,511.13 కోట్ల వ్యయం అవుతుందని కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ ప్రాథమికంగా అంచనాలు వేసింది. ఈ మొత్తానికి 2024 మే నెలలో కేంద్ర కేబినెట్ ఆమోదం పొందాల్సి ఉంది. కేబినెట్ నోట్ కూడా సిద్ధమైంది. కానీ ఎన్నికల నేపథ్యంలో కేంద్ర కేబినెట్‌కు రూ.15,511.13 కోట్ల నిధుల మంజూరు ప్రతిపాదన వెళ్లలేదు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ జాప్యం వల్ల (15,511.13-1,771) రూ.13,740.13 కోట్ల మేర కేంద్రంపై భారం పడిందని జల వనరుల శాఖ వర్గాలు వెల్లడిస్తున్నాయి. వాస్తవానికి 20 వేల కోట్ల వరకూ నష్టం జరిగిందని నిపుణులు చెబుతున్నారు. జగన్ ప్రభుత్వంలో జరిగిన విధ్వంసం వల్ల పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం చంద్రబాబు ప్రభుత్వానికి సవాలే. గత ఐదేళ్లలో జరిగిన నష్టాలకు ఎవరిని బాధ్యులను చేస్తారు? ఏ నిర్ణయం తీసుకుంటారో?

'రివర్స్' మిగులు అబద్ధం

జగన్ సర్కారు వచ్చాక పోలవరం ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థ నవయుగను మార్చకుండా కొనసాగించి ఉంటే రూ.1,771 కోట్లతో సకాలంలో 2020 డిసెంబరు నాటికే పూర్తయ్యేది. రివర్స్ టెండరింగ్ పేరిట జగన్ సర్కారు చేసిన తప్పిదాల వల్ల భారీ నష్టం జరిగింది. మేఘాకు రూ.1,548.12 కోట్లకు కాంట్రాక్టు ఇచ్చినా, అదనపు పనుల పేరిట మొత్తం వ్యయం రూ.4,637.09 కోట్లకు పెరిగింది. దీన్నిబట్టి రివర్స్ టెండరింగ్‌లో మిగులు అంతా అబద్ధమని తేలిపోయింది. టెండరు ఇచ్చిన కొద్ది రోజులకే రూ.1548.12 కోట్లకు అదనంగా రూ.3088.97 కోట్లు మేఘాకు జగన్ సర్కారు చెల్లింపులు జరిపింది. ఈ విషయాన్ని బయటకు పొక్కకుండా దాచి పెట్టింది.

అలసత్వంతో భారీ నష్టం

ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్ గ్యాప్-1, గ్యాప్-2ను పూడ్చక పోవడంతో 2020లో డయాఫ్రమ్‌వాల్ దెబ్బతింది. గైడ్ బండ్ కూలింది. గ్యాప్-1, గ్యాప్-2 మధ్య భారీ గుంత ఏర్పడింది. దీంతో పోలవరం హెడ్‌వర్క్స్ ప్రగతి 72 శాతం నుంచి తిరోగమనంలో 45 శాతానికి పడిపోయింది. ప్రధాన కట్టడాలు దెబ్బతినడంతో అత్యవసర మరమ్మతుల కింద రూ.2077.78 కోట్లను జల వనరుల శాఖ వ్యయం చేయాల్సి వచ్చింది. అంతేగాక అదనపు పనులతో కూడిన వ్యయం రూ.4637.09 కోట్లకు ఈ మొత్తాన్ని కలిపితే రూ.6,710.87 కోట్లకు పెరిగిపోయింది. ఇది కాక డయాఫ్రమ్‌వాల్ మరమ్మతుకు రూ.447 కోట్లు, కొత్తగా ప్లాస్టిక్ డయాఫ్రమ్‌వాల్‌ను సమాంతరంగా నిర్మించేందుకు రూ.990 కోట్లు అవుతుందని అంచనా వేశారు. మేఘా వెనువెంటనే పనులు చేపట్టి డయాఫ్రమ్‌వాల్‌పై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌ను వేసి ఉంటే ఈ అదనపు ఖర్చు ఉండేది కాదని నిపుణులు చెబుతున్నారు.

ఈ ఐదేళ్లలో కష్టమే

మేఘా నిర్మాణ పనుల్లో చేసిన జాప్యం వల్ల ప్రాజెక్టుకు భారీ నష్టం జరిగింది. అంతేగాక సకాలంలో ప్రాజెక్టు పూర్తి చేయలేని దుస్థితి. కొత్తగా డయాఫ్రమ్ వాల్‌ను నిర్మించడంతో పాటు పాతవాల్‌ను మరమ్మతు చేయాలి. ఇందుకోసం రెండు సీజన్లు అంటే .. రెండేళ్ల సమయం తీసుకుంటుంది. అది కూడా పోలవరంపై అంతర్జాతీయ నిపుణులు ఏడాదిలోగా అధ్యయన నివేదిక ఇచ్చి, దానికి కేంద్ర జలశక్తి మంత్రిత్వ శాఖ అంగీకరిస్తేనే సాధ్యమవుతుందని నిపుణులు చెబుతున్నారు. 2025 జనవరి లేదా ఫిబ్రవరిలో డయాఫ్రమ్‌వాల్ పనులు ప్రారంభించినా అది పూర్తయ్యేసరికి 2027 జనవరి వస్తుంది. దీనికి ముందు ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌ల సీపేజీని నివారించేందుకు చర్యలు చేపట్టాలి. ఇందుకు కనీసం ఆర్నెళ్లు లేదా సంవత్సర కాలమైనా పడుతుందని నిపుణులు చెబుతున్నారు. అంటే.. ఈ పనులు చేయడానికి 2028 వరకూ సమయం పడుతుంది. ఆ తర్వాత డయాఫ్రమ్‌వాల్‌పై ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ డ్యామ్‌ను నిర్మించాలంటే రెండేళ్ల సమయం తీసుకుంటుంది. అంటే.. 2030 వచ్చేస్తుంది. ఆలోగా మళ్లీ సార్వత్రిక ఎన్నికలూ వస్తాయి. ఈ ఐదేళ్లలో పోలవరం పూర్తి చేయడమంటే అద్భుతమేనని నిపుణులు అంటున్నారు.

అనుభవజ్ఞులైన నిపుణులేరీ?

పోలవరం ప్రాజెక్టు పనులు శరవేగంగా పూర్తి చేయాలంటే అనుభవజ్ఞులైన ఇంజనీరింగ్ నిపుణులు అవసరం. అలాంటివారు మేఘాకు ఉన్నారా? అని జలవనరుల నిపుణులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. మేఘాకు నిపుణులలేమి కారణంగానే సకాలంలో పనులు చేపట్టలేదని, దాని ఫలితమే పోలవరం ప్రాజెక్టును శిథిలం చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

సిమెంట్ ఫ్యాక్టరీలో పేలిన బాయిలర్

- వేడి మిశ్రమం పడి ఓ కార్మికుడు దుర్మరణం
- 15 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- ఎన్టీఆర్ జిల్లా అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో దుర్ఘటన



కర్మాగారంలో బాయిలర్ పేలిన ప్రాంతం



ప్రమాద స్థలిలో క్షతగాత్రుడు, మృతుడు ఆవుల వెంకటేశ్

విజయవాడ/జగ్గయ్యపేట రూరల్, తాడేపల్లి టౌన్, జూలై 7: అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలి ఒక కార్మికుడు దుర్మరణం పాలయ్యాడు. మరో 15 మంది గాయపడ్డారు. వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామంలో ఉన్న అల్ట్రాటెక్ సిమెంట్ కర్మాగారంలో ఆదివారం ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ కర్మాగారంలో మొత్తం 300-500 మంది వరకు కార్మికులు పనిచేస్తున్నారు. వారిలో స్థానిక బూదవాడ గ్రామస్థులతో పాటు ఎక్కువమంది బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వారు మొత్తం మూడు షిఫ్టుల్లో విధులు నిర్వర్తిస్తుంటారు. సిమెంట్ తయారీకి ఐదు దశలు ఉంటాయి. మొదటి దశలో సున్నపురాయి (లైమ్ స్టోన్)ను ముక్కలు చేస్తారు. రెండో దశలో ఎర్రమట్టి, బొగ్గు, ఫ్లైయాష్‌ను మిక్సింగ్ చేస్తారు. దీన్ని కెలన్ దశగా వ్యవహరిస్తారు. ఈ దశ దాటాక ఈ మొత్తం మిశ్రమం పొడిగా మారుతుంది. దీన్ని క్లింకర్ దశగా పిలుస్తారు. ఆదివారం ఉదయం షిఫ్టునకు వచ్చిన 30 మంది కార్మికులు కెలన్ (విక్సింగ్ బాయిలర్) వద్ద పనిచేస్తున్నారు. ఈ బాయిలర్‌ను 1,200 నుంచి 1,400 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద మండిస్తారు. ఈ సమయంలో ఇది ఒక్కసారిగా పేలడంతో వేడి మిశ్రమం అక్కడే ఉన్న కార్మికులపై పడింది. ఈ పేలుడు శబ్దానికి కొంతమంది కార్మికులు అక్కడి నుంచి పారిపోయారు. ఈ ప్రమాదంలో గాయపడిన వారిలో ఎనిమిది మందిని తాడేపల్లిలోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. ఇక్కడ చికిత్స పొందుతూ ఆవుల వెంకటేశ్ (36) అనే కార్మికుడు మృతిచెందాడు. పి అర్జునరావు, బి స్వామి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. మిగిలిన ఐదుగురి పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన క్షతగాత్రులను పరామర్శించి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు.

బాధిత కుటుంబాలను ఆదుకుంటాం: చంద్రబాబు

అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీలో బాయిలర్ పేలిన ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. బాధిత కుటుంబాలను ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ప్రమాదంలో గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. క్షతగాత్రులకు అందుతున్న వైద్యంపై అధికారులతో మాట్లాడారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఘటనకు గల కారణాలపై సమగ్ర నివేదిక ఇవ్వడంతో పాటు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు కంపెనీ నుంచి పరిహారం అందేలా చూడటంతో పాటు ప్రభుత్వం నుంచి కూడా సాయం అందిస్తామని చంద్రబాబు పేర్కొన్నారు.

చిరుద్యోగులపై చిన్నచూపు

నెలల తరబడి వేతనాలివ్వని జగన్ సర్కార్

- సహకార అభివృద్ధి ప్రాజెక్ట్ ఉద్యోగులకు 22 నెలలు
- ప్రకృతి సేద్య కార్యకర్తలకు 17 నెలలు.. ఆత్మ ప్రాజెక్ట్ ఉద్యోగులకు 5 నెలలు
- కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిదీ అదే దారి..
- జీతాలందక ఇంకా అనేక శాఖల్లో బాధితులు
- ఇప్పుడిక కూటమి ప్రభుత్వంపైనే వారి ఆశలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం నిర్వాకం కారణంగా వ్యవసాయ అనుబంధ శాఖల్లోని పలు విభాగాల ఉద్యోగులకు నెలల తరబడి జీతాలు అందకుండా పోయాయి. ఇంకా అనేక శాఖల్లోని క్షేత్రస్థాయి, దిగువ శ్రేణి చిరుద్యోగులకు చిన్న మొత్తాల్లో ఇవ్వాల్సిన జీతాలను కూడా జగన్ సర్కార్ పేరబెట్టడంతో ఇప్పుడు ఆ భారమంతా కూటమి ప్రభుత్వంపై పడింది. ప్రకృతి సేద్యంలో ఏపీ రైతు సాధికార సంస్థ అనేక అంతర్జాతీయ అవార్డులు పొందినట్లు ప్రచారం చేసిన జగన్ సర్కార్.. ఆ సంస్థ ఆధ్వర్యంలోని ప్రకృతి సేద్య విభాగంలో పని చేస్తున్న 9,352 మంది కార్యకర్తలకు మాత్రం ఏడాదిపైగా జీతం ఇవ్వకుండా ఊడిగం చేయించింది. ఒక్కొక్కరికి రూ.6నుంచి రూ.16వేల వరకు నెల వేతనాలుండగా, దాదాపు రూ.100కోట్లు బకాయి విడుదల కావాల్సి ఉంది. తాజా సమాచారం ప్రకారం ప్రకృతి సేద్య కార్యకర్తలకు 17 నెలల జీతం ఇవ్వాల్సి ఉంది. 'గౌరవవేతనానికి దిక్కులేదు' శీర్షికన ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనం వచ్చాక.. రెండు నెలలకు వేతనాలు జమ చేసినట్లు అధికారులు చెప్తున్నారు. వ్యవసాయశాఖలోని ఆత్మ ప్రాజెక్ట్ ఉద్యోగులకు 120 మందికి ఐదు నెలలుగా జీతాలు పడలేదు. ఇందులో కొందరిని ఆర్బీకేలు, రైతు సమాచార కేంద్రంలో వినియోగించుకుంటూ కూడా జీతాలివ్వకపోవడంపై ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు.

సహకార శాఖలో సమగ్ర సహకార అభివృద్ధి ప్రాజెక్ట్ కింద పని చేస్తున్న ఉద్యోగులకు 22 నెలల జీతాలు ఇవ్వలేదు. ఉమ్మడి చిత్తూరు, కర్నూలు, తూర్పుగోదావరి జిల్లాల్లో ఐదేళ్ల పాటు అమలు చేసిన ఈ ప్రాజెక్ట్‌లో పని చేస్తున్న కొద్ది మంది ఉద్యోగులకు కూడా జీతాలివ్వలేదు. గతేడాది ముగిసిన ఈప్రాజెక్ట్‌కు ఎన్సీడీసీ రూ.139 కోట్లు ఏపీ ప్రభుత్వానికి ఇస్తే.. ఆ మొత్తాన్ని జగన్ సర్కార్ వాడేసింది. దీంతో ఎన్సీడీసీ ప్రత్యేక అకౌంట్ తెరిచినా.. నిధుల మంజూరుకు జీవో ఇవ్వకుండా వైసీపీ సర్కార్ కొర్రీ వేసింది. ఈ కారణంగా ప్రాజెక్ట్ నిర్వహణకు ఎన్సీడీసీ విడుదల చేసిన నిధులు కూడా స్తంభించిపోయాయని, గత ప్రభుత్వ విధానాలతో చిరుద్యోగులు ఇప్పటికీ ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఏపీ కో-ఆపరేటివ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫణి పేర్రాజు శనివారం విజయవాడలో జరిగిన అసోసియేషన్ సమావేశంలో వ్యాఖ్యానించారు. గత ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ పథకం అమలు కోసం తెల్లవారుజాము నుంచి అర్ధరాత్రి వరకు సహకార ఉద్యోగులను ఇబ్బంది పెట్టడమే కాకుండా, నెలకు రూ.15-20వేల ప్రయాణ ఖర్చులు భరించాల్సిన పరిస్థితి కల్పించిందని, రవాణా సదుపాయం కల్పించకుండా, కనీసం ఒక్క రూపాయి టీఏ బిల్లు కూడా ఇవ్వకుండా ఇబ్బంది పెట్టిందని వాపోయారు. ఇలాగే రాష్ట్రంలోని వ్యవసాయ, ఉద్యాన, పశువైద్య, మత్స్య విశ్వవిద్యాలయాల బోధనేతర సిబ్బందికి జీతాలు సక్రమంగా పడని పరిస్థితి నెలకుంది. ముఖ్యంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి నెలనెలా వేతనాలు అందడం లేదు. తమ జీతాల సమస్యపై సంబంధిత శాఖ మంత్రి దృష్టి సారించాలని ఆయా శాఖ ఉద్యోగులు కోరుతున్నారు.

సీఎం సార్‌కు సారీ చెప్పాలి

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్ర సర్వీసుల్లోకి తిరిగొచ్చి జగన్‌కు కళ్లు, నోరు, చెవులు అన్నీ ఆయనే అయ్యారు. రాష్ట్రంలో నిఘా విభాగం అధిపతి పోస్టు ఆశించి వచ్చిన ఆయనకు....మొదట్లో బ్రేక్ పడింది. రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్‌గా సర్దుకోవాల్సి వచ్చింది. పొరుగు రాష్ట్రం నుంచి స్టీఫెన్ రవీంద్రను తెచ్చుకునే ప్రయత్నం చేయడం, ఐజీ ర్యాంకులో ఉన్న మనీశ్‌కుమార్ సిన్హాకు నిఘా చీఫ్ బాధ్యతలు ఇవ్వడం ఆంజనేయులుకు నచ్చలేదు. దీంతో బుర్రకు పదును పెట్టి జగన్‌కు బాగా నచ్చే పనులపై దృష్టి సారించారు.

అందలం కోసం అడ్డగోలు పనులు

ప్రతిపక్ష నేతల్ని లక్ష్యంగా చేసుకుని మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావు కుమారుడి ద్విచక్ర వాహన షోరూమ్‌పై పడ్డారు. చిన్నచిన్న తప్పులు పట్టుకుని చుక్కలు చూపించారు. ఆ షోరూమ్‌లో అసెంబ్లీకి సంబంధించిన కుర్చీలు ఉన్నాయంటూ కోడెల పరువు తీశారు. పోలీసులు దొంగతనం కేసు పెట్టడంతో మనస్తాపానికి గురైన ఆయన ఏకంగా లోకాన్నే వదిలి వెళ్లిపోయారు. మొదటిసారి జగన్ కళ్లల్లో ఆనందం చూసిన ఘటన అది. ఇక రెండో గురి తాడిపత్రిలో జేసీ ప్రభాకర్ రెడ్డిపై పెట్టారు. ప్రతిపక్షంలో ఉండగా పాదయాత్ర చేసిన వైసీపీ అధ్యక్షుడు జగన్... విభజిత రాష్ట్ర మొదటి ముఖ్యమంత్రి చంద్రబాబుపై అనంతపురం జిల్లాలో అత్యంత హేయమైన దూషణకు దిగారు. అప్పట్లో తాడిపత్రి ఎమ్మెల్యేగా ఉన్న జేసీ ప్రభాకర్ రెడ్డి 'దమ్ముంటే తాడిపత్రికా రా.. ' అంటూ సవాల్ విసిరారు. అప్పటినుంచి జేసీపై జగన్ గుర్రుగా ఉన్నారనే విషయాన్ని ఆంజనేయులు పసిగట్టారు. జేసీ కుటుంబానికి ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న ట్రాన్స్‌పోర్టు వ్యాపారంపై పడ్డారు. పొరుగు రాష్ట్రాల్లో కొనుగోలు చేసిన వాహనానికి మార్పులు చేసి ఏపీలో ఆర్టీఏ అనుమతి తీసుకోలేదంటూ బస్సుల్ని ఆపించారు. హైదరాబాద్‌లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జేసీ ప్రభాకర్ రెడ్డిని, ఆయన కుమారుడు అస్మిత్‌రెడ్డిని అర్ధరాత్రి అరెస్టు చేసి లాక్కొచ్చి కడప సెంట్రల్ జైలుకు పంపించారు. ఈ రెండు ఘటనలతో జగన్ మనసును పీఎస్ఆర్ గెలుచుకున్నారు. ఏసీబీ డీజీగా రెండో పోస్టు సాధించారు. దీంతో మరింత రెచ్చిపోయిన పీఎస్ఆర్.. అప్పటి ప్రతిపక్ష నేతలపై వరుసగా గురిపెట్టారు. అసెంబ్లీలో జగన్‌ను సమర్థంగా ఎదుర్కొన్న అచ్చెన్నాయుడుపై ఈఎస్ఐ మందుల కొనుగోలు వ్యవహారంలో ఏసీబీలో కేసు పెట్టారు. ఆపరేషన్ చేయించుకున్న అచ్చెన్నను టెక్కలిలోని ఇంటిలో అరెస్టు చేసి గుంటూరుకు కారులో తీసుకొచ్చి సుమారు 70 రోజులు జైలుపాలు చేశారు. చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ వ్యాపారాన్ని దెబ్బకొట్టడంతో పాటు సొంత లాభం కోసం అమూల్ సంస్థకు జగన్ రాష్ట్రంలోకి రెడ్ కార్పెట్ వేశారు. దీనికి సంగం డెయిరీ చైర్మన్‌గా సహకరించని ధూళిపాళ్ల నరేంద్రపై కేసు నమోదు చేయించి జైలుకు పంపిన ఘనత కూడా పీఎస్ఆర్‌దే. రాష్ట్రానికి చెందిన న్యాయమూర్తి సుప్రీంకోర్టులో ఉన్నత స్థానాన్ని అధిరోహించకుండా ఆయన కుమార్తె అమరావతిలో భూమి కొనుగోలు చేశారంటూ కేసు పెట్టారు. ఇలాంటివి చేస్తోన్న పీఎస్ఆర్‌ను జగన్ బహిరంగంగానే 'అంజన్నా' అని పిలిచే స్థాయి లో అభిమానాన్ని చూరగొన్నారు. వెంటనే, నిఘా విభాగం అధిపతి పోస్టు సాధించారు. అప్పటి నుంచి తాడేపల్లి ప్యాలెస్‌లోనే మకాం పెట్టారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై ముఖ్యమంత్రికి వివరించడం.. పరిష్కరించేందుకు నడుం బిగించి అటువైపు వ్యక్తుల్ని బెదిరించడం..జగన్ మనసుకు నచ్చే లా ప్రవర్తించడం.. సర్వసాధారణం అయ్యాయి. ఏ తప్పూ చేయని చంద్రబాబుపై పలు కేసులు పెట్టించి స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టు చేయించడం వెనుక కీలక కుట్రదారు, సూత్రధారి 'ఆంజన్న' అనే విషయం రాష్ట్రంలో ఎక్కువ మందికి తెలుసు. ఎలాగైనా డీజీపీ పోస్టు సాధించేందుకు ఆయన చేసిన అడ్డగోలు పనులలో పలువురు పోలీసుల్ని కూడా భాగస్వాముల్ని చేశారు.

చేసినవి చిన్న పాపాలు కావు..



వైసీపీ నాయకుని తరహాలో అడ్డమైన పనులు చేస్తోన్న పీఎస్ఆర్‌ను ఎన్నికల సమయంలో ఎలక్షన్ కమిషన్ తప్పించింది. అయినా పలు జిల్లాల ఎస్పీలకు ఫోన్లు చేస్తూ మళ్లీ వైసీపీ ప్రభుత్వమే వస్తుంది.. జాగ్రత్తగా ఉండండి అంటూ బెదిరించినట్లు వార్తలొచ్చాయి. అయితే జగన్ అరాచక పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు దారుణంగా ఓడించడంతో అవాక్కైన ఆంజనేయులు....తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఉండవల్లి కరకట్టవైపు వచ్చి చంద్రబాబును కలిసే ప్రయత్నం చేశారు. అపాయింట్మెంట్ లేదని సెక్యూరిటీ అడ్డుకోవడంతో వెనుదిరిగారు. సచివాలయంలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నప్పుడు మరో ప్రయత్నం చేశారు. రెండు రోజులుగా చంద్రబాబు హైదరాబాద్‌లో ఉండటంతో జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు ఇంటి చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. అపాయింట్మెంట్ లేదని అధికారులు చెబుతుంటే 'సీఎం సార్‌కు సారీ చెప్పేందుకే వచ్చా' అంటూ బతిమాలు తున్నట్లు సమాచారం. లోపలి నుంచి సిగ్నల్ లేకుండా తాము అనుమతించబోమంటూ సెక్యూరిటీ సిబ్బంది తెగేసి చెప్పడంతో ఉసూరుమంటూ ఆదివారం మరోమారు వెనుదిరిగారు. ఈ విషయం పోలీసుశాఖలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. ఏ తప్పు చేయని ఏబీ వెంకటేశ్వరరావును ఐదేళ్ల పాటు వేధించిన జగన్ ప్రభుత్వంలో పాపాలు పంచుకున్న పీఎస్ఆర్ జీవితకాలం క్షమాపణకు అర్హుడు కాదని వ్యాఖ్యానిస్తున్నారు. వీఆర్ఎస్ కోసం అనుమతి కోరేందుకే ముఖ్యమంత్రిని కలిసే ప్రయత్నం చేస్తున్నారని చెబుతున్నారు. సీఎస్ జవహర్ రెడ్డి లాంటి వారికి రిటైర్మెంట్ ముందు రోజు పోస్టింగ్ ఇచ్చి పంపించిన చంద్రబాబు...... తాను క్షమాపణ చెబితే వీఆర్ఎస్‌కు అనుమతి ఇవ్వరా.? అనే ఆలోచనలో పీఎస్ఆర్ ఉన్నట్లు తెలుస్తోంది.

ఆడపిల్లలే శాపమా!?

- ఆడ పిల్లలు పుట్టారని కోడలిని ఇంట్లోకి రానివ్వని అత్త
- భర్త చనిపోయిన కొద్దిరోజులకే నడి రోడ్డుపై బాలింత
- డెలివరీ అయి ఆస్పత్రి నుంచి వస్తే కనీస కనికరం లేదు
- ముగ్గురు ఆడపిల్లలతో మెట్టినింటి వద్ద బైఠాయించిన బాధితురాలు



మెట్టినింటి ముందు బైఠాయించిన కుసుమాంజలి

చీరాలటౌన్, జూలై 7: భార్యాభర్తలను విధి వేరు చేసింది. నెలక్రితం ప్రమాదవశాత్తు రొటావేటర్ కిందపడి భర్త మృతి చెందగా, అప్పటికే గర్భిణిగా ఉన్న భార్య వారం క్రితం ఇద్దరు కవల ఆడపిల్లలకు జన్మనిచ్చింది. అయితే పుట్టెడు దుఃఖంలో ఉన్న కోడలిని చేరదీసి ధైర్యం చెప్పి కొండంత అండగా ఉండాల్సిన అత్త ఆమెను ఇంట్లోకి రాకుండా అడ్డుకుంది. బాపట్ల జిల్లా చీరాల మండల పరిధిలోని కొత్తపాలేనికి చెందిన అక్కల మణికంఠ, కుసుమాంజలి భార్యాభర్తలు. గత నెల 10న తండ్రి సుందరరామిరెడ్డి ట్రాక్టర్‌తో దుక్కిదున్నుతుండగా మణికంఠ ప్రమాదవశాత్తూ రొటావేటర్ కింద పడి మృతి చెందాడు. అప్పటికి కుసుమాంజలి నిండు గర్భిణి. పైగా అప్పటికే వారికి ఒక ఆడపిల్ల ఉంది. వారం క్రితం పట్టణంలోని ఓ వైద్యశాలలో ఇద్దరు కవల ఆడ పిల్లలకు ఆమె జన్మనిచ్చింది. ఈ క్రమంలోనే ఆదివారం సాయంత్రం ఆసుపత్రి నుంచి ఇంటికి వెళ్లగా అత్త నాంచారమ్మ, మామ సుందరరామిరెడ్డి, చినమామ రాజు ఆమెను అడ్డగించారు. ముగ్గురు ఆడ పిల్లలతో ఇంట్లో ఉండేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో నిరాశతో నిండు గర్భిణి ఇంటిముందే బైఠాయించింది. కొద్దిసేపటి తరువాత వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించింది. ఈమేరకు పోలీసులు ఫిర్యాదు స్వీకరించి విచారణ చేపట్టారు. కాగా, కనీస మానవత్వం చూపకుండా కోడలిని గెంటేసిన అత్తామామలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు పోలీసులను, ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

మోదీ వికసిత్ భారత్ సంకల్పం నెరవేరాలి: మురుగన్



తిరుమల ఆలయం ముందు మురుగన్

తిరుమల, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ వికసిత్ భారత్ సంకల్పం నెరవేరాలని, అన్ని రంగాల్లో అభివృద్ధి, సంక్షేమం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరగాలని శ్రీవారిని కోరుకున్నట్టు కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి ఎల్.మురుగన్ తెలిపారు. తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకున్న ఆయనకు రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వచనం.. అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. దర్శనానంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మూడోసారి మోదీ ప్రభుత్వం రావడం చారిత్రక ఘట్టమని, కేంద్ర మంత్రివర్గంలో తమిళనాడు నుంచి తనకు అవకాశం కల్పించిన మోదీకి కృతజ్ఞతలు తెలిపారు.



జస్టిస్ మల్లికార్జునరావుకు స్వామివారి చిత్రపటాన్ని అందిస్తున్న డిప్యూటీ ఈవో బాబూరావు

చిన వెంకన్న సేవలో జస్టిస్ మల్లికార్జునరావు

ద్వారకాతిరుమల, జూలై 7: ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి.మల్లికార్జునరావు ఆదివారం రాత్రి సందర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు అర్చకులు వేద ఆశీర్వచనాన్ని, ఆలయ అధికారులు స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు.



విన్నర్

సంకల్ప బలం

ఎంబీబీఎస్ చదివి డాక్టర్ కావాలనుకుంది. అందుకు కుటుంబ ఆర్థిక పరిస్థితులు సహకరించలేదు. కానీ కెరీర్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకొని... అమ్మానాన్నలను అపురూపంగా చూసుకోవాలనుకుంది. వచ్చిన అవకాశాన్ని అందిపుచ్చుకొని... బీఎస్సీ కార్డియాలజీ పూర్తి చేసింది. అదే ఇప్పుడు ఆమెకు అద్భుత అవకాశాన్ని తెచ్చి పెట్టింది. ముప్పై ఏడు లక్షల అరుదైన ప్యాకేజీతో బ్రిటన్‌లో కొలువు సంపాదించింది. కార్డియాక్ ఫిజియాలజిస్ట్‌గా సేవలు అందిస్తున్న తెలుగు అమ్మాయి... 23 ఏళ్ల నిస్సీ లియాన్... ఆ విశేషాలను 'నవ్య'తో పంచుకుంది.

"ఎన్నో కలలు కంటాం. అవన్నీ నెరవేరితే అది జీవితం ఎందుకు అవుతుంది! అలాగని అనుకున్నది అవ్వలేదని కుంగిపోతే జీవితానికి అర్థమే లేకుండా పోతుంది. ఈ సత్యం నాకు కాలేజీ రోజుల్లోనే బోధపడింది. మొదటి నుంచి నేను చదువులో ముందుండేదాన్ని. టెన్త్‌లో 9.7 జీపీఏ వచ్చింది. ఇంటర్‌లో వెయ్యికి 915 మార్కులు సాధించాను. డాక్టర్ కావాలని కలలు కన్నాను. దాని కోసమే ఇంటర్‌లో బైపీసీ తీసుకున్నాను. కానీ మా కుటుంబ ఆర్థిక పరిస్థితులు ఎంబీబీఎస్ చేయడానికి సహకరించలేదు. మా స్వస్థలం గుంటూరు జిల్లా తెనాలి. మా నాన్న జార్జ్, అమ్మ సునీత చర్చి మినిస్ట్రీలో చేస్తుంటారు. నాకు ఒక తమ్ముడు. వాడు ఇంజనీరింగ్ చదువుతున్నాడు. మా ఇద్దరినీ చదివించడం అమ్మానాన్నలకు శక్తికి మించిన భారమే. అయినా వాళ్లు మా కోసం ఎన్నో త్యాగాలు చేశారు. ఇక నన్ను మెడిసిన్‌లో చేర్పించేటంత స్తోమత వారికి లేదు. దానికి నేను బాధపడలేదు. కాకపోతే నా కాళ్లపై నేను నిలబడి, అమ్మానాన్నలను బాగా చూసుకోవాలని ఆశ పడ్డాను.

అనుకోకుండా అటువైపు...

అదే సమయంలో బీఎస్సీ కార్డియాలజీ లాంటి కోర్సు ఒకటి ఉంటుందని నాకు తెలిసింది. 'ఎన్‌టీఆర్ యూనివర్సిటీ' కౌన్సెలింగ్ నిర్వహిస్తే... నేను వెళ్లాను. కన్వీనర్ కోటా కింద శ్రీకాకుళం 'బొల్లినేని మెడ్‌స్కిల్స్' కాలేజీలో సీటు వచ్చింది. శ్రీకాకుళం వెళ్లి చదివాను. మూడేళ్ల కోర్సు అది. 2022లో బీఎస్సీ అవ్వగానే హైదరాబాద్ 'కిమ్స్' ఆసుపత్రిలో ట్రైనీగా చేరాను. అందులో పని చేస్తున్నప్పుడు ఇలా యూకే (యునైటెడ్ కింగ్‌డమ్)లో కార్డియాక్ ఫిజియాలజిస్ట్ ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని తెలిసింది. బీఎస్సీ కార్డియాలజీలో డిగ్రీ చేసినవారు దీనికి అర్హులు. హైదరాబాద్‌లో 'ప్రకార' అనే సంస్థ ద్వారా మా కాలేజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నాగేశ్వరరావు సర్‌కు ఈ సమాచారం అందింది. నాతో పాటు ఆయన మా కాలేజీలో మరో ఇద్దరికి చెప్పారు. వేరే కాలేజీల నుంచి వచ్చిన ఇద్దరితో కలిపి మొత్తం ఐదుగురం హైదరాబాద్‌లో మూడు నెలల శిక్షణ తీసుకున్నాం.

ఎన్నో వడపోతలు...

శిక్షణ తరువాత జాతీయ స్థాయిలో 'బ్రిటిష్ సొసైటీ ఆఫ్ థొరాసిక్ ఎకోకార్డియోగ్రఫీ' (బీఎస్ఈ) వారు నిర్వహించిన ఈ 'ట్రాన్స్ థొరాసిక్ ఎకోకార్డియోగ్రఫీ' (టీటీఈ) పరీక్ష రాశాను. అందులో అర్హత సాధించాను. యూకే నుంచి ఒక డాక్టర్, కార్డియాలజిస్ట్ వచ్చి మమ్మల్ని ఇంటర్వ్యూ చేశారు. అది అయ్యాక ఆన్‌లైన్ ఇంటర్వ్యూ. ఇలా వడపోతల అనంతరం నేను, మరొకతను ఎంపికయ్యాం. ఇప్పటివరకు తెలుగు రాష్ట్రాల నుంచి ఈ అవకాశం అందుకున్న తొలి మహిళను నేనే. నాలాగా కార్డియాలజీ డిగ్రీ చదివినవారికి ఇలాంటి ఉద్యోగాలు రావడం చాలా కష్టం. దీని కోసం యూకే వెళ్లి, లక్షలు ఖర్చు పెట్టి ఎంఎస్ చేస్తుంటారు. అలాంటి వారికి కూడా ఇది తెచ్చుకోవడం కష్టమే. గతంలో ఈ పరీక్ష రాసినవారు కూడా 'ఇది చాలా కఠినంగా ఉంటుంది. చాలామంది ప్రయత్నించి విఫలమయ్యారు' అన్నారు. కానీ నేను పట్టు వదల్లేదు. ఆసుపత్రిలో పని చేస్తూనే... ఖాళీ సమయాల్లో సన్నద్ధమయ్యాను. ఇంటర్వ్యూలో వారి ఆంగ్ల ఉచ్చారణ అర్థంకాక కొంత ఇబ్బంది పడ్డాను. ఒకసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లి వెనుదిరిగాను. అన్నిటినీ దాటి చివరకు అనుకున్నది సాధించగలిగాను. ఒక లక్ష్యం పెట్టుకొని... దాన్ని సాధించాలన్న పట్టుదల, అంకితభావం ఉంటే అసాధ్యం ఏదీ ఉండదనేది నాకు అర్థమైంది. యూకేలో కార్డియోగ్రాఫర్‌గా ఉద్యోగం చేయాలంటే ఈ పరీక్షలో ఉత్తీర్ణత తప్పనిసరి. మనకు డాక్టర్లు, నర్సులు ప్రాక్టీస్ లేదా ఉద్యోగం చేయాలంటే లైసెన్స్‌లాగా. యూకేలో నేను రాసిన పరీక్ష థియరీ, ప్రాక్టికల్స్ అని రెండు అంచెల్లో ఉంటుంది. థియరీ అయిపోయింది. రెండేళ్లల్లో ప్రాక్టికల్స్ కూడా పూర్తి చేయాలి. దాని కోసం సన్నద్ధమవుతున్నా.

అస్సలు ఊహించలేదు...

'ఎన్‌హెచ్‌ఎస్' (నేషనల్ హెల్త్ సర్వీస్) అనేది యూకేలోని హెల్త్ ఆర్గనైజేషన్. 'ఎన్‌హెచ్‌ఎస్' కింద ట్రస్టులు ఉంటాయి. ఒక్కో ట్రస్టు ఆధ్వర్యంలో మూడు నాలుగు ఆసుపత్రులు పని చేస్తాయి. మాంచెస్టర్ నగరంలోని అలాంటి ఒక ఆసుపత్రి... 'ఫెయిర్‌ఫీల్డ్ జనరల్ హాస్పిటల్‌'లో కార్డియాక్ ఫిజియాలజిస్ట్‌గా నాకు పోస్టింగ్ వచ్చింది. అంటే మన దగ్గర ప్రభుత్వ ఆసుపత్రిలో కొలువులాగా. ఇక్కడికి రావడానికి నాకు అయిన ఖర్చు కూడా లక్షన్నర లోపే. అందులో సగం వరకు తిరిగి వస్తుంది. నా జీతం మన కరెన్సీలో ఏడాదికి 37 లక్షల రూపాయలు. భారత్‌లో ఒక కార్డియాక్ ఫిజియాలజిస్ట్‌కు ఇంత పెద్ద ప్యాకేజీ రావడం అరుదైన విషయం. అపార అనుభవం ఉన్నవారికి కూడా నెలకు లక్షన్నరకు మించి నేను చూడలేదు. గత నెల పదిన యూకే వచ్చాను. ఉద్యోగంలో చేరాను. చాలా సంతోషంగా ఉంది. కెరీర్ ప్రారంభంలోనే ఇంతటి విజయం అస్సలు ఊహించలేదు.

తెలుగు రాష్ట్రాలు దాటలేదు...

ఇప్పటివరకు నేను ఏపీ, తెలంగాణ దాటి ఎక్కడికీ వెళ్లలేదు. అలాంటిది ఏకంగా దేశం దాటి ఇక్కడకు వచ్చాను. మా కుటుంబంలో ఇలా బయటి దేశంలో అడుగుపెట్టిన తొలి వ్యక్తిని నేనే. తలుచుకొంటేనే ఎంతో గొప్పగా అనిపిస్తోంది. అమ్మానాన్నల ప్రోత్సాహం, మా నాగేశ్వర్ సార్ సహకారంతోనే ఇది సాధించగలిగాను. ముఖ్యంగా నా మీద నాకంటే మా అమ్మానాన్నలకు నమ్మకం ఎక్కువ. ఆ నమ్మకం నిలబెట్టుకున్నందుకు సంతృప్తిగా ఉంది. ముందే చెప్పాను కదా... ఇది ఊహించని కొలువని. కాలేజీలో ఉన్నప్పుడు నా లక్ష్యం ఎంఎస్సీ చదవాలని. కుదిరితే పీహెచ్‌డీ చేయాలనుకున్నా. అలా నా కెరీర్‌ను నిర్మించుకోవాలని ప్రణాళికలు వేసుకున్నా. ఏ దారిలో నడిచినా ఉన్నత స్థానంలో నిలవాలన్నది నా సంకల్పం.

సేవ చేయాలి...

ఇక్కడికి వచ్చాక ఎదగడానికి ఎలాంటి అవకాశాలు ఉన్నాయనేదానిపై కొంత అవగాహన కలిగింది. నా ప్రాక్టికల్ ఎగ్జామ్ అవ్వగానే సైంటిస్ట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ లాంటివి పూర్తి చేసి, విజ్ఞానం, నైపుణ్యం సంపాదించాలి. ఆ విజ్ఞానం అందరికీ పంచి... సాధ్యమైనంతమందికి సేవ చేయాలి. మాది మధ్యతరగతి కుటుంబం కనుక ఉన్నత చదువులకు వెళ్లాలంటే ఎన్ని అవరోధాలను అధిగమించాలో నాకు తెలుసు. చర్చి మినిస్ట్రీలో చేరక ముందు మా నాన్న పెయింట్ వర్క్ చేసేవారు. అమ్మ కొన్నాళ్లు టీచర్‌గా చేసి మానేశారు. నాన్న సంపాదనతో ఇల్లు కూడా కష్టంగానే గడిచేది. అయితే మా చదువు విషయంలో ఆయన ఏనాడూ రాజీ పడలేదు. తన పిల్లలను తనకంటే ఉన్నతంగా చూడాలనుకున్నారు. ఇవాళ అమ్మానాన్నల ఆకాంక్షను నెరవేర్చినందుకు ఎంతో ఆనందంగా ఉంది. నా కష్టానికి దేవుడు ఇచ్చిన ప్రతిఫలం ఇది. అలాగని మన ప్రయత్నం లేకుండా భారమంతా దేవుడిపై వేసి కూర్చొంటే ఏదీ సాధించలేం. మనం కష్టపడాలి. ఫలితం ఆ పైవాడికి వదిలేయాలి.

● హనుమా

ఒకటే లక్ష్యం...

అనుభవం, నైపుణ్యం పెంచుకొని తిరిగి భారత్‌కు రావాలన్నది నా ఆలోచన. దాని కోసం ఇక్కడ కొన్ని కోర్సులు చదవాలి. అవి పూర్తి కావడానికి తొమ్మిదేళ్ల పడుతుంది. డబ్బు కూడబెట్టి... భారత్‌కు వచ్చి ఒక డయాగ్నస్టిక్ సెంటర్ ప్రారంభించాలని అనుకొంటున్నా. దాని ద్వారా పేదలు, మధ్యతరగతి వారికి అందుబాటు ధరల్లో సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నా. ఎందుకంటే రెండొందలు పెట్టి థైరాయిడ్ టెస్ట్ చేయించుకోవాలంటేనే ఒకటికి పదిసార్లు ఆలోచించిన రోజులున్నాయి. అలాంటి కుటుంబాలకు చేయూతనిచ్చి, ఆ పరిస్థితిలో కొంతైనా మార్పు తేగలిగితే అదే నేను సాధించే పెద్ద విజయం.

పోరు బాట... గెలుపు బావుటా

బ్రిటన్ పార్లమెంటరీ ఎన్నికల్లో గెలిచిన తొలి తమిళ సంతతి మహిళగా చరిత్ర సృష్టించారు ఉమా కుమరన్. నలభై రెండేళ్ళ క్రితం... శ్రీలంక నుంచి బ్రిటన్‌కు వలస వెళ్ళిన కుటుంబానికి చెందిన ఆమె సామాజిక సమస్యలపై తన స్వరాన్ని గట్టిగా వినిపిస్తూ ఉంటారు. "తిరుగుబాటు, ఉద్యమశీలత నా రక్తంలోనే ఉన్నాయి" అంటున్న ఉమ మార్పు సారథిగా తనను తాను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నారు.



"గెలిచినా, ఓడినా నేను ఎప్పుడూ మీ ప్రతినిధినే. ఎప్పటికీ మీ గళాన్నే. ఇప్పుడు నన్ను ఎన్నుకొని నా బాధ్యత మరింత పెంచారు. నా ద్వారా సమాజంలో మీరు కోరుకుంటున్న మార్పును సాధించడమే లక్ష్యంగా పని చేస్తాను"... ఇటీవల ముగిసిన బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంపీగా గెలిచిన ఉమా కుమరన్... ఓటర్లకు కృతజ్ఞతలు చెబుతూ అన్న మాటలివి. బ్రిటన్ పార్లమెంట్‌కు ఎన్నికైన తొలి తమిళ సంతతి మహిళగా ఆమె చరిత్రలో నిలిచారు. అంతేకాదు, కిందటి ఏడాది కొత్త పార్లమెంటరీ స్థానంగా ఏర్పాటైన స్ట్రాట్‌ఫోర్డ్ అండ్ బౌ నుంచి ఎన్నికైన తొలి ఎంపీ కూడా ఆమే కావడం విశేషం.

వాతావరణ మార్పులపై అవగాహన అత్యవసరం...

ముప్పై ఆరేళ్ళ ఉమ పుట్టిందీ, పెరిగిందీ లండన్ నగరంలోనే. ఆమె పూర్వీకులు శ్రీలంకలోని జాఫ్నాలో ఉండేవారు. శ్రీలంకలో అంతర్యుద్ధం కారణంగా కల్లోల పరిస్థితులు ఏర్పడడంతో... నలభై రెండేళ్ళ కిందట ఆమె కుటుంబం బ్రిటన్‌కు వలస వెళ్ళింది. "మా తాతయ్య జాఫ్నాలో ప్రభుత్వోద్యోగి. అలాగే తొలి ట్రేడ్ యూనియన్ నాయకుల్లో ఒకరు. అప్పట్లో శ్రీలంకలోని గౌరవప్రదమైన కుటుంబాల్లో మాదీ ఒకటి. పారిశుధ్య కార్మికుల హక్కుల కోసం మా తాతయ్య ఆందోళనలు చేస్తున్నారని తెలుసుకున్న మా ముత్తాత... ఆయనను ఇంటినుంచి వెళ్ళగొట్టారు. అయినా తాతయ్య వెనక్కి తగ్గలేదు. ప్రజలకోసం ఏదైనా చెయ్యాలనే ఎంతో తపన పడేవారు. ఈ విధంగా తిరుగుబాటు, ఉద్యమశీలత నాకు వారసత్వంగా వచ్చాయి" అంటారు ఉమ. లండన్ క్వీన్ మేరీ యూనివర్సిటీ నుంచి పబ్లిక్ పాలసీలో మాస్టర్స్ డిగ్రీ పూర్తి చేశాక... 'నేషనల్ హెల్త్ సర్వీస్ (ఎన్‌హెచ్‌ఎస్) ప్రొఫెషనల్స్‌'లో రెండేళ్ళపాటు పని చేశారు. ఆ తరువాత లేబర్ పార్టీలో చేరారు. ఆ పార్టీ ఎంపీ డాన్ బట్లర్ దగ్గర పార్లమెంటరీ రీసెర్చర్‌గా, ఆ తరువాత పార్టీ నాయకులకు ప్రచార సలహాదారుగా, పార్టీ కమిటీలు, సంస్థల్లో పొలిటికల్ అడ్వైజర్, సీనియర్ అడ్వైజర్... ఇలా పలు బాధ్యతలు నిర్వహించారు. అదే సమయంలో... సామాజిక కార్యక్రమాల్లో పాల్గొని, స్థానికులతో మమేకమయ్యారు. వారి సమస్యల పరిష్కారం కోసం పోరాడారు. వాతావరణ మార్పులపై ఐక్యరాజ్యసమితి ప్రణాళికా సంఘంలో కీలకమైన బాధ్యతలు నిర్వహించారు. 'సి40 సిటీస్ క్లైమెట్ లీడర్‌షిప్ గ్రూప్‌'నకు దౌత్య, అంతర్జాతీయ సంబంధాల డైరెక్టర్‌గా రెండేళ్ళు పని చేశారు. "వాతావరణ మార్పుల గురించి ప్రతి ఒక్కరిలో అవగాహన కలిగించడం అత్యవసరం. ప్రజలు చైతన్యవంతులైతేనే పాలకుల్లో, అధికారుల్లో క్రియాశీలత పెరుగుతుంది. ఇది ఏదో ఒక దేశానికి పరిమితమైన సమస్య కాదు. ఈ ప్రపంచం ఎదుర్కొంటున్న ముప్పు. ఆ కోణంలోనే దీనికి పరిష్కారాలను వెతకాలి" అని చెబుతారు ఉమ. చట్టసభల్లో తన వాణిని వినిపించాలనేది ఆమె ఆకాంక్ష. కానీ అది అంత త్వరగా నెరవేరలేదు.

వాళ్ళను ఏమనాలి?

ఉమ 2010లో... వాయవ్య లండన్‌లోని హారోలో... పిన్నెర్ సౌత్ వార్డు నుంచి పోటీ చేసి... పరాజయం పాలయ్యారు. ఆ తరువాత... 2015 సార్వత్రిక ఎన్నికల్లో హారో ఈస్ట్ నుంచి లేబర్ పార్టీ అభ్యర్థిగా నిలబడ్డారు. ప్రచార సమయంలో... కన్సర్వేటివ్ పార్టీ సభ్యుడైన ముఖేశ్ నాకెర్ నాయకత్వంలోని 'ధర్మ సేవా పూర్వపక్ష' అనే సంస్థ ప్రతినిధులు ఆమెపై దాడి చేశారు. కుల వివక్షను నిషేధించే (2013) చట్టానికి లేబర్ పార్టీ మద్దతు ఇవ్వడాన్ని ఆ సంస్థ తప్పు పడుతూ... దానివల్ల సమాజంలో ద్వేషం, వేర్పాటువాదం మరింత పెరుగుతాయనీ, కాబట్టి ఉమకు ఓటు వేయవద్దనీ ప్రచారం చేసింది. ఆ ఎన్నికల్లోనూ ఉమ ఓటమి చెందారు. మరోవైపు మత రాజకీయాలు చేస్తున్నారంటూ ముఖేశ్ నాకెర్ బృందం చేసిన ప్రచారం ఆమెను తీవ్ర మనస్తాపానికి గురి చేసింది. "ఆ సమయంలో నేను ఎంతో క్షోభ అనుభవించాను. 'అందరూ సమానమే' అనే భావనను వ్యతిరేకించేవాళ్ళను ఏమనాలి? నా మీద జరిగిన ప్రచారంతో నా కుటుంబం, నా స్నేహితులు ఆందోళనకు గురయ్యారు" అని గుర్తుచేసుకున్నారు ఉమ. దాంతో... రెండేళ్ళ తరువాత... 2017లో వచ్చిన ఎన్నికల్లో ఆమె పోటీకి దూరంగా ఉండిపోయారు. అయితే... ప్రజా సమస్యల పరిష్కారం దిశగా కృషిని కొనసాగించారు. లండన్‌లో... ముఖ్యంగా కిందటి ఏడాది నూతన నియోజకవర్గంగా ఏర్పాటైన స్ట్రాట్‌ఫోర్డ్ అండ్ బౌ నియోజకవర్గ పరిధిలో తమిళుల సంఖ్య గణనీయంగా ఉంది. ప్రత్యేకించి... శ్రీలంక నుంచి శరణార్థులుగా వచ్చిన ఎంతోమంది అక్కడ స్థిరపడ్డారు. కాబట్టి ఉమ సరైన అభ్యర్థి అని లేబర్ పార్టీ అధిష్ఠానం నిర్ణయించింది. "గతంలో ఎదురైన చేదు అనుభవాలను పక్కకునెట్టి... ఈసారి ఎలాగైనా గెలిచి చూపించాలనుకున్నాను" అని చెప్పిన ఉమ రెట్టించిన ఉత్సాహంతో ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక తమిళుల శ్రేయస్సు, నియోజక వర్గ ప్రజలకు అందుబాటులో గృహ వసతి, త్వరితమైన వైద్య సేవలు, మౌలిక సదుపాయాల కల్పన లాంటి హామీలతో ఓటర్లను ఆకట్టుకున్నారు. మరోవైపు పాలస్తీనా సమస్య, వాతావరణ మార్పులపై పార్లమెంట్‌లో గట్టిగా పోరాడతానని కూడా వాగ్దానం చేశారు. ఇటీవలి పోలింగ్‌లో... 40 శాతానికి పైగా ఓట్లతో విజయం సాధించారు. "ఇది 15 ఏళ్ళ ప్రజాక్షేత్రంతో నేను చేసిన పోరాటానికి గుర్తింపు. ఈ నియోజకవర్గ మొదటి ఎంపీగా సేవ చేసే అవకాశాన్ని ప్రజలు నాకు ఇవ్వడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. నా మీద వారు పెట్టుకున్న విశ్వాసాన్ని నిలబెట్టుకుంటాను" అని చెబుతున్న ఉమకు ప్రపంచవ్యాప్తంగా తమిళ వర్గాల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ ఫేజ్ బావుంది!

పాపులర్ వెబ్ సిరీస్ 'పంచాయత్'లో ప్రధాన భూమిక పోషించిన నటి శాన్విక. 'రింకి' పాత్రలో ఆమె ప్రతిభ అమోఘం అంటూ విమర్శకులు సైతం ప్రశంసిస్తున్నారు. శాన్విక గురించి కొన్ని విషయాలు..



ఇటీవలే 'పంచాయత్ 3' వెబ్ సిరీస్ విడుదలైంది. చాలామంది ఎప్పటిలానే మూడో సిరీస్‌లోనూ రింకి పాత్ర గురించే మాట్లాడుతున్నారు. సాధారణ పల్లెటూరు అమ్మాయి పాత్రలో అద్భుతంగా నటించిందని ప్రేక్షకులు కొనియాడుతున్నారు. అయితే 'ఇదంతా రింకీ పాత్ర.. ముఖ్యంగా కంటెంట్ గొప్పదనమే' అంటోంది శాన్విక.

చిన్నప్పటి నుంచే..

శాన్విక ఇపుడు నేషనల్ క్రష్‌గా మారింది. ఆమె నటించిన పంచాయత్‌లో రింకీగా గుర్తుండిపోతుంది. ఇక ఆమె విషయానికొస్తే.. మధ్యప్రదేశ్‌లోని జబల్‌పూర్‌లో పుట్టి పెరిగింది. బిటెక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ చదివింది. చిన్నప్పటి నుంచీ ఆమె నటిని అవ్వాలనుకుంది. ఇంట్లో ఈమెతో కలసి ఐదు మంది ఆడపిల్లలు. వీరిలో శాన్విక చివరి అమ్మాయి. మాధురీ దీక్షిత్, ఇర్ఫాన్‌ఖాన్ లాంటి యాక్టర్స్‌ను ఇష్టపడేది. బిటెక్ తర్వాత బెంగళూరులో ఉద్యోగం వచ్చింది. అయితే ఉద్యోగం చేయలేనంది. 'యాక్టింగ్ చేయాలి' అంటూ తన కోరిక చెప్పింది.. చిన్నప్పటి నుంచి ఇతరులతో మాట్లాడే నేచర్ ఆమెది కాదు. దీంతో తల్లిదండ్రులు యాక్టింగ్ సెట్ కాదన్నారు. అయితే సెట్ అయితే వెళ్తా.. లేకుంటే జాబ్ చేస్తానని ప్రయోగం చేసింది. తన మిత్రురాలితో ముంబైకి వెళ్లింది. తన స్నేహితురాలు బాలీవుడ్ ఇండస్ట్రీకి చెందినది కావటంతో క్యాస్టూమ్ డిపార్ట్‌మెంట్ ఉద్యోగం పెట్టించింది. అప్పుడే ఖాళీ సమయాల్లో సీరియల్స్, యాడ్స్ ఆడిషన్స్‌లో పాల్గొనేది. అలా తొలిసారి డొమినోస్ పిజ్జా యాడ్‌లో నటించింది. అదే ఆమె తొలిసారిగా తెరమీద కనిపించటం.

ఇలా క్రేజ్ వస్తుందని అనుకోలేదు..

చిన్న పాత్రలైనా నటించేది. ఆమె బ్యాంక్ అకౌంట్ జీరో ఉన్న పరిస్థితుల్లో కూడా కాన్ఫిడెంట్‌గా ఉండేది. యూట్యూబ్ ఛానల్స్ తీసే వెబ్‌సిరీస్‌లో నటించటానికి ఆడిషన్‌కు వెళ్లింది. వాస్తవానికి ఈమె పేరు పూజా సింగ్ సినిమాకోసం శాన్వికగా మార్చుకుంది. అలా 'పంచాయత్' సిరీస్‌లో ఆమెకు అవకాశం వచ్చింది. తొలి సిరీస్‌లో ఆమెకు మంచి పేరు రావటంతో మరో రెండు వెబ్‌సిరీస్‌ల్లో నటించింది. 'పంచాయత్ 2' సిరీస్‌కు ఉత్తమనటిగా ఆమెకు అవార్డులు వచ్చాయి. ఇటీవలే మూడో సీజన్ విడుదలైంది. 'ఇంతలా క్రేజ్ వస్తుందని అనుకోలేదు. నేను పడిన శ్రమ ఊరికేపోలేదు. ఇండస్ట్రీలో నిలదొక్కుకోవటం కష్టం. ప్రతిభ ఉండాల్సిందే' అంటుంది శాన్విక.

సోషల్ మీడియాలో హవా..

సోషల్ మీడియాలో తన పెంపుడు జంతువుల ఫొటోలను షేర్ చేస్తుంది. దీంతో పాటు వ్యక్తిగత విశేషాలు, కెరీర్ అప్‌డేట్స్‌ను అందిస్తుంది శాన్విక. ఎక్కువగా ప్రకృతిలో గడిపే క్షణాలను నెటిజన్లతో పంచుకుంటుంది. ఇన్‌స్టాలో ఐదు లక్షల మంది ఫాలో అవుతున్నారు. 'ఇప్పుడిప్పుడే నమ్మకం కలుగుతోంది. సిల్వర్‌స్క్రీన్ మీద కూడా మంచి పాత్రల్లో నటించాలి. అభిమాన హీరోలతో నటించాలి' అంటోందీమె. ఇంట్లో టీ చేసుకోవటం, మంచి ఫుడ్ వండటం ఇష్టముంటుందామె. 'పంచాయత్ 2' సీజన్ విడుదలయ్యాక కూడా నెర్వస్‌గా ఉండేదాన్ని. ఇపుడలా లేను. ప్రస్తుతానికి ఈ ఫేజ్ బావుంది. ఎంతో ఎంజాయ్ చేస్తున్నా'నంటోంది శాన్విక.


నవ్య | చిత్రజ్యోతి



ట్రైలర్ ప్రామిసింగ్‌గా ఉంది

ప్రియదర్శి, నభానటేశ్ జంటగా నటిస్తున్న చిత్రం 'డార్లింగ్'. 'వై దిస్ కొలవెరీ' అనేది ఉపశీర్షిక. అశ్విన్ రామ్ దర్శకత్వంలో కె.నిరంజన్‌రెడ్డి, చైతన్య నిర్మిస్తున్నారు. ఈ నెల 19న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ట్రైలర్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా విశ్వక్ సేన్ మాట్లాడుతూ "ట్రైలర్ చాలా ప్రామిసింగ్‌గా, హిలేరియస్‌గా ఉంది. 'డార్లింగ్' టీమ్ అందరికీ ఆల్ ద బెస్ట్" అని చెప్పారు. ప్రియదర్శి మాట్లాడుతూ "ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని అన్నారు. డైరెక్టర్ అశ్విన్ రామ్ మాట్లాడుతూ "ప్రేక్షకులకు ఈ సినిమా చాలా ఫ్రెష్ ఫీల్‌ను ఇస్తుంది" అని చెప్పారు.

సైకలాజికల్ థ్రిల్లర్



ప్రిన్స్, నరేశ్ అగస్త్య హీరోలుగా శివ శేషు దర్శకత్వం వహిస్తున్న చిత్రం 'కలి'. లీలా గౌతమ్ వర్మ నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టీజర్‌ను దర్శకుడు నాగ్ అశ్విన్ ఆదివారం ఆవిష్కరించారు. కలి పాత్ర నేపథ్యంలో సైకలాజికల్ థ్రిల్లర్‌గా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నామని దర్శకుడు తెలిపారు. ఈ చిత్రం ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని పంచుతుందని నిర్మాత చెప్పారు.

ఆరేళ్ల కష్టం భారతీయుడు 2



'ఇండియన్ 2' చిత్రం ఈ తరానికి నచ్చుతుంది. ఇది ప్రజల చిత్రం. 28ఏళ్ల తర్వాత మళ్లీ అదే పాత్ర, అదే దర్శకుడు నన్ను వెతుక్కుంటూ రావటం నా అదృష్టం. ఆరేళ్ల కష్టం ఈ సినిమా. ఇన్నేళ్లు అభిమానులు నన్ను స్టార్‌గా నిలబెట్టారు. ఈ జన్మలో వారి రుణాన్ని తీర్చుకోలేను' అని కమల్ హాసన్ అన్నారు. ఆయన హీరోగా నటించిన చిత్రం 'భారతీయుడు 2'. 1996లో తెరకెక్కిన 'భారతీయుడు'కు సీక్వెల్‌గా శంకర్ దర్శకత్వం వహించగా, సుభాస్కరన్ నిర్మించారు. సిద్ధార్థ్, ఎస్.జే.సూర్య, రకుల్ ప్రీత్‌సింగ్ కీలక పాత్రల్లో నటించారు. ఈ నెల 12న సినిమా విడుదలవుతున్న సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కమల్ హాసన్ మాట్లాడుతూ "ఈ సినిమాలో మీకు కమల్ ఎక్కడా కనిపించడు. కేవలం 'సేనాపతి' మాత్రమే అందరికీ కనిపిస్తాడు" అని చెప్పారు. డైరెక్టర్ శంకర్ మాట్లాడుతూ "సినిమా సెట్‌లో కమల్‌ని సేనాపతిగా చూడగానే గూస్‌బంప్స్ వచ్చేవి. థియేటర్స్‌లో సినిమా చూసే ప్రేక్షకులకూ ఇదే ఫీలింగ్ కలుగుతుంది" అని అన్నారు.

తుఫాన్‌ను ఎంజాయ్ చేస్తారు



విజయ్ ఆంటోని హీరోగా నటిస్తున్న చిత్రం 'తుఫాన్'. మేఘా ఆకాశ్ కథానాయిక. విజయ్ మిల్టన్ దర్శకత్వంలో కమల్‌బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. ఈ నెల 26న సినిమా విడుదలవుతోంది. ఈ సందర్భంగా శనివారం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు.విజయ్ ఆంటోని మాట్లాడుతూ "ఈ సినిమా నేపథ్యం చాలా కొత్తగా ఉంటుంది. సినిమాను అందరూ ఎంజాయ్ చేస్తారు" అని అన్నారు. విజయ్ మిల్టన్ మాట్లాడుతూ "ఈ సినిమా మీ అందరికీ తప్పకుండా నచ్చుతుంది" అని చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని.

నీ శవం కూడా దొరక్కుండా చేస్తామన్నారు

- **హీరోయిన్ మాల్వీ మల్హోత్రాపై రాజ్‌తరుణ్ మాజీ ప్రేయసిగా చెబుతున్న లావణ్య ఆరోపణలు**
- **ఆమెపై పరువు నష్టం దావా వేస్తాను - మాల్వీ మల్హోత్రా**





హీరో రాజ్‌తరుణ్, అతని ప్రేయసినని చెబుతున్న లావణ్య మధ్య మొదలైన వివాదం కాస్త రోజుకో కొత్త మలుపు తీసుకుంటోంది. హీరోయిన్ మాల్వీ మల్హోత్రా, ఆమె కుటుంబ సభ్యులపైన లావణ్య శనివారం సంచలన ఆరోపణలు చేశారు.

'నీకు డబ్బు ఇస్తాం. తీసుకొని రాజ్‌తరుణ్‌ను వదిలేసి వెళ్లిపో. లేదంటే నిన్ను చంపుతాం. హిమాచల్ ప్రదేశ్ సీఎం మా నాన్నకు స్నేహితుడు. నిన్ను చంపేసి ఇక్కడ లోయలో పడేస్తే నీ శవం కూడా దొరకదు ఏమనుకుంటున్నావో' అని మాల్వీ మల్హోత్రా, ఆమె సోదరుడు నన్ను బెదిరించారు. వీటన్నింటికీ నా దగ్గర ఆధారాలున్నాయి. దాంతో నేను కేసు పెట్టాను. వాళ్ల నుంచి నాకు ప్రాణహాని ఉంది. వారి బారి నుంచి నాకు పోలీసులు రక్షణ కల్పించాలి' అని లావణ్య డిమాండ్ చేశారు. "రాజ్‌తరుణ్ నీతో హ్యాపీగా లేడు, నాతోనే హ్యాపీగా ఉంటున్నాడు. అతన్నివదిలేయి' అని మాల్వీ అడిగింది. కానీ నేను ఒప్పుకోకపోవడంతో 'రాజ్ నుంచి నిన్ను విడదీస్తాను, జైలుకు పంపుతాను' అని మాల్వీ సవాల్ చేసింది. తను అన్నట్లే నన్ను డ్రగ్స్ కేసులో ఇరికించి, 45 రోజులు జైల్లో మగ్గేలా చేసింది"ని లావణ్య వాపోయారు. ఈ వ్యవహారమంతా రాజ్‌తరుణ్ స్నేహితులు వరుణ్‌సందేశ్, నిఖిల్... ఆయన మేనేజర్ రాజా రవీంద్రకు తెలుసు. కానీ వాళ్లంతా ఏమీ పట్టనట్లు ఉంటున్నారని లావణ్య ఆవేదన వ్యక్తం చేశారు. డబ్బు కోసం రాజ్‌ను బెదిరించాల్సిన అవసరం తనకు లేదన్నారు. 'గతంలో పలు ఇంటర్వ్యూల్లో రాజ్ 'విజయవాడ అమ్మాయిని పెళ్లి చేసుకుంటాను' అని చెప్పింది నా గురించే, అతను నన్ను గచ్చిబౌలిలోని ఎల్లమ్మ గుడిలో పెళ్లి చేసుకున్నాడు. సినిమాల్లో స్థిరపడ్డాక పెళ్లి విషయం బయటకు చెబుదామన్నాడు. ఇప్పుడు మాల్వీ మల్హోత్రా తన జీవితంలోకి ప్రవేశించడంతో నన్ను దూరం పెట్టాడు. వాళ్లిద్దరూ చెన్నైలో కలసి ఉన్నట్లు.. నా దగ్గర అన్ని ఆధారాలు ఉన్నాయి. 'బిగ్‌బాస్ ఫేం అరియానా గ్లోరీకి రాజ్‌తరుణ్ దగ్గరవుతున్నాడు, వచ్చి నీ సంసారాన్ని కాపాడుకో' అని రాజారవీంద్ర హెచ్చరించారు. రాజ్‌తరుణ్ లేకుండా నేను బ్రతకలేను. ఆయన ఆరోపించినట్లు నాకూ మస్తాన్‌కు మధ్య ఎలాంటి సంబంధం లేదు. అతను నా స్నేహితుడు మాత్రమే' అని లావణ్య చెప్పారు.

లావణ్యే బెదిరించింది

'మాల్వీ మల్హోత్రా, ఆమె సోదరుడు లావణ్యను బెదిరించలేదు. ఆమే మాల్వీని బెదిరించింది. ఆ ఆధారాలు అన్నీ మాల్వీ దగ్గర ఉన్నాయి. వాళ్లు కూడా కేసు పెడతారు' అని లావణ్య చేసిన ఆరోపణలపై రాజ్‌తరుణ్ వివరణ ఇచ్చారు.

లావణ్య ఎవరు?

లావణ్య చేస్తున్న కామెంట్స్‌పై నటి మాల్వీ మల్హోత్రా స్పందించారు. 'నాపై ఆరోపణలు చేస్తున్న లావణ్య ఎవరో కూడా నాకు తెలియదు. ఆమె నా కుటుంబ సభ్యుల ఫోన్ నంబర్స్ తీసుకున్నారు. అవి ఎలా రాబట్టుకున్నారో తెలియట్లేదు. దీనిపై సైబర్‌క్రైమ్ కేసు పెడతాను. నేను, రాజ్‌తరుణ్ కేవలం సినిమాల గురించే మాట్లాడుకుంటాం. మా మధ్య అంతకుమించిన రిలేషన్ లేదు. రాజ్‌తరుణ్‌తో నేను గతేడాది సెప్టెంబరులోనే మాట్లాడాను. ఆ తర్వాత మా మధ్య మాటలు కూడా లేవు. నాకు సంబంధం లేని విషయంలోకి ఆమె నన్ను నెడుతోంది. నేను ఇప్పుడిప్పుడే ఇండస్ట్రీలోకి వస్తున్నా. రాజ్‌తరుణ్‌తో నటించిన 'తిరగబడరా సామి' నా మొదటి సినిమా. సినిమా కెరీర్ దెబ్బతింటుందని ఇన్నాళ్లు కేసు పెట్టకుండా ఆగాను. ఇలాంటి ఆరోపణలు నటిగా నా పరువును దెబ్బతీస్తాయి. ఆమెపై నేను పరువు నష్టం దావా వేస్తాను" అని హెచ్చరించారు. రాజ్ తరుణ్ ఈ వివాదంలోకి నా పేరు ఎందుకు తెచ్చాడో అర్థం కావడం లేదు, లావణ్యతో నాది స్నేహం మాత్రమే అని మస్తాన్ చెప్పాడు.

పాంగాంగ్ వద్ద చైనా తవ్వకాలు

- భారీగా భూగర్భ బంకర్ల నిర్మాణం
- వాటిలో ఆయుధాలు, ఇంధనం నిల్వ
- సాయుధ వాహనాలకు పటిష్ఠమైన షెల్టర్లు
- ఉపగ్రహ చిత్రాలతో వెలుగులోకి
- మోదీ ప్రభుత్వం కళ్లకు గంతలు కట్టుకుంది: ఖర్గే

న్యూఢిల్లీ, జూలై 7: తూర్పు లద్దాక్‌లోని పాంగాంగ్ సరస్సు వద్ద భారీ భూగర్భ బంకర్లు నిర్మించేందుకు చైనా సైన్యం చాలా లోతుగా తవ్వుతున్న దృశ్యాలు ఉపగ్రహ చిత్రాల ద్వారా వెలుగులోకి వచ్చాయి. పాంగాంగ్ సరస్సు ఉత్తర దిక్కున పర్వతాల మధ్య సిర్జాప్ ప్రాంతంలో చైనా సైన్యం పీఎల్‌ఏ(ది పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ) ప్రధాన స్థావరం ఉంది. పాంగాంగ్ సరస్సు చుట్టుపక్కల ప్రాంతాల్లో మోహరించిన డ్రాగన్ సైన్యానికి అదే ప్రధాన కార్యాలయం. దానిని వాస్తవాధీన రేఖకు సుమారు 5 కిలోమీటర్ల దూరంలో నిర్మించారు. అది భారతదేశ భూభాగమని భారత్ వాదిస్తోంది. 2020లో ఇరుదేశాల మధ్య ఉద్రిక్తత తలెత్తక ముందు ఇక్కడ ఎటువంటి మానవ ఆవాసాలూ లేవు. 2021-22 మధ్యలోనే సిర్జాప్‌లోని స్థావరాన్ని డ్రాగన్ సైన్యం నిర్మించింది. అక్కడ ఆయుధాలు, ఇంధనం, ఇతర సామగ్రి నిల్వ చేసుకునేందుకు భూగర్భ బంకర్లు నిర్మిస్తున్న విషయాన్ని అమెరికాకు చెందిన బ్లాక్‌స్కై సంస్థ ఉపగ్రహ చిత్రాల ద్వారా వెలుగులోకి తెచ్చింది. మే 30వ తేదీన తీసిన ఫొటోలో 8 ప్రవేశమార్గాలు ఉన్న భారీ భూగర్భ బంకర్ వెలుగులోకి వచ్చింది.



దానికి సమీపంలోనే 5 ప్రవేశమార్గాలున్న మరో చిన్న బంకర్ కూడా ఉంది. ఇక్కడి ప్రధాన స్థావరం కోసం అనేక భారీ భవనాలు నిర్మించడంతోపాటు, సాయుధ వాహనాల పార్కింగ్‌కు పటిష్ఠమైన షెల్టర్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నారు. సరిహద్దులో పరిస్థితిపై ప్రభుత్వం దేశాన్ని విశ్వాసంలోకి తీసుకోవాలనే కాంగ్రెస్ పార్టీ డిమాండ్‌ను ఆ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే పునరుద్ఘాటించారు. పాంగాంగ్ సరస్సు వద్ద చైనా తవ్వకాలపై మీడియా కథనాన్ని ఖర్గే ఆదివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. 'మోదీ ప్రభుత్వం తన ఎర్రటి కళ్లపై 56 అంగుళాల చైనా గంతలు కట్టుకోవడంతో మోదీ యొక్క చైనీస్ గ్యారెంటీ కొనసాగుతోంది' అని ఖర్గే విమర్శించారు.

లోకం తీరు



ఏటా 2 ఇంజెక్షన్లతో ఎయిడ్స్‌కు చెక్

- లెనాకాపవిర్ పేరుతో అభివృద్ధి చేసిన గిలియడ్ సైన్సెస్ కంపెనీ
- దక్షిణాఫ్రికా, ఉగాండాలో ట్రయల్స్
- 100% సక్సెస్.. ఈ ఇంజెక్షన్ తీసుకున్న 2134 మందీ సురక్షితం
- మరిన్ని అధ్యయనాల తర్వాత మార్కెట్‌లోకి విడుదల

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ప్రపంచాన్ని గడగడలాడిస్తున్న హెచ్‌ఐవీ (హ్యూమన్ ఇమ్యూనో వైరస్) నుంచి రక్షణ ఇచ్చే ఇంజెక్షన్.. లెనాకాపవిర్ త్వరలో అందుబాటులోకి రాబోతోంది. ఏటా రెండుసార్లు ఈ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా ఆ వైరస్‌కు చెక్ పెట్టవచ్చు. నిజానికి హెచ్‌ఐవీని నిరోధించే రెండు రకాల మాత్రలు ప్రస్తుతానికి అందుబాటులో ఉన్నాయి. మొదటిది 2012లో అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (ఎఫ్‌డీఏ) అనుమతి పొందిన ట్రువాడా మాత్ర. రెండోది.. 2016లో అందుబాటులోకి వచ్చిన డెస్కోవీ. ఆ రెండింటితో పోలిస్తే క్లినికల్ ట్రయల్స్‌లో ఈ ఇంజెక్షన్ నూటికి నూరుశాతం విజయవంతం కావడం గమనార్హం. ఈ ఔషధం.. హెచ్‌ఐవీ క్యాప్సిడ్ (వైరస్ చుట్టూ ఉండే ప్రొటీన్లతో కూడిన రక్షణ పొర)ను ధ్వంసం చేయడం ద్వారా వైరస్ తన సంఖ్యను పెంచుకోకుండా చేస్తుంది. ఆఫ్రికా దేశాల్లో చాలా మంది మహిళలు అత్యాచారాలకు గురై ఎయిడ్స్ బారిన పడుతున్న నేపథ్యంలో ఈ ఇంజెక్షన్ క్లినికల్ ట్రయల్స్‌ను సౌతాఫ్రికాలోని 25 ప్రాంతాల్లో, ఉగాండాలోని 3 ప్రాంతాల్లో నిర్వహించారు. ట్రయల్స్‌లో భాగంగా 5000 మంది మహిళలను ఎంచుకుని వారిని మూడు కేటగిరీలుగా విభజించారు. మొదటి కేటగిరీలోని 2134 మంది మహిళలకు లెనాకాపవిర్ ఇంజెక్షన్ ఇచ్చారు. రెండో కేటగిరీలోని 1068 మందికి ట్రువాడా, 2136 మందికి డెస్కోవీ మాత్రలు ఇచ్చారు. వీరిలో ట్రువాడా మాత్ర తీసుకున్నవారిలో 16 మందికి, డెస్కోవీ మాత్ర తీసుకున్నవారిలో 39 మందికి ట్రయల్ సమయంలో హెచ్‌ఐవీ సోకింది. లెనాకాపవిర్ ఇంజెక్షన్ తీసుకున్న 2134 మందిలో ఒక్కరికి కూడా హెచ్‌ఐవీ సోకలేదు. అంటే.. 100 శాతం సక్సెస్. ఎయిడ్స్ కారక హ్యూమన్ ఇమ్యూనో వైరస్ నుంచి పూర్తిస్థాయిలో రక్షణ లభిస్తుందని తేలింది. ట్రువాడా, డెస్కోవీ మాత్రలను అభివృద్ధి చేసిన అమెరికన్ ఫార్మా దిగ్గజం గిలియడ్ సైన్సెస్ సంస్థే ఈ లెనాకాపవిర్‌నూ అభివృద్ధి చేసింది. తమ క్లినికల్ ట్రయల్స్‌కు సంబంధించిన పూర్తి వివరాలను సౌతాఫ్రికా, ఉగాండా దేశాల్లోని ఔషధ నియంత్రణ సంస్థలకు, ప్రపంచ ఆరోగ్య సంస్థకు అందించనున్నట్లు గిలియడ్ సైన్సెస్ వెల్లడించింది. ఈ ఔషధం అందరికీ అందుబాటులో ఉండేలా తక్కువ ధరకు అందించే ఉద్దేశంతో గిలియడ్ సైన్సెస్ సంస్థ.. జనరిక్ డ్రగ్స్ తయారుచేసే కంపెనీలకు దీనికి సంబంధించిన లైసెన్స్‌లు ఇచ్చే యోచనలో ఉన్నట్టు సమాచారం. అంటే ఆయా ఫార్మా కంపెనీలు కూడా ఈ ఔషధాన్ని తయారు చేస్తాయన్నమాట. తద్వారా ఇది ఎక్కువగా అందుబాటులోకి వచ్చి ధర తగ్గుతుంది. అలాగే ప్రభుత్వాలు కూడా ఈ ఔషధాన్ని విరివిగా కొనుగోలు చేసి.. హెచ్‌ఐవీ నుంచి రక్షణ పొందాలనుకునే ప్రతీ ఒక్కరికి ఇవ్వాలని ఆ సంస్థ కోరింది. కాగా.. హెచ్‌ఐవీ చికిత్స నిమిత్తం ఈ డ్రగ్‌కు ఎఫ్‌డీఏ 2022లోనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.

అసోంలో టీచర్‌ను పొడిచి చంపిన విద్యార్థి

గువాహటి, జూలై 7: అసోంలో 11వ తరగతి చదువుతున్న ఓ విద్యార్థి తరగతి గదిలోనే ఉపాధ్యాయుడిని పొడిచి చంపేశాడు. ఈ ఘటన శివసాగర్ జిల్లాలో శనివారం జరిగింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రాజేశ్ బారువా బెజవాడ(55) శివసాగర్ పట్టణంలో ఓ కోచింగ్ సెంటర్‌లో రసాయన శాస్త్రం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. సరిగ్గా చదవడం లేదని ఓ విద్యార్థిని శుక్రవారం ఆయన మందలించారు. శనివారం ఆ విద్యార్థి కోచింగ్ సెంటర్‌కు సివిల్ డ్రెస్‌లో వచ్చాడు. సాయంత్రం క్లాస్ చెప్పేందుకు వచ్చిన రాజేశ్.. సివిల్ డ్రెస్‌లో వచ్చినందుకు ఆ విద్యార్థిని మరోసారి మందలించాడు. దాంతో ఆ విద్యార్థి ఒక్కసారిగా కత్తితో ఉపాధ్యాయుడిపై దాడి చేశాడు. పలుమార్లు పొడవడంతో రాజేశ్ తీవ్రరక్తస్రావమై పడిపోయాడు. రాజేశ్‌ను ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మరణించాడని వైద్యులు తెలిపారు. పోలీసులు మైనర్ అయిన ఆ విద్యార్థిని అదుపులోకి తీసుకున్నారు. దాడి చేసిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు.

ఇద్దరు బెంగాల్ ఐపీఎస్‌లపై క్రమశిక్షణ చర్యలు

కోల్‌కతా, జూలై 7: రాజ్‌భవన్ పరువు తీశారన్న ఆరోపణలపై పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇద్దరు ఐపీఎస్ అధికారులపై కేంద్ర హోం శాఖ క్రమశిక్షణ చర్యలు ప్రారంభించింది. కోల్‌కతా పోలీసు కమిషనర్ వినీత్ గోయల్, డీసీపీ ఇందిరా ముఖర్జీలపై చర్యలు ప్రారంభించినట్టు తెలిపింది. వారిద్దరు రాజ్‌భవన్‌పై దుష్ప్రచారం చేస్తున్నారంటూ గవర్నర్ సీవీ.ఆనంద్ బోస్ కేంద్ర హోం శాఖకు ఫిర్యాదు చేయడంతో పాటు, వారి పనితీరుపై నివేదిక పంపించారు. ఎన్నికల అనంతరం జరిగిన హింసలో బాధితులైనవారు తనను కలిసేందుకు రాగా ఆ అధికారులు వారిని రానీయలేదని గవర్నర్ తెలిపారు. తనపై ఓ మహిళా ఉద్యోగి కల్పిత ఆరోపణలు చేయగా మరికొందరు పోలీసు అధికారులు వాటిని ప్రచారంలోకి తెచ్చారని తెలిపారు. గవర్నర్ కార్యాలయ ప్రతిష్ఠకు నష్టం కలిగించారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తాను వద్దని చెప్పినప్పటికీ రాజ్‌భవన్ ఉద్యోగులను తనిఖీ చేస్తున్నారని, గుర్తింపు కార్డులు చూపాలని అడుగుతున్నారని తెలిపారు.

మహువాపై కొత్త చట్టం బీఎన్ఎస్ కింద కేసు

న్యూఢిల్లీ, జూలై 7: జాతీయ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రేఖా శర్మ తన బాస్(ప్రధాని మోదీ) పరువు కాపాడే పనిలో బిజీగా ఉన్నారనే అర్థం వచ్చేలా టీఎంసీ ఎంపీ మహువా ఇటీవల చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలపై ఆదివారం ఢిల్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. కొత్త నేర న్యాయ చట్టమైన భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని సెక్షన్ 79 (మహిళలను కించపరిచేలా మాట్లాడడం, సంజ్ఞలు చేయడం) కింద కేసు పెట్టారు. మహువా వ్యాఖ్యలపై జాతీయ మహిళా కమిషన్ ఆదేశాల మేరకు ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు ఈ కేసు పెట్టారు.

హత్రాస్ బాధితులకు పరిహారం పెంచండి: రాహుల్

న్యూఢిల్లీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): హత్రాస్ తొక్కిసలాట ఘటన బాధిత కుటుంబాలకు నష్టపరిహార మొత్తాన్ని పెంచి, వీలైనంత త్వరగా ఆ మొత్తం అందించాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విజ్ఞప్తి చేశారు. క్షతగాత్రులకు సరైన చికిత్స అందించాలని, వారికి కూడా తగిన నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్‌కు ఆయన లేఖ రాశారు. బాధితులకు యూపీ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం చాలా తక్కువగా ఉందని రాహుల్ అన్నారు. ఘటనకు స్థానిక యంత్రాంగ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని బాధిత కుటుంబాలు తనతో చెప్పాయని ఆయన వివరించారు. ఈ వ్యవహారంపై నిష్పాక్షిక, పారదర్శక దర్యాప్తు జరిపించాలని కోరారు.

కశ్మీర్‌లో 8కి పెరిగిన ఎన్‌కౌంటర్ల మృతుల సంఖ్య

న్యూఢిల్లీ, జూలై 7: కుల్‌గాం జిల్లాలో శనివారం జరిగిన రెండు ఎన్‌కౌంటర్లలో మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. మొడెర్‌గాంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఒక జవాను; చిన్నిగాంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక జవాను, నలుగురు ఉగ్రవాదులు మరణించారని, మొత్తం ఆరుగురు ప్రాణాలు కోల్పోయారని తొలుత అధికారులు ప్రకటించారు. అయితే ఆదివారం మొడెర్‌గాంలో మరో ఇద్దరు ఉగ్రవాదుల శవాలు దొరకడంతో మరణించిన వారి సంఖ్య ఎనిమిదికి పెరిగింది. ప్రాణాలు కోల్పోయిన జవాన్లలో సుశిక్షితుడైన ఒక పారా కమాండో కూడా ఉన్నారు.

పూరీ రథయాత్రలో తొక్కిసలాట

ఒక భక్తుడి మృతి.. ఐదుగురికి తీవ్రగాయాలు.. బలభద్రుడి రథం లాగుతుండగా ఘటన

- డీహైడ్రేషన్, శ్వాస సమస్యలతో 300 మంది ఆసుపత్రికి
- లక్షలాది భక్తులతో పూరీ కిటకిట
- వేడుకలకు హాజరైన రాష్ట్రపతి ముర్ము

భువనేశ్వర్, జూలై 7: ఒడిశాలోని సముద్రతీర క్షేత్రం పూరీలో ఆదివారం నిర్వహించిన జగన్నాథ రథయాత్రలో అపశ్రుతి చోటు చేసుకుంది. రథయాత్ర సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఒక భక్తుడు మృతిచెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. బలభద్రుడి తాళధ్వజ రథాన్ని లాగడానికి భక్తులు ఒక్కసారిగా ఎగబడటం ఈ దుర్ఘటనకు దారితీసింది. తొక్కిసలాటలో కింద పడిపోయి అపస్మారక స్థితిలోకి వెళ్లిన గుర్తు తెలియని 60ఏళ్ల వృద్ధుడిని హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తొక్కిసలాటలో గాయపడిన మరో ఐదుగురిని కూడా ఆస్పత్రికి తరలించగా వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. మరోవైపు విపరీతమైన ఎండ, ఉక్కపోతతో యాత్రకు హాజరైన 300మందికి పైగా భక్తులు డీహైడ్రేషన్, శ్వాస తీసుకోవడంతో ఇబ్బందులతో ఆస్పత్రిలో చేరారు. వీరిలో 50 మందిని ప్రాథమిక చికిత్స అనంతరం డిశ్చార్జి చేశారు. ఒడిశా ఆరోగ్యశాఖ కార్యదర్శి ఆస్పత్రికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు.


పూరీ జగన్నాథుడి రథయాత్రకు తరలివచ్చిన జనం


యాత్ర ప్రారంభానికి ముందు రథాల ముందు ప్రణమిల్లుతున్న రాష్ట్రపతి ముర్ము

మార్మోగిన 'జై జగన్నాథ్' నినాదాలు

పూరీ జగన్నాథుడి రథయాత్ర ఆదివారం కోలాహలంగా ప్రారంభమైంది. 1971 తర్వాత తొలిసారిగా ఈ ఏడాది రెండు రోజుల పాటు ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ వేడుకలను ప్రత్యక్షంగా వీక్షించడానికి దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ఆలయం నుంచి దేవతామూర్తులను రథాల వద్దకు తీసుకొచ్చే పహండి కార్యక్రమం మధ్యాహ్నం 2.15 గంటలకు ముగిసింది. గర్భాలయం నుంచి మూలవిరాట్టు బయలుదేరే ముందు మంగళహారతి, మైలం, నవయవ్వన దర్శనం, నేత్రోత్సవం తదితర ఆచారాలు నిర్వహించారు. తొలుత బలభద్రుడిని తాళధ్వజ రథంపైకి, సుభద్రను దర్పదలన్ రథంపైకి చేర్చారు. భక్తుల జయజయధ్వానాల మధ్య జగన్నాథుడు తన నందిఘోష్ రథం వద్దకు చేరుకున్నారు. పహండీ అనంతరం రథాలను అధిష్ఠించిన దేవతామూర్తులకు పూరీ శంకరాచార్య నిశ్చలానంద సరస్వతి ప్రత్యేకపూజలు నిర్వహించారు. మధ్యాహ్నం 4గంటలకు పూరీ రాజు గజపతి దివ్య సింగ్ దేవ్ రథాలపై చెరాపహరా (చీపురుతో రథాలను శుభ్రం చేసే ప్రక్రియ) చేశారు. రథాలకు చెక్క గుర్రాలను అమర్చిన తర్వాత రథయాత్ర ప్రారంభమైంది. సాయంత్రం 4.50 గంటలకు బలభద్రుడి రథం తాళధ్వజం ముందుగా బయలుదేరింది. ఆ తర్వాత 6 గంటలకు దర్పదలన రథంలో సుభద్ర దేవి కదిలారు. 6.45 గంటలకు నందిఘోష్ రథంలో జగన్నాథుడి యాత్ర కదిలింది. ఈ ఊరేగింపు జగన్నాథుడి ఆలయం వద్ద ప్రారంభమై అక్కడకు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న గుండిచా ఆలయం వద్దకు చేరుకొంటుంది. ఆదివారం రాత్రి రథయాత్ర ముగిసే సమయానికి బలభద్రుడు, దేవి సుభద్ర రథాలు గ్రాండ్ రోడ్డులోకి ప్రవేశించాయి. మారికోట్ చౌక్ వద్ద, రాజ్ ప్యాలెస్ సమీపంలో ఈ రెండింటినీ వరుసగా నిలిపివేశారు. జగన్నాథుడి రథం ఆలయ సింహద్వారం నుంచి బయలుదేరి కొన్ని అడుగులు ప్రయాణించిన తర్వాత ఆగిపోయింది. సోమవారం ఉదయం రథయాత్ర తిరిగి ప్రారంభంకానుంది. కాగా, రథయాత్రలో దాదాపు 15 లక్షల మంది భక్తులు పాల్గొనే అవకాశం ఉందని అంచనా వేసిన అధికారులు ఆ మేరకు పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. కాగా, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై నుంచి రాష్ట్రపతి ముర్ము రథయాత్రను వీక్షించారు. మూడు రథాలకు ప్రదక్షిణలు చేసి బలభద్రుడి తాళధ్వజాన్ని, సుభద్ర దర్పదలన రథాన్ని ముర్ము ప్రారంభించారు. పూరీ రథయాత్రలో దేశ రాష్ట్రపతి పాల్గొనడం ఇదే మొదటిసారి. కాగా పశ్చిమ బెంగాల్ సీఎం మమత ఆదివారం ఇస్కాన్ ఆధ్వర్యంలో కోల్‌కతాలో నిర్వహించిన జగన్నాథుడి రథయాత్రలో పాల్గొన్నారు. రథాన్ని లాగారు.

చార్‌ధామ్ యాత్ర తాత్కాలిక నిలిపివేత

- భారీవర్షాల నేపథ్యంలో నిర్ణయం
- వరదలతో గోవా, మహారాష్ట్రల్లో పలుచోట్ల చిక్కుకుపోయిన జనం

డెహ్రాడూన్, పనాజీ, ముంబై, జూలై 7: ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కొనసాగుతాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో స్థానిక అధికారులు చార్‌ధామ్ యాత్రను ఆదివారం తాత్కాలికంగా నిలిపివేశారు. ఆది, సోమవారాల్లో భారీ వర్ష సూచన ఉండటంతో యాత్రికుల భద్రత కోసం ఈ నిర్ణయం తీసుకున్నామని గెర్వాల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే తెలిపారు. యాత్రికులు రుషికేశ్‌ను దాటివెళ్లవద్దని, ఇప్పటికే యాత్రలో ఉన్న వాళ్లు ఎక్కడిక్కడే నిలిచిపోవాలని హెచ్చరించారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలతో కొండచరియలు విరిగిపడుతున్నాయి. దీంతో బద్రీనాథ్‌కు వెళ్లే మార్గంలో పలుచోట్ల ఆటంకాలు ఏర్పడ్డాయి. హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు యాత్రికులు బద్రీనాథ్‌కు వెళ్లి మోటార్‌సైకిల్‌పై తిరిగి వస్తుండగా కొండచరియలు పడి దుర్మరణం పాలైన విషయం తెలిసిందే. రుషికేశ్‌లోని గంగానదిలో నీటి మట్టం ప్రమాదకరస్థాయికి చేరుకోవటంతో తీరప్రాంతంలోని ప్రజలను సురక్షితప్రాంతాలకు తరలించారు.

జలపాతం వద్ద చిక్కుకున్న పర్యాటకులు

భారీ వర్షాలతో గోవా, మహారాష్ట్రల్లో నదులు ఉప్పొంగుతున్నాయి. గోవాలోని సత్తారీ తాలూకాలో ఆదివారం ఓ జలపాతం వద్దకు వెళ్లిన పర్యాటకులు.. అకస్మాత్తుగా నీటి ఉధృతి పెరగడంతో అక్కడే చిక్కుకుపోయారు. అధికారులు 50 మందిని రక్షించారు. మరో 30 మందిని రక్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయని ఎస్పీ అక్షత్ కౌశల్ తెలిపారు. మహారాష్ట్ర థానే పరిధిలో ఓ రిసార్టు వరద ముంపునకు గురవటంతో అక్కడున్న 49 మందిని ఎన్డీఆర్ఎఫ్ రక్షించింది. పాల్ఘాట్ జిల్లాలో 16మంది గ్రామీణులు వరద ప్రవాహంలో చిక్కుకుపోగా ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు.

బీసీసీఐ గర్వం అణిగింది

- జింబాబ్వేతో మొదటి మ్యాచ్‌లో భారత్ జట్టు ఓటమిపై థరూర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ, జూలై 7: జింబాబ్వేతో ఐదు టి20 మ్యాచ్‌ల సిరీస్‌కు భారత ద్వితీయ శ్రేణి జట్టును పంపడంపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ అభ్యంతరం వ్యక్తం చేశారు. టీమ్ ఇండియా తొలి మ్యాచ్‌లో ఓడిపోవడంతో బీసీసీఐ గర్వం అణిగిందన్నారు. "టి20 ప్రపంచకప్ గెలిచినందుకు ముంబైలో చేసుకున్న సంబరాలు ప్రతిధ్వనిస్తుండగానే.. బలహీన జట్టయిన జింబాబ్వే చేతిలో పరాజయం ఎదురైంది. ప్రత్యర్థిని తేలిగ్గా తీసుకున్నందుకు బీసీసీఐకి తగిన శాస్తి జరిగింది. జూన్ 4 (దేశంలో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజు)న కానీ, జూలై 6న కానీ (భారత్‌పై జింబాబ్వే గెలిచిన రోజు).. అహంకారం ఓ మెట్టు దిగింది. జింబాబ్వే బాగా ఆడింది" అంటూ ట్వీట్ చేశారు. దీనిపై బీజేపీ అధికార ప్రతినిధి షెహజాద్ పూనావాలా తీవ్రంగా స్పందించారు. "ఓటమి నిజమే. అయితే, జింబాబ్వేపై ఆడింది మన ప్రధాన జట్టు కాదు. కాంగ్రెస్ మాత్రం మోదీపై ద్వేషాన్ని దేశంపైన చూపుతోంది. భారత్ పరాజయంపై సంబరాలు చేసుకుంటోంది" అంటూ మండిపడ్డారు. ప్రతిగా.. "అంతర్జాతీయ మ్యాచ్‌లలో భారత జట్టు అంటే అదే స్థాయిలో ఉండాలి. కానీ, ఇది ఇండియా ఎ టీమ్. బుమ్రా, సూర్య, పంత్, సిరాజ్ వంటి వారిలో సగం మందైనా ఉండాల్సింది. వారు అందుబాటులో లేకుంటే టూర్‌ను వాయిదా వేయాల్సింది. అందుకే బీసీసీఐకి విజయం గర్వం ఇచ్చిందన్నాను" అంటూ థరూర్ మరో ట్వీట్ చేశారు. కాగా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కుమారుడు జై షా బీసీసీఐ కార్యదర్శిగా ఉన్న సంగతి తెలిసిందే.

తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ

హర్షణీయం: వెంకయ్య

న్యూఢిల్లీ, జూలై 7(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు భేటీ కావడం ఓ మంచి ముందడుగని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఏపీ సీఎం నారా చంద్రబాబునాయుడు, తెలంగాణ సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి భేటీపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. వారిద్దరూ ఇదే స్ఫూర్తితో ముందుకు సాగి ఉభయ రాష్ట్రాల మధ్య అపరిష్కృత అంశాలపై వీలైనంత త్వరలో అంగీకారానికి వస్తారని ఆశిస్తున్నానని పేర్కొన్నారు.

స్కూటీని ఢీకొట్టి.. మహిళను ఈడ్చుకెళ్లి!

- ముంబైలో హిట్ అండ్ రన్ కేసు
- మద్యం మత్తులో కారు నడిపిన శివసేన ముఖ్యనేత కుమారుడు
- మహిళ మృతి.. పరారీలో నిందితుడు

ముంబై, జూలై 7: పుణే కారు ప్రమాద ఘటన మరవకముందే.. ముంబైలో అలాంటి ఘోరమే మరొకటి చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారు జామున వర్లీ ప్రాంతంలో ఓ బీఎండబ్ల్యూ కారు స్కూటీని వెనక నుంచి అతి వేగంతో ఢీ కొట్టింది. దీంతో స్కూటీ నడుపుతున్న వ్యక్తి పక్కకు ఎగిరిపడగా.. అతడి భార్యను కొద్ది దూరం కారు ఈడ్చుకెళ్లింది. దీంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు అప్రమత్తమై ఆమెను ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. దంపతులను ప్రదీప్ నఖవా, కావేరి నఖవా (45)గా పోలీసులు గుర్తించారు. అధికార పార్టీ శివసేన (షిండే)కు చెందిన ముఖ్య నేత రాజేశ్ షా కుమారుడు మిహిర్ షా (24)నే ఆ కారు నడిపాడని ధ్రువీకరించారు. ప్రమాదం జరిగినప్పటి నుంచి మిహిర్ పరారీలో ఉన్నాడని.. అతడిని పట్టుకునేందుకు నాలుగు బృందాలను ఏర్పాటు చేసినట్టు సీనియర్ పోలీసు అధికారి కృష్ణకాంత్ తెలిపారు. పోలీసు వర్గాల సమాచారం మేరకు.. గత రాత్రి జుహూలోని ఓ బార్‌లో విహిర్ అతిగా మద్యం సేవించాడు. ఇంటికెళ్లే సమయంలో తానే కారు నడుపుతానని డ్రైవర్ నుంచి తీసుకుని అతి వేగంతో నడుపుతూ వర్లీలో స్కూటీని ఢీకొట్టాడు.. భయంతో కారుతో సహా అక్కడి నుంచి ఉడాయించాడని సమాచారం. అనంతరం అతడు నేరుగా ఓ స్నేహితురాలి ఇంటికెళ్లాడని తెలియడంతో పోలీసులు ఆమెను కూడా విచారించారు. ప్రమాద సమయంలో కారులోనే ఉన్న డ్రైవర్ రాజ్‌శ్రీ బిజావత్‌తో పాటు కారు రాజేశ్ షాపై పేరుపై ఉండటంతో ఆయన్ను కూడా పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. ఘటనపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.


ప్రమాదానికి కారణమైన కారు ఇదే..

వాళ్లను ఎవరేం చేయలేరు..

ప్రమాదంలో స్వల్పగాయాలతో బయటపడ్డ ప్రదీప్ నఖవా వర్లీ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. 'మేం చేపలు అమ్ముకొని బతికేవాళ్లం. ఎప్పటిలాగే తెల్లవారు జామున చేపల కొనేందుకు బయలుదేరగా.. 5.30 గంటల సమయంలో ఓ కారు వెనక నుంచి ఢీ కొట్టింది. మాకు ఇద్దరు పిల్లలు.. నా బండిని ఢీకొట్టిన వారు పెద్ద వాళ్లు.. వారిని ఎవరేం చేయలేరు' అని ఆవేదన చెందారు. బాధితున్ని శివసేన(యూబీటీ) నేత ఆదిత్య ఠాక్రే పరామర్శించారు. నిందితున్ని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా, ముంబై ప్రమాద ఘటనపై సీఎం ఏక్‌నాథ్ షిండే విచారం వ్యక్తం చేశారు. 'ఇది దురదృష్టకరం.. పోలీసులతో మాట్లాడాను. నిందితులెవరైనా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటాం. ఎవరినీ విడిచిపెట్టం.. చట్టం ముందు అందరూ సమానమే' అని వ్యాఖ్యానించారు.

పిల్లలు పోర్న్ చూడకుండా స్పెయిన్ ఫోన్ యాప్

మాడ్రిడ్, జూలై 7: సెల్‌ఫోన్లు అందుబాటులోకి వచ్చి చిన్నపిల్లలు అశ్లీల చిత్రాల వీక్షణకు బానిసలైపోతున్న నేపథ్యంలో స్పెయిన్ అప్రమత్తమైంది. పిల్లలు 'పోర్న్' సైట్లను చూడకుండా నిరోధించేందుకు కార్టెరా డిజిటల్ బీటా పేరుతో ఓ యాప్‌ను అభివృద్ధి చేసింది. ఒక్కముక్కలో చెప్పాలంటే.. పెద్దలు మాత్రమే చూడాల్సిన కంటెంట్‌ను చూడ్డానికి ప్రభుత్వం 'పెద్దలకు మాత్రమే' ఇచ్చే 'పోర్న్ పాస్‌పోర్ట్' అన్నమాట. ఈ యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని పిల్లలు నీలిచిత్రాలు చూడకుండా ఆపొచ్చు. సెల్‌ఫోన్‌లో అశ్లీల కంటెంట్ చూడాలనుకునేవారు ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపు కార్డుల ద్వారా వయసును ధ్రువీకరించుకున్నాక యాప్ 30 'పోర్న్ క్రెడిట్స్'ను ఇస్తుంది. వాటితో నెల రోజులు నీలిచిత్రాలు చూడొచ్చు. కంప్యూటర్‌లో పోర్న్ సైట్లు చూడాలంటే ఒక్కో క్రెడిట్ ఒక్కో క్యూఆర్ కోడ్‌ను ఉత్పత్తి చేస్తుంది. మొబైల్‌తో దాన్ని స్కాన్ చేసి వేలిముద్ర, ఫేస్ రికగ్నిషన్, పిన్ నంబర్, ప్యాటర్న్ ద్వారా వయసును ధ్రువీకరించుకోవాలి. సెల్‌ఫోన్‌లోనే చూడాలనుకుంటే క్యూఆర్ కోడ్ అవసరం లేదు. వేలిముద్ర, ఫేస్ రికగ్నిషన్ వంటి వాటి ద్వారా సదరు వెబ్‌సైట్లను యాక్సెస్ చేయొచ్చు. పిల్లలు తమ వేలిముద్రను ఆ ఫోన్‌లో నమోదు చేసుకున్నా యాప్‌లో వయసు ధ్రువీకరించుకునేందుకు వాడిన వేలిముద్ర వారి తల్లిదండ్రులది అయి ఉంటుంది కాబట్టి ఆ సైట్లు వారి వేలిముద్రతో తెరచుకోవు. పెద్దలు ఒక్కో క్రెడిట్‌తో ఒక పోర్న్ సైట్‌ను పదిసార్లు చూడొచ్చు. నెలలోపే 30 క్రెడిట్లు అయిపోతే ఎన్నిసార్లైనా రెన్యూ చేసుకోవచ్చు. చిన్నపిల్లలు పోర్న్ చూడకుండా నిరోధించడమే ప్రభుత్వ ఉద్దేశం కాబట్టి పెద్దలకెలాంటి పరిమితీ విధించలేదు.

రూ.2,500కు డేటా కొని.. కోట్లు కొల్లగొట్టారు!

- నల్ల డైరీ చెప్పిన ఓ ముఠా గోల్'మాల్' కథ
- బోగస్ కాల్ సెంటర్.. 'బీమా' పేరుతో వల

నోయిడా, జూలై 7: షాపింగ్ చేసినప్పుడో.. మందులు కొన్నప్పుడో.. బిల్లింగ్ సమయంలో ఫోన్ నంబర్ అడుగుతుంటారు. రివార్డు పాయింట్లు కలుస్తాయని కొందరు, నంబర్ ఇస్తే ఏమవుతుందిలే అని ఇంకొందరు ఇచ్చేస్తుంటారు. కానీ, ఆ డేటాతోనే మాయగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. ఇలా ఇండియా మార్ట్ అనే సంస్థ నుంచి 10 వేల మంది డేటాను రూ.2,500కు సంపాదించిన ఓ ముఠా కోట్లు కొల్లగొట్టింది. బోగస్ కాల్ సెంటర్ పెట్టి బీమా పాలసీలు, రుణాల పేరిట ఏడాది కాలంగా ప్రజలను మోసగిస్తున్న 11 మంది సభ్యుల ముఠాను నోయిడా పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠాకు ఆశిష్‌కుమార్ అలియాస్ అమిత్, జితేంద్రవర్మ అలియాస్ అభిషేక్ నాయకత్వం వహిస్తుండగా 9 మంది మహిళలు కమిషన్ ప్రాతిపదికన పనిచేస్తున్నారు. అమిత్, అభిషేక్ 2019లో ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ సంస్థలో పనిచేశారు. కొన్నాళ్లకు ఉద్యోగం మానేసి అడ్డదారిలో సంపాదించాలని పథకం వేశారు. నోయిడా సెక్టార్ 51లో ఓ భవనం నాలుగో అంతస్తులో ఎలాంటి అనుమతులు లేకుండా కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఇండియా మార్ట్ సిబ్బందికి రూ.2,500 ఇచ్చి.. ఆ మాల్ వినియోగదారులైన 10 వేల మంది ఫోన్ నంబర్లు సంపాదించారు. కాల్ సెంటర్‌లో పనిచేసేందుకు 9 మంది మహిళలను నియమించుకున్నారు. తక్కువ ధరకే ఎక్కువ ప్రయోజనాలు ఉండే బీమా పాలసీ ఇస్తామని నమ్మబలుకుతూ.. ప్రజలను పాలసీ తీసుకునేలా ఒప్పించడమే ఆ మహిళల పని. తమ గుట్టు బయట పడకుండా ఉండేందుకు నకిలీ ఆధార్ కార్డులతో 10 సిమ్ కార్డులు తీసుకుని వాటితో ఫోన్లు చేసేవారు. కర్ణాటకకు చెందిన అర్వింద్ అనే వ్యక్తి పంజాబ్ నేషనల్ బ్యాంకు ఖాతాను నెలకు రూ.10,000కు అద్దెకు తీసుకున్నారు. తమ వలలో పడినవారిని ఆ ఖాతాకు డబ్బులు జమ చేయాలని చెప్పేవారు. ఆ ఖాతా ఏటీఎం కార్డు అమిత్, అభిషేక్ దగ్గర ఉండేది. దాంతో డబ్బులు విత్‌డ్రా చేసుకునేవారు. కొందరు వ్యక్తుల నుంచి అందిన సమాచారంతో పోలీసులు ఈ బోగస్ కాల్ సెంటర్‌లో సోదాలు నిర్వహించడంతో అమిత్, అభిషేక్ ముఠా ఘరానా మోసం బయటపడింది. వారిద్దరితో పాటు కాల్ సెంటర్‌లో పనిచేస్తున్న 9 మంది మహిళలను అరెస్టు చేశారు. సోదాల్లో పోలీసులకు నలుపు రంగు డైరీ దొరికింది. గత ఏడాది కాలంగా జరిగిన ప్రతి లావాదేవీ వివరాలన్నీ ఆ డైరీలో ఉన్నాయి. వాటిని పరిశీలించిన పోలీసులు ఆశ్చర్యపోయారు. కోట్ల రూపాయల్లోనే మోసం జరిగిందని అంచనాకు వచ్చారు.

రష్యాపై ఉక్రెయిన్ దాడులు..

వొరెనెజ్‌లో ఎమర్జెన్సీ

- మోదీ రష్యా పర్యటనకు ఒక్కరోజు ముందు ఘటన

మాస్కో, జూలై 7: రష్యా దాడులను ఉక్రెయిన్ తిప్పికొడుతోంది. క్షిపణులు, డ్రోన్లతో విరుచుకుపడుతోంది. ఈ దాడులతో రష్యాలోని వొరెనెజ్‌లో మందుగుండు డిపోలో మంటలు చెలరేగాయి. దీంతో ఆదివారం వొరెనెజ్ ప్రాంతంలో అత్యవసర పరిస్థితిని విధించారు. ప్రధాని మోదీ రష్యా పర్యటనకు ఒక్కరోజు ముందు ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. దాడుల్లో ప్రాణనష్టం సంభవించలేదని వొరెనెజ్ గవర్నర్ అలెగ్జాండర్ గుసేవ్ తెలిపారు. ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించినట్లు వెల్లడించారు. ఉక్రెయిన్ డ్రోన్ల దాడిని కొనసాగిస్తోందని.. మందుగుండు డిపోలో మంటలు చెలరేగాయని తెలిపారు. కాగా, భారత్-రష్యా 22వ వార్షిక శిఖరాగ్ర సదస్సులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ సోమవారం నుంచి రెండ్రోజుల పాటు రష్యాలో పర్యటించనున్నారు. 2019 తర్వాత మోదీ రష్యా పర్యటనకు వెళ్లడం ఇదే తొలిసారి.

ఎన్‌హెచ్‌65పై ట్రామా కేర్ సెంటర్

- హైదరాబాద్-విజయవాడ హైవేపై కొర్లపాడు టోల్‌ప్లాజా వద్ద ఏర్పాటు
- అత్యాధునిక సదుపాయాలతో 10 పడకలు.. నేడు శంకుస్థాపన
- ఈ జాతీయ రహదారిపై నెలకు సగటున 30-40 మరణాలు

హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ 65.. తెలుగు రాష్ట్రాల్లోని రెండు ప్రధాన నగరాలైన హైదరాబాద్, విజయవాడను కలిపే అత్యంత కీలక మార్గం! తెలంగాణలోని 23 జాతీయ రహదారుల్లో.. అతి ఎక్కువ రోడ్డు ప్రమాదాలు జరిగే హైవేల్లో మొదటిది కూడా ఇదేనని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో.. ఎన్‌హెచ్-65పై రోడ్డు ప్రమాద మరణాల సంఖ్యను తగ్గించేందుకు ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్టు తెలంగాణ రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ వారికి.. గంటలోపు చికిత్స అందించగలిగితే వారు బతికే అవకాశాలు చాలా ఎక్కువ ఉంటాయి. అందుకే దాన్ని 'గోల్డెన్ అవర్' అంటారు! విజయవాడ-హైదరాబాద్ మధ్య ఈ దారిలో ఎక్కడ ప్రమాదం జరిగినా ఆ గోల్డెన్ అవర్‌లోనే వారికి అత్యవసర వైద్యసేవలు అందించేలా ఈ ట్రామా కేర్ సెంటర్‌ను నల్లగొండ జిల్లా కేతేపల్లి మండలం కొర్లపాడు టోల్‌ప్లాజాకు దగ్గర్లో నిర్మించాలని నిర్ణయించారు. సోమవారం ఈ మేరకు అక్కడ భూమిపూజ నిర్వహించి శంకుస్థాపన చేయనున్నారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద.. ఏడీపీ సొల్యూషన్స్ సంస్థ ఈ సెంటర్ నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు అందించనుంది. దీనిపై కోమటిరెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. "ప్రజల ప్రాణాలను కాపాడడమే మన ప్రథమ ప్రాధాన్యం కావాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆశయానికి అనుగుణంగానే ఈ ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ఈ సెంటర్‌లో అత్యవసర చికిత్సకు సంబంధించిన వైద్య ఉపకరణాలతోపాటు.. అత్యాధునిక ఆపరేషన్ థియేటర్, ఆక్సిజన్, వెంటిలేటర్ సదుపాయం కలిగిన 10 పడకలు అందుబాటులో ఉంటాయి. అన్ని విభాగాల వైద్యులూ నిత్యం అందుబాటులో ఉంటారు" అని చెప్పారు.

ఈ మార్గంలో 17 చోట్ల ఎక్కువ ప్రమాదాలు

ఎన్‌హెచ్-65పై నిత్యం ఏదో ఒకచోట ప్రమాదం చోటుచేసుకుంటూనే ఉంటుంది. రోజుకు ఒకటి, రెండు చొప్పున నెలకు సగటున 40-50 మరణాలు నమోదవుతున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి. ఈ హైవేపై గతంలో సర్వే చేసిన జాతీయ రహదారుల సంస్థ.. మొత్తం మార్గంలో 17 చోట్ల అధికంగా ప్రమాదాలు జరుగుతున్నట్టు గుర్తించింది. ఆయా ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ నిర్మాణాలకు ఇటీవల చిట్యాల దగ్గర శంకుస్థాపన చేసిన విషయం విదితమే.

ఇక ఇసుక ఉచితం

(మొదటి పేజీ తరువాయి)

ఉచిత ఇసుక పాలసీని అమలు చేసిన సంగతి తెలిసిందే. జగన్ సర్కారు వచ్చాక ఉచితాన్ని తీసేసి అంగడి సరుకుగా మార్చేశారు. జగన్ పాలనలో రీచ్‌లతో సంబంధం లేకుండా 20 టన్నుల ఇసుక లారీ గరిష్ఠంగా 46 వేలకు అమ్మారు. ట్రాక్టర్ ఇసుకను 13 వేలకు అమ్మారు. పెరిగిన ధరలతో గత ఐదేళ్లు నిర్మాణ రంగం కుదేలైంది. ఫలితంగా భవన నిర్మాణ కార్మికులు ఉపాధి కోల్పోయారు. లక్షల కోట్ల వ్యాపారాలు దెబ్బతిన్నాయి. దీని ప్రభావం రాష్ట్ర ఆర్థిక, పారిశ్రామిక, నిర్మాణ రంగ పురోగతిపై పడింది. ఇవేవీ పట్టించుకోని జగన్ తన పంథానే కొనసాగించారు. ఫలితంగా ఇసుక దొరక్క ప్రజలు అల్లాడిపోయారు. సొంత ఇల్లు నిర్మించుకోవాలన్న ఆలోచనే మానుకున్నారు. తాము అధికారంలోకి వస్తే మళ్లీ ఉచిత ఇసుక అమలు చేస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు పలు వేదికలపై హామీ ఇచ్చారు. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీని నెరవేర్చబోతున్నారు.



ఉచిత విధానం ఇలా..

ఉచిత ఇసుక విధానంలో ప్రభుత్వం రెవెన్యూ కోరుకోవడం లేదు. కాబట్టి గనుల శాఖ ఎలాంటి సీనరేజీ ఫీజులు వసూలు చేయదు. ఇసుక ప్రైవేటు అమ్మకాలు ఉండవు. ఎవరైనా సరే ఇసుక డిపోకు వెళ్లి లారీ, ట్రాక్టర్, ఎద్దుల బండి, ఇంకా మినీ ఆటోల్లో కూడా ఇసుకను తీసుకుపోవచ్చు. అయితే ఇసుక తవ్వినందుకు, తిరిగి లారీల్లో లోడ్‌చేసి ఇసుక డిపోకు తరలించినందుకు లేబర్ (కార్మికుల), ట్రాన్స్‌పోర్టు (రవాణా) చార్జీలు ప్రజలు చెల్లించాలి. అలాగే ఇసుక తీసుకెళ్లే సమయంలో సంబంధిత గ్రామ అవసరాల కోసం నిర్దేశించిన 88 రూపాయల ఫీజును, దానిపై జీఎస్టీని వినియోగదారులే భరించాలి. 2016-2019 కాలంలో ఇదే విధానం అమలయింది. రవాణా చార్జీలు ఇసుక రీచ్‌కు, డిపోకు మధ్య ఉండే దూరాన్ని బట్టి మారుతుంటాయి. ఏ జిల్లాల్లో ఎంత మేర చార్జీలు ఉంటాయన్నది కలెక్టర్లు ప్రకటించనున్నారు. ఉచితం కింద సగటున రోజుకు ఒక వినియోగదారుడికి అవసరాన్ని బట్టి 20 టన్నులే పంపిణీ చేస్తారు. అంతకుమించి ఇవ్వరు. ఇసుక డిపోకు వెళ్లేవారు ఆధార్ కార్డు, తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఫోన్ నంబర్ ఇవ్వాలి.

ఆన్‌లైన్ చెల్లింపులే

ఉచిత ఇసుక విధానంలో తవ్వకం, రవాణా, జీఎస్టీ చార్జీలను ఆన్‌లైన్‌లో వినియోగదారులు చెల్లించాలి. ఇందుకోసం ఇప్పటికే జిల్లా కలెక్టర్, గనుల శాఖ అధికారి నేతృత్వంలో ఓ జాయింట్ ఖాతాను ఏర్పాటు చేశారు. వాటికి సంబంధించి బ్యాంకులు ఇప్పటికే క్యూఆర్ కోడ్‌లు జారీ చేశాయి. ఇసుక డిపోల్లో ఈ క్యూఆర్ కోడ్‌లు అందుబాటులో ఉంచుతారు. వినియోగదారులు ఫోన్‌పే, గూగుల్‌పే, భీమ్ పే వంటి వాటి ద్వారా చెల్లింపులు చేయవచ్చు. ఈ సదుపాయం లేని వారు నేరుగా డిపోలోని అధికారికి నగదు ఇస్తే దాన్ని డిజిటల్ పేమెంట్‌గా మార్చి చెల్లింపులు జరిగే అవకాశం కల్పించనున్నారు.

డిపోల్లో 44.50 లక్షల టన్నులు...

గనుల శాఖ అధికారిక లెక్కల ప్రకారం రాష్ట్ర వ్యాప్తంగా 44.50 లక్షల టన్నుల ఇసుక సిద్ధంగా ఉంది. 18 జిల్లాల పరిధిలో ప్రతిమ ఇన్‌ఫ్రా, 8 జిల్లాల పరిధిలో జీసీకేసీ సంస్థలు తమ నియంత్రణలోని ఇసుక డంప్‌లను గనుల శాఖకు స్వచ్ఛందంగా అప్పగించాయి. అలాగే ఉమ్మడి గోదావరి జిల్లాల పరిధిలో బోట్‌మెన్ సొసైటీల పరిధిలోని ఇసుకను కూడా డిపోల పరిధిలోకి తీసుకురాబోతున్నారు. వర్షాకాలం ముగిసేవరకు కనీసం కోటిన్నర టన్నుల ఇసుక అవసరమని అంచనా వేశారు. ప్రస్తుతానికి 44.50 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. 15 రోజులకు కూడా సరిపోదని ఓ సీనియర్ అధికారి చెబుతున్నారు. కొన్ని జిల్లాల్లో సెప్టెంబరులో వర్షాలు కురుస్తాయి. కాబట్టి ఆయా ప్రాంతాల్లోని రీచ్‌ల్లో మాన్యువల్ మైనింగ్ ద్వారా ఇసుకను డిపోలకు తరలించాలన్న ప్రతిపాదనలు గనుల శాఖ పరిశీలనలో ఉన్నాయి.

ఒప్పందం నుంచి విరమణ

ఇసుక తవ్వకం, అమ్మకం కాంట్రాక్టు నుంచి ప్రతిమ ఇన్‌ఫ్రా, జీసీకేసీ సంస్థలు స్వచ్ఛందంగా వైదొలగనున్నాయి. 'ఆంధ్రజ్యోతి' ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చింది. తొలుత ప్రభుత్వం కంపెనీలతో చర్చలు జరపడానికి ముందు ఒప్పందాన్నే టర్మినేట్ చేయాలనుకుంది. అయితే, తామే వైదొలగాలని, దీనివల్ల సుప్రీం కోర్టులో దాఖలైన అక్రమ మైనింగ్ కేసుల నుంచి ఉపశమనం కలగొచ్చని కంపెనీలు భావించాయి. గనుల శాఖ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసి ఆ కంపెనీల ప్రతినిధులు లిఖితపూర్వకంగా తెలిపాయి. తమ నియంత్రణలో ఉన్న ఇసుక రీచ్‌లు, డంప్‌లు ఇప్పటికే గనుల శాఖకు అప్పగించాయి. దీంతో లావాదేవీలను ఒప్పందం నుంచి వైదొలగిన తర్వాతే సెటిల్ చేసుకోవాలని భావిస్తున్నట్టు తెలిసింది.

120 స్టాక్ పాయింట్ల ద్వారా ఉచిత ఇసుక

- రవాణా, లోడింగ్ చార్జీలు చెల్లిస్తే చాలు
- ఫైళ్ల దహనం కేసులో ఎవర్నీ వదలం: కొల్లు

మచిలీపట్నం, జూలై 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా 120 స్టాక్ పాయింట్ల ద్వారా ఉచిత ఇసుక విధానాన్ని సోమవారం నుంచి అమల్లోకి తెస్తున్నట్టు రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ఆదివారం మచిలీపట్నం నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. ఉచిత ఇసుక విధానాన్ని పటిష్ఠంగా అమలు చేస్తామన్నారు. ఒకటి, రెండు రోజుల్లో పూర్తిస్థాయిలో ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెస్తామన్నారు. ఇసుక కావాల్సినవారు ఏ వాహనంలో తీసుకెళ్తారో ముందే నమోదు చేయించుకుని రవాణా, లోడింగ్ చార్జీలు చెల్లించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రస్తుతం 43 లక్షల టన్నుల ఇసుక అందుబాటులో ఉందన్నారు. నదుల్లో ఉన్న ఇసుకను స్టాక్ పాయింట్లకు తరలించి సెప్టెంబరు నాటికి కోటి టన్నులు అందుబాటులో ఉంచుతామన్నారు. గత ప్రభుత్వం టన్ను ఇసుకను రూ.475కు విక్రయించిందని, తమ ప్రభుత్వం ఉచితంగా ఇస్తుందని తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలికి సంబంధించిన ఫైళ్ల దహనం కేసులో పోలీసులు విచారణను వేగవంతం చేశారని తెలిపారు. కొందరు అధికారుల పాత్ర కూడా ఇందులో ఉందని, వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారని, ఎవరినీ వదిలేది లేదని మంత్రి పేర్కొన్నారు.

ఈ మైత్రి పదేళ్లు కొనసాగాలి

- కేడర్ మధ్య భేదాభిప్రాయాలొస్తే వెంటనే సరిదిద్దుకోవాలి
- ఆత్మీయ సమావేశంలో పవన్ కల్యాణ్, పల్లా శ్రీనివాసరావు



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు

అమరావతి, జూలై 7 (ఆంధ్రజ్యోతి): భారీ విజయాన్ని కట్టబెట్టిన రాష్ట్ర ప్రజల తీర్పునకు అనుగుణంగా కనీసం దశాబ్దం పాటు తమ మైత్రి కొనసాగేలా చర్యలు తీసుకోవాలని జనసేన అధినేత పవన్ కల్యాణ్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆకాంక్షించారు. శనివారం రాత్రి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో ఆయన నివాసంలో పల్లా శ్రీనివాసరావు భేటీ అయ్యారు. గంటన్నరసేపు సాగిన ఆత్మీయ సమావేశంలో జనసేన, తెలుగుదేశం పార్టీ శ్రేణుల మధ్య సమన్వయం ద్వారా రాష్ట్రానికి ప్రయోజనం కలిగేలా వ్యవహరించాలని ఇరు పార్టీల నేతలు నిర్ణయించారు. ఎక్కడైనా భేదాభిప్రాయాలు తలెత్తితే వెంటనే సరిదిద్దే విధంగా చర్యలు తీసుకోవాలని భావించారు. కూటమి శ్రేణుల్లో ఎక్కడా పొరపొచ్చాలు లేకుండా నేతలు వ్యవహరించాలన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునేలా క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై ఇరువురు నేతలు చర్చించారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ లక్ష్యం వల్లనే మోదీ ఆశీస్సులతో ఏర్పాటైన కూటమికి ప్రజలు బ్రహ్మరథం పట్టారని పల్లా శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. జనసైనికులు క్షేత్రస్థాయిలో చూపించిన ఉత్సాహం, టీడీపీ శ్రేణుల కృషి, బీజేపీ అభిమానుల ఆదరణ సమష్టిగా రాష్ట్ర ఓటర్ల తీర్పులో ప్రతిబింబించిందని పవన్ వ్యాఖ్యానించారు.

ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడొద్దు: జనసేన

గత ప్రభుత్వంలో వ్యవస్థలన్నీ అస్తవ్యస్తమైన స్థితిలో రాష్ట్ర పరిపాలనా పగ్గాలు చేపట్టిన కూటమి ప్రభుత్వానికి జనసేన శ్రేణులన్నీ వెన్నుదన్నుగా నిలబడాలని ఆ పార్టీ అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కోరినట్లు పార్టీ అధికార ప్రతినిధి అజయ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్టీకి చెందిన ఏ ఒక్కరూ ప్రభుత్వానికి, అధికారులకు వ్యతిరేకంగా మాట్లాడవద్దని జనసేనాని పవన్ దిశానిర్దేశం చేశారని చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న తరుణంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీలోని ఎవరు మాట్లాడినా, అధికారులపై నిరాధార ఆరోపణలు చేసినా కఠిన చర్యలు తీసుకోవలసిందిగా పార్టీ అధ్యక్షుడు ఆదేశించారని అన్నారు. పార్టీ నాయకులుగానీ, కార్యకర్తలుగానీ ప్రొటోకాల్ ఉల్లంఘించి అధికారిక సమావేశాల్లో పాల్గొనడం నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుందన్నారు. అలాంటి వారిపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వ్యర్థాల నిర్వహణకు 'స్వచ్ఛంద' సహకారం

- పిఠాపురం, భీమవరం నియోజకవర్గాల్లో కార్యాచరణ అమలు
- అధికారులకు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాలు



వ్యర్థాల నిర్వహణపై అధికారులకు సూచనలు చేస్తున్న డిప్యూటీ సీఎం పవన్

అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): రోజురోజుకు పెరిగిపోతున్న ఘన, ద్రవ వ్యర్థాలతో గ్రామాల్లో సైతం పర్యావరణ సమస్యలు, ఆరోగ్యపరమైన ఇబ్బందులు తీవ్రమవుతాయని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. శాస్త్రీయ విధానంతో వ్యర్థాల నిర్వహణ చేపట్టేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఎస్ఎల్ఆర్ఎం ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీనివాసన్ ఆదివారం మంగళగిరిలో ఉపముఖ్యమంత్రిని కలిసి గ్రామాల్లో వ్యర్థాల నిర్వహణ, ప్రజలకు అవగాహన కార్యక్రమాల నిర్వహణపై నివేదికను అందజేశారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు స్థానికసంస్థలతో కలిసి పనిచేసే విధంగా ఒక కార్యాచరణ రూపొందించాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖల అధికారులకు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యాచరణను ప్రత్యేక ప్రణాళిక ద్వారా పిఠాపురం, భీమవరం నియోజకవర్గాల్లో అమల్లోకి తీసుకురావాలన్నారు. పర్యావరణంపై మక్కువ ఉన్న వారిని ఏకో వారియర్స్‌గా ఎంపిక చేసుకుని ఈ కార్యక్రమంలో భాగస్వాములు చేయాలని సూచించారు. వ్యర్థాల నిర్వహణ, డంపింగ్ యార్డుల విషయంలో పంచాయతీరాజ్, పురపాలక శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. నదీ పరీవాహక ప్రాంతాలు, కాలువలు, చెరువుల వెంబడి చెత్త వేసే విధానాలను ఆపేయాలన్నారు.

బిహార్‌లో మరో బ్రిడ్జి కూలిందన్న తేజస్వి యాదవ్

మోతీహారి, జూలై 7 : బిహార్‌లో ప్రతిపక్ష నేత, ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ ఆ రాష్ట్రంలో మరో బ్రిడ్జి కూలిందని ఆదివారం చెప్పారు. దీనికి సంబంధించిన ఒక వీడియోను ఆయన 'ఎక్స్'లో షేర్ చేశారు. తూర్పు చంపారన్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకున్నట్లు సమాచారం. ఆ జిల్లా కలెక్టర్ సౌరభ్ జోర్వాల్ ఈ విషయమై మాట్లాడుతూ... అది బ్రిడ్జి కాదని కనీసం కాజ్‌వే కూడా కాదన్నారు. అది ఓ గ్రామంలో డ్రెయిన్ దాటడానికి స్థానిక పంచాయతీ మట్టితో కట్టిన కొన్ని అడుగుల తాత్కాలిక నిర్మాణం మాత్రమేనన్నారు. భారీ వర్షాలకు అది కొట్టుకుపోయిందన్నారు. కాగా కేవలం రెండు వారాల్లో బిహార్‌లో 12కు పైగా బ్రిడ్జిలు కూలిపోయిన నేపథ్యంలో 15 మంది ఇంజనీర్లను సస్పెండ్ చేశారు. ఈ నేపథ్యంలో ఈ ఘటన వెలుగులోకి రావడం గమనార్హం. వరుసగా బ్రిడ్జిలు కూలిపోవడం బిహార్‌లో రాజకీయ పార్టీల మధ్య పరస్పర ఆరోపణలకు దారితీసింది. ఆర్జేడీ నేత తేజస్వి యాదవ్ నీతీశ్ కుమార్ ప్రభుత్వంపై విమర్శలు ఎక్కుపెడుతుండగా... ఎన్డీయే రాష్ట్ర ప్రభుత్వం ఆర్జేడీ పైనే నెపం పెడుతోంది. జనవరిలో అధికారం కోల్పోయే వరకు ఆర్జేడీ వద్దనే గ్రామీణ పనుల శాఖ ఉందని పేర్కొంటోంది.

రూ.6వేల కోట్లకు టిడ్కో ఇళ్ల తాకట్టు

- ఏ పదవికీ జగన్ అర్హుడు కాదు: మంత్రి నిమ్మల



టిడ్కో గృహ సముదాయంలో పార్టీ శ్రేణులతో కలిసి పిచ్చిమొక్కలు తొలగిస్తున్న మంత్రి నిమ్మల

పాలకొల్లు రూరల్/ అర్బన్, జూలై 7: గత ప్రభుత్వ హయాంలో జగన్ టిడ్కో గృహాలను ఆరువేల కోట్ల రూపాయలకు తాకట్టు పెట్టి ఆ నిధులను దారి మళ్లించారని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. లబ్ధిదారులను వైసీపీ రుణగ్రస్తులుగా మార్చిందన్నారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని టిడ్కో గృహాల సముదాయం ఆవరణలో అడవి మాదిరిగా పెరిగిన పొదలు, మట్టి గుట్టలను టీడీపీ నాయకులతో కలిసి తొలగించే పనులను మంత్రి చేపట్టారు. ఒకరోజు శ్రమదానం సరిపోదని, వారంపాటు చేయాల్సి ఉంటుందని అన్నారు. తమ ప్రభుత్వం టిడ్కో ఇళ్లను 90శాతం పూర్తి చేస్తే, మిగిలిన 10శాతం పనులు కూడా గత వైసీపీ ప్రభుత్వం చేయలేదని మండిపడ్డారు. ఐదేళ్లు వ్యవస్థలను నాశనం చేసేసిన జగన్.. ప్రజాస్వామ్యంలో ఏపదవికీ అర్హుడు కాదని ఘాటుగా విమర్శించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో జగన్‌ను అరెస్టు చేయాలి

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న డిమాండ్



విజయవాడ (వన్‌టౌన్), జూలై 7: టీడీఆర్ కుంభకోణంలో మాజీ సీఎం జగనే సూత్రధారి అని, ఆయన్ను నిందితుడిగా పరిగణించి అరెస్టు చేయాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడారు. మాజీమంత్రి కారుమూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ భారీ దోపిడీ జరిగిందని, తిరుపతిలో భూమన కరుణాకరరెడ్డి సారథ్యంలో మరో భారీ దోపిడీ జరిగిందని ఆరోపించారు. రాష్ట్ర వ్యాప్తంగా మురికివాడల్లో రోడ్ల పేరిట భారీ మొత్తంలో దోచేశారన్నారు.

ఇద్దరు సీఎంల భేటీ శుభపరిణామం

- సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



అనంతపురం, జూలై 7(ఆంధ్రజ్యోతి): రెండు తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న విభజన సమస్యల పరిష్కారానికి ఏపీ సీఎం చంద్రబాబునాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ కావడం శుభపరిణామమని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. అనంతపురంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో నారాయణ ఆదివారం మీడియాతో మాట్లాడారు. ఒకే వేదికపై ఇద్దరు ముఖ్యమంత్రులు రెండు రాష్ట్రాలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు పరిష్కారమార్గాలను అన్వేషించాలన్నారు. ఆస్తులు, అప్పులు, ఆర్థిక పురోగతి, స్వావలంబనతోనే తెలుగు రాష్ట్రాల ప్రగతికి నాంది అవుతుందని చెప్పారు. ఇక కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను తీసుకొస్తూ... చట్టాలు, పౌరుల హక్కులను కాలరాస్తోందని దుయ్యబట్టారు. కార్పొరేట్ సంస్థల కొమ్ముకాస్తూ కార్మికుల కనీస హక్కులను సైతం కాలరాస్తున్నారన్నారు. ఇదే క్రమంలో ఐఏఎస్, ఐపీఎస్‌లకు చురకలంటించారు. రాజకీయ నేతల కబంధహస్తాల్లో చిక్కుకుని ప్రజల్లో విశ్వసనీయత కోల్పోవద్దని హితవు పలికారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు జైల్లో ఉండే పరిస్థితిని ఎదుర్కొంటుండటం దారుణమన్నారు. కాగా, రాష్ట్ర విభజన నేపథ్యంలో ఇచ్చిన హామీల్లో భాగంగా... వెనుకబడిన ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలకు బుందేల్‌ఖండ్ తరహా ప్యాకేజీ అమలు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ.. కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దివ్యాంగ విద్యార్థులకు లోకేశ్ భరోసా

25 మందికి జాతీయ విద్యా సంస్థల్లో సీట్లు

- ఇంటర్‌లో సబ్జెక్టు 'మినహాయింపు'తో ఇబ్బంది
- సీట్లు కోల్పోయే పరిస్థితి నుంచి గట్టెక్కించిన మంత్రి

అమరావతి, జూలై 7(ఆంధ్రజ్యోతి): దివ్యాంగ విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. జాతీయ విద్యా సంస్థల్లో సీట్లు కోల్పోయే స్థితి నుంచి గట్టెక్కించింది. మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ చొరవతో ఇంటర్ విద్యాశాఖ ఆగమేఘాలపై వారికి కొత్త మార్కుల మెమోలు జారీచేసి, వారి సీట్లు వారికి దక్కేలా చూసింది. ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో సీట్లు పోయినట్లేనని భావించిన విద్యార్థులకు సీట్లు దక్కాయి. వివరాలివీ.. జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షల్లో దివ్యాంగ కోటాలో 170 ర్యాంకు సాధించిన విజయవాడ విద్యార్థి పృథ్వీ సత్యదేవ్ చెన్నై ఐఐటీలో సీటు వస్తుందని భావించాడు. జాయింట్ సీట్ అలకేషన్ అథారిటీ(జోసా) పెట్టిన కొత్త నిబంధనతో సీటు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. దివ్యాంగ విద్యార్థులకు ఇంటర్మీడియట్‌లో భాషా సబ్జెక్టుల్లో ఒక దాంట్లో మినహాయింపు ఉంటుంది. అంటే తెలుగు లేదా ఇంగ్లీష్‌లో ఒక సబ్జెక్టు రాయాల్సిన అవసరం లేదు. సెకండియర్‌లో మిగిలిన ఐదు సబ్జెక్టులకు ఆ విద్యార్థులకు మార్కుల మెమోలు ఇస్తారు. అయితే ఈ ఏడాది జోసా పెట్టిన కొత్త నిబంధన ప్రకారం ఇంటర్ సెకండియర్‌లో కనీసం ఐదు సబ్జెక్టులు ఉండాలి. మన విద్యార్థులకు కూడా ఐదు సబ్జెక్టులు ఉన్నప్పటీ గణితం సబ్జెక్టును ఎ, బి అంటూ రెండు వేర్వేరు పేపర్లుగా చూపిస్తారు. జోసా దానిని ఒక సబ్జెక్టుగానే పరిగణించడంతో దివ్యాంగ విద్యార్థులు నాలుగు సబ్జెక్టుల్లోనే మార్కులు సాధించినట్లైంది. ఇలా మొత్తం 25 మంది విద్యార్థులు సీట్లు కోల్పోయే పరిస్థితి వచ్చింది. ఈ సమస్యను విద్యార్థులు తొలుత ఇంటర్ విద్యాశాఖ దృష్టికి తీసుకొచ్చారు. ఆ వెంటనే మంత్రి లోకేశ్‌కు వాట్సాప్ ద్వారా వివరించారు. దానిపై తక్షణం స్పందించిన మంత్రి ఏం చేస్తే సీట్లు కోల్పోకుండా ఉంటారని అధికారులతో చర్చించారు. మినహాయింపు పొందిన సబ్జెక్టుకు కనీస మార్కులు(పాస్ మార్కులు) వేద్దామని నిర్ణయించారు. అందుకనుగుణంగా చర్యలు తీసుకున్నారు. అయితే జోసా దీనిని కూడా అంగీకరించలేదు. దీనిపై ప్రభుత్వ జీవో ఉండాలని స్పష్టంచేసింది. మళ్లీ దీనిపై మంత్రి ఆదేశాలు జారీచేశారు. 1992లో ఇచ్చిన ఓ జీవో ఆధారంగా జీవో 255 తాజాగా విడుదల చేశారు. దాని ప్రకారం దివ్యాంగ విద్యార్థులకు నాలుగు సబ్జెక్టుల్లో వచ్చిన మార్కుల ఆధారంగా సగటు మార్కులను మినహాయింపు పొందిన సబ్జెక్టుకు వేశారు. ఆ మేరకు కొత్త మార్కుల మెమోలు జారీచేశారు. సెలవు దినాల్లోనూ అధికారులు దానిపైనే కూర్చుని మెమోలు తయారుచేయించి మరీ వాటిని ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. దీంతో కోల్పోయామని భావించిన సీట్లు ఆ విద్యార్థులకు దక్కాయి. ప్రభుత్వ చొరవతో సీట్లు పొందిన విద్యార్థులు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దివ్యాంగులైనప్పటికీ జాతీయ విద్యా సంస్థల్లో సీట్లు సాధించిన వారిని మంత్రి నేడు అభినందించనున్నారు. కాగా, వచ్చే ఏడాది నుంచి ఈ సమస్యను ఎలా అధిగమించాలనేదానిపై ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది.

కొండంత ఆత్మవిశ్వాసం



లోకేశ్ అన్న చేసిన సాయం మాలాంటి వారిలో కొండంత ఆత్మవిశ్వాసం నింపింది. ఆయన చొరవ వల్లే నా లక్ష్యాన్ని సాధించేందుకు మార్గం దొరికింది. ఐఐటీ గౌహతిలో కంప్యూటర్ సైన్స్‌లో చేరుతున్నా. ఇంజనీరింగ్ అనంతరం సివిల్స్ రాయాలనేది లక్ష్యం. నాకు చేసిన సాయానికి ఎలా థాంక్స్ చెప్పాలో అర్థం కావట్లేదు.

- తేజిత చౌదరి, తిరుపతి

భవిష్యత్తు ముగిసిపోయిందనుకున్నా



కౌన్సెలింగ్ అధికారులు కొర్రీ వేశాక ఇక మా భవిష్యత్తు ముగిసిపోయిందని భావించాం. నేనున్నాను అధైర్యపడొద్దని మంత్రి లోకేశ్ భరోసా ఇచ్చారు. నిరంతరం అధికారులతో మాట్లాడి జీవో విడుదల చేయించి మా భవిష్యత్తును కాపాడారు. ఎన్ఐటీ కాలికట్‌లో సీటు వచ్చింది. మంత్రి సాయం జీవితాంతం గుర్తుపెట్టుకుంటాం. -రఘునాథరెడ్డి, కడప.

లోకేశ్‌కు రుణపడి ఉంటా..

మంత్రి లోకేశ్‌కు జీవితాంతం రుణపడి ఉంటాను. మొదట్లో సీటుపై ఆశలు వదిలేసుకున్నాను. మంత్రి చొరవతో ఇప్పుడు ఐఐటీ ఖరగ్‌పూర్‌లో సీటు వచ్చింది. సివిల్ సర్వెంట్ కావాలన్నది నా లక్ష్యం. మా భవిష్యత్తుకు భరోసా కల్పించినందుకు ధన్యవాదాలు.

- రాణి, కాకినాడ.

నేడు వైఎస్ జయంతి

- మంగళగిరిలో ప్రత్యేక కార్యక్రమం
- హాజరుకానున్న తెలంగాణ సీఎం
- ఇడుపులపాయలో ఏకకాలంలో జగన్, షర్మిల నివాళి

అమరావతి, న్యూఢిల్లీ, జూలై 7 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ప్రైవేటు కన్వెన్షన్ సెంటర్‌లో సాయంత్రం ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్యం ఠాగూర్ ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరిస్తారు. షర్మిల ఆహ్వానం మేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు. హైదరాబాద్ నుంచి ప్రత్యేక విమానంలో సోమవారం సాయంత్రం నాలుగు గంటలకు రేవంత్‌రెడ్డి విజయవాడ విమానాశ్రయానికి చేరుకుని.. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో వైఎస్ కార్యక్రమ ప్రాంగణానికి వస్తారు. రేవంత్‌తోపాటు ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా హాజరుకానున్నారు. కాగా, సోమవారం ఉదయమే వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహనరెడ్డి, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి ఏకకాలంలో వైఎస్ ఘాట్ వద్ద వైఎస్‌కు నివాళులు అర్పించనున్నారు. ఇటీవల జగన్‌కు, షర్మిలకు మధ్య మనస్పర్థలు తలెత్తాక ఇద్దరూ ఒకే సమయంలో ఇడుపులపాయలో వైఎస్ జయంతి, వర్ధంతి కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. కానీ.. ఈసారి జగన్, షర్మిల ఒకే సమయంలో వైఎస్‌కు నివాళులు అర్పించనున్నారని కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి. ఇడుపులపాయలో వైఎస్‌కు నివాళులు అర్పించాక.. షర్మిల విజయవాడకు పయనమవుతారు. అక్కడ నుంచి మంగళగిరి చేరుకుని వైఎస్ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు.

వైఎస్ నిస్వార్థ ప్రజాసేవ చేశారు: సోనియా

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జ్ఞాపకాలను తమ పార్టీ ఎల్లప్పుడూ స్మరించుకుంటుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అన్నారు. మాజీ సీఎం వైఎస్ 75వ జయంతి సందర్భంగా ఆదివారం ఆమె ఒక లేఖ విడుదల చేశారు. 'వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఒక మహోన్నత నాయకుడు. అద్భుతమైన ప్రతిభ, చైతన్యం, అంకితభావంతో దేశానికి, ఆంధ్రప్రదేశ్ ప్రజలకు, కాంగ్రెస్‌కు నిస్వార్థంగా సేవ చేసిన నిజమైన దేశభక్తుడు' అని ఆ లేఖలో కొనియాడారు. వైఎస్ ప్రజాసేవ వారసత్వాన్ని ఆయన కుమార్తె వైఎస్ షర్మిల సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నారని అందుకు కృతజ్ఞతలని సోనియా అన్నారు.

తల్లిదండ్రులూ.. జాగ్రత్త!

- సోషల్ మీడియాలో పిల్లల ఫొటోల పోస్టింగ్‌లో అప్రమత్తత అవసరం
- సోషల్ మీడియా ముసుగులో చాలా క్రూర మృగాలు ఉన్నాయి: హీరో సాయి దుర్గా తేజ్
- ఓ యూట్యూబర్ అసభ్య వ్యాఖ్యలపై తెలంగాణ, ఏపీ సీఎంలకు ఫిర్యాదు



హైదరాబాద్, జూలై 7 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో చిన్న పిల్లలపై అసభ్యకరమైన రీతిలో ట్రోల్స్ జరుగుతున్న నేపథ్యంలో హీరో సాయి దుర్గాతేజ్ స్పందించారు. "పేరెంట్స్ అందరికీ నా విన్నపం ఇదే. పేరెంట్స్ అందరూ తమ పిల్లల ఫొటోలు సోషల్ మీడియా హ్యాండిల్స్‌లో పోస్ట్ చేసేటప్పుడు జాగ్రత్త వహించండి. బయట సోషల్ మీడియా ముసుగులో చాలా క్రూరమైన మృగాలు ఉన్నాయి. వారు మీ పిల్లల ఫొటోలపై ఇష్టమొచ్చినట్లు కామెంట్స్ చేస్తారు.. మార్ఫింగ్ చేస్తారు. పేరెంట్స్ ఆ వ్యక్తులు చేసే కామెంట్స్ వల్ల ఎంత ఇబ్బందిని అనుభవిస్తారో, ఎంత మానసిక ఒత్తిడికి లోనవుతారో వారికి అర్థం కాదు' అని పేర్కొన్నారు. 'ఎక్స్' వేదికగా చేసిన ఈ పోస్టుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌ను ట్యాగ్ చేశారు. ఈ పోస్ట్ పెట్టిన వెంటనే సాయి దుర్గాతేజ్ మరో ట్వీట్‌లో ఓ వీడియోను షేర్ చేసి సంబంధిత వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ఆయన తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలను, పోలీసులను కోరారు. ఇందులో ప్రణీత్ హనుమంతు అనే ఓ యూట్యూబర్.. కొంతమంది యూట్యూబర్లతో కలిసి ఓ తండ్రి, తన చిన్నారి కూతురు వీడియోను ఉద్దేశించి అసభ్యకరంగా మాట్లాడారు.

పులివెందులలో జగన్ ప్రజాదర్బార్

- రెండో రోజూ కొనసాగిన పర్యటన



పులివెందులలోని తన నివాసం వద్ద ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వైఎస్ జగన్

పులివెందుల, జూలై 7: మూడురోజుల పర్యటనలో భాగంగా కడప జిల్లా పులివెందులకు వచ్చిన మాజీ ముఖ్యమంత్రి, పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్‌రెడ్డి రెండోరోజు ఆదివారం పులివెందుల పార్టీ కార్యాలయంలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్‌ను కలిసేందుకు నియోజకవర్గం నుంచి పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. పలువురు వారి సమస్యలను విన్నవించారు. కొందరు అనారోగ్య సమస్యలపై వివరించి ఆర్థికసాయాన్ని అభ్యర్థించారు. అలాగే యువతకు ఉద్యోగావకాశాలు కల్పించాలని అడిగారు. లింగాల మండలంలోని పెద్దకుడాల గ్రామంలోని మాజీ ఎంపీపీ సుబ్బారెడ్డి సతీమణి లక్ష్మీనరసమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పులివెందుల పట్టణంలో ఓ చిన్నారి పాముకాటుకు గురై మృతి చెందడంతో వారి ఇంటికి వెళ్లి నివాళులర్పించారు. మళ్లీ పార్టీ కార్యాలయానికి చేరుకుని ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రకాశం జిల్లా ఒంగోలులో ఆదివారం సాయంత్రం ఇలా మేఘాలు దట్టంగా కమ్ముకుని టోర్నడోను తలపించాయి

అరేబియాలో చురుగ్గా నైరుతి

» నేడు కోస్తా, రాయలసీమకు వర్షాలు

విశాఖపట్నం, జూలై 7(ఆంధ్రజ్యోతి): దక్షిణ కోస్తాకు ఆనుకుని పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. ఇంకా కేరళ నుంచి గుజరాత్ వరకు తీరం వెంబడి ద్రోణి విస్తరించింది. ఈ రెండింటి ప్రభావంతో అరేబియా సముద్రంలో నైరుతి రుతుపవనాలు చురుగ్గా మారడంతో దక్షిణ, పశ్చిమ భారతంలో పలు రాష్ట్రాల్లో విస్తారంగా, పలుచోట్ల భారీవర్షాలు కురిశాయి. ఇంకా రుతుపవన ద్రోణి ఉత్తరాదిలోనే కొనసాగుతోంది. ఉత్తరప్రదేశ్ నుంచి గుజరాత్‌కు ఆనుకుని అరేబియా సముద్రం వరకు మరో ద్రోణి విస్తరించింది. వీటి ప్రభావంతో ఉత్తర, మధ్య భారతంలో అనేక ప్రాంతాల్లో వర్షాలు కురిశాయి. కొన్నిచోట్ల భారీ వర్షాలు, ప్రధానంగా ఉత్తరాఖండ్‌లో కుంభవృష్టి వర్షాలు కురుస్తున్నాయి. మొన్నటి వరకు ఈశాన్య భారతాన్ని వణికించిన వరదలు ఇప్పుడు ఉత్తరాఖండ్‌ను అల్లకల్లోలం చేస్తున్నాయి. వర్ష బీభత్సానికి చార్‌ధాం యాత్రను తాత్కాలికంగా నిలిపివేశారు. ద్రోణి ప్రభావంతో ఉత్తరాఖండ్‌లో ఆదివారం అతి భారీ వర్షాలు కురిశాయి. ఇంకా ఈ నెల 11వరకు ఉత్తరప్రదేశ్, పంజాబ్, హరియాణా, తూర్పు రాజస్థాన్‌లో పలుచోట్ల భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. ఈ నెల 10 వరకు దక్షిణాది పలు రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని వివరించింది. కాగా, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో ఆదివారం కోస్తా, రాయలసీమలో పలుచోట్ల ఉరుములు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిశాయి. రానున్న 24గంటల్లో కోస్తా, రాయలసీమలో ఉరుములు, పిడుగులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. అరేబియా సముద్రంలో రుతుపవనాలు చురుగ్గా ఉండటంతో రాష్ట్రంలో రానున్న మూడు నాలుగు రోజుల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది.

కృష్ణమ్మ ఒడిలోకి గోదారమ్మ!

» ఫెర్రీ వద్ద కృష్ణానదిలో కలిసిన గోదావరి నీరు

» నేడు పవిత్ర సంగమం వద్ద మంత్రి నిమ్మల పూజలు

విజయవాడ, జూలై 7(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ నుంచి పరవళ్లు తొక్కుతూ వచ్చిన గోదారమ్మ కృష్ణమ్మ ఒడికి చేరింది. ఇబ్రహీంపట్నం మండలం ఫెర్రీ వద్ద పవిత్ర సంగమంలో ఆదివారం సాయంత్రం కృష్ణానదిలో కలిసింది. పట్టిసీమ నుంచి ప్రస్తుతం 6018 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. అందులో నుంచి వెలగలేరు ద్వారా 3 వేల క్యూసెక్కుల నీరు కృష్ణానదికి చేరింది. పట్టిసీమ వద్ద ఈనెల మూడో తేదీన పంపులను ఆన్ చేశారు. తొలుత 21 పంపులను ఆన్ చేసిన అధికారులు తర్వాత వాటిని 17కు తగ్గించారు. సరిగ్గా ఐదు రోజులకు గోదావరి నీరు కృష్ణమ్మను తాకింది. పట్టిసీమ నుంచి నీరు రావడంతో ఇప్పటి వరకు తెలుపు రంగులో ఉన్న సంగమ ప్రాంతం ఎరుపెక్కుతోంది. గోదావరి నీళ్లు రావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, పవిత్ర సంగమం వద్ద జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ సోమవారం పూజలు నిర్వహిస్తారు.

ఎమ్మెల్యే పదవికి జగన్ రాజీనామా?



(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ వైఎస్ అవినాశ్ రెడ్డితో కూడా రాజీనామా చేయిస్తారని ప్రచారం జరుగుతోంది. ఆ వెంటనే కడప ఎంపీ స్థానానికి జరిగే ఉప ఎన్నికలో జగన్ పోటీ చేస్తారని, పులివెందుల స్థానానికి జరిగే ఉప ఎన్నికలో తన మాతృమూర్తి విజయలక్ష్మి లేదా సతీమణి వైఎస్ భారతిలను రంగంలోకి దింపుతారని కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం ఊపందుకుంది. అదేసమయంలో భారతికి వైసీపీ రాష్ట్ర పగ్గాలు అప్పగించి, తాను ఢిల్లీకే పరిమితమయ్యేలా జగన్ ప్లాన్ చేస్తున్నట్టు ఈ ప్రచారం చాటి చెబుతోంది. ఎంపీగా ఉంటే.. తనపై నమోదైన అక్రమాస్తుల కేసులను మేనేజ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని కూడా ఆయన తలపోస్తున్నట్టు సోషల్ మీడియా భావిస్తోంది. అదేసమయంలో ఢిల్లీ రాజకీయాల్లోనూ కీలకం కావొచ్చన్నది ఆయన ఆలోచనగా ఉన్నట్టు చెబుతున్నారు. సోమవారం జరగనున్న దివంగత ముఖ్యమంత్రి, తన తండ్రి.. వైఎస్ రాజశేఖరరెడ్డి 75వ జయంతిని పురస్కరించుకుని కడపలోని ఇడుపులపాయలో ఉన్న వైఎస్ సమాధి వద్ద జగన్ నివాళులర్పించనున్నారు. ఈ సందర్భంగా ఆయన తన రాజీనామా ప్రకటన చేసే అవకాశం ఉందని సోషల్ మీడియాలో ప్రచారం జోరుగుతుండడం గమనార్హం.


అధికారం నేలమట్టం కావడంతో

2019లో జరిగిన ఎన్నికల్లో 151 స్థానాల్లో విజయం దక్కించుకున్న వైసీపీ తాజాగా జరిగిన ఎన్నికల్లో నేలమట్టమైంది. దీంతో గత ఐదేళ్లు మితిమీరిన స్థాయిలో అధికారం చలాయించిన జగన్‌కు ఇప్పుడు ఎటూ పాలుపోని పరిస్థితి ఏర్పడింది. పైగా అసెంబ్లీలో 11 స్థానాలే ఉండడంతో ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా దక్కే పరిస్థితి కనిపించడం లేదు. తమకు సంఖ్యా బలం లేకున్నా ప్రధాన ప్రతిపక్ష హోదా కట్టబెట్టాలంటూ స్పీకర్ అయ్యన్నపాత్రుడికి జగన్ లేఖ రాశారు. అయినప్పటికీ.. నిబంధనల మేరకు ఆయన కోరికను మన్నించే పరిస్థితి, ప్రధాన ప్రతిపక్ష హోదా ఇచ్చే పరిస్థితి లేకుండా పోయాయి. దీంతో జగన్ కేవలం సాధారణ ఎమ్మెల్యేగానే మిగిలిపోనున్నారు. జగన్ స్వభావాన్ని బట్టి చూస్తే ఈ పరిస్థితిని జీర్ణించుకునే అవకాశం ఆయనకు లేదని ఆయన సన్నిహిత వర్గాలు చెబుతున్నాయి. దీంతో ఎమ్మెల్యేగా తప్పుకోవడమే మంచిదనే భావనలో ఆయన ఉన్నట్టు వైసీపీ వర్గాలు కూడా భావిస్తున్నట్టు తెలుస్తోంది. పైగా వచ్చే ఎన్నికల వరకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వాన్ని, ముఖ్యంగా సీఎం చంద్రబాబును ఎదిరించి నిలబడే పరిస్థితి కూడా ఆయనకు లేదని అంటున్నాయి. అటు సభలోను, ఇటు బయట కూడా జగన్ పరిస్థితి దారుణంగానే ఉంటుందని ఆయా వర్గాలు అంచనా వేస్తున్నాయి. ఈ క్రమంలోనే తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయడం ఉత్తమమని జగన్ భావిస్తున్నట్టు వైసీపీ వర్గాల్లోనూ జోరుగా చర్చ సాగుతోందని సమాచారం. అయితే.. ఈ ప్రచారాన్ని సీనియర్లు కొందరు ఖండిస్తున్నారు. అలాంటిదేమీ ఉండదని అంటున్నా.. ప్రచారం మాత్రం జోరుగా జరుగుతోంది.

ఢిల్లీలో ఉంటే..

పులివెందుల ఎమ్మెల్యే స్థానానికి రాజీనామా చేసిన అనంతరం.. కడప ఎంపీగా జగన్ ఉప ఎన్నికలో పోటీ చేసేందుకు మానసికంగా సిద్ధమైనట్టు తెలుస్తోంది. ప్రస్తుతం సోషల్ మీడియాలో జోరుగా జరుగుతున్న ప్రచారాన్ని గమనిస్తే.. ఎంపీగా గెలిచిన తర్వాత ఢిల్లీలో ఉంటూ.. అక్కడ వైసీపీ రాజకీయాలను చక్కబెట్టుకునే దిశగా జగన్ ఆలోచన చేస్తున్నట్టు సమాచారం. ముఖ్యంగా తనపై ఉన్న అక్రమాస్తుల కేసులను ఢిల్లీ స్థాయిలో మేనేజ్ చేసుకునేందుకు అవకాశం ఉంటుందని ఆయన భావిస్తున్నట్టు పార్టీ వర్గాల్లోనూ చర్చ సాగుతోంది. ఇదేసమయంలో రాష్ట్ర వైసీపీ బాధ్యతలను తన సతీమణి వైఎస్ భారతికి అప్పగించే యోచనలో జగన్ ఉన్నారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. అయితే.. ఈ ప్రచారాన్ని వైసీపీ సీనియర్లు నిర్ధారించడం లేదు. కానీ, జగన్ మనస్తత్వం తెలిసిన వారు.. ఏమైనా జరగొచ్చని అంటున్నారు. పరిస్థితి ఎలా ఉన్నా.. తన ఇగోకు ప్రాధాన్యం ఇచ్చే జగన్ ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఆశ్చర్యం లేదని చెబుతున్నారు. ఒకవేళ వైఎస్ జయంతి సందర్భంగా కాకపోయినా.. వచ్చే రెండు మూడు మాసాల్లో అయినా.. జగన్ తాను అనుకున్నదే చేస్తారని ఆయన సన్నిహితులు అంచనా వేస్తున్నారు. మరి ఏం జరుగుతుందో చూడాలి.

ఆ భూతాన్ని భూస్థాపితం చేస్తాం





బోనాలతో చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న పార్టీ అభిమానులు

(మొదటి పేజీ తరువాయి)

తర్వాత తొలిసారి హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌కు వచ్చిన చంద్రబాబుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అంతకుముందు జూబ్లీహిల్స్‌లోని చంద్రబాబు నివాసం నుంచి ఎన్టీఆర్ భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడుతూ.. తనకు పునర్జన్మ అంటూ ఉంటే తెలుగు గడ్డపైనే పుట్టాలని భగవంతుడిని కోరుకుంటానన్నారు. ఏపీ సమస్యల సుడిగుండంలో ఉందని, ఇబ్బందులను అధిగమించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాల్సిన అవసరం ఉందని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. "మొన్నటి ఎన్నికల వేళ ఇక్కడి నుంచి పార్టీ అభిమానులు పెద్దఎత్తున తరలి వచ్చి పని చేశారు. విదేశాల నుంచి ఎన్ఆర్ఐలు వ్యయప్రయాసలకు ఓర్చి తరలివచ్చారు. యువగళం హిట్ అయింది. నన్ను అక్రమంగా జైల్లో ఉంచినప్పుడు పవన్‌కల్యాణ్ స్వయంగా వచ్చి అండగా నిలిచారు. ఇంతమంది కష్టపడితే కూటమి అధికారంలోకి వచ్చింది. ఈ సునామీలో ఓ సైకో కొట్టుకుపోయాడు. ఆయన సైకోనే కాదు.. భూతం అని కొంతమంది అంటున్నారు. పెట్టుబడిదారులను ఆహ్వానిస్తుంటే.. మీపై నమ్మకం ఉంది కానీ ఆ భూతం మళ్లీ వస్తే పరిస్థితి ఏంటని అడుగుతున్నారు. అలాంటివారికి నేను భరోసా ఇస్తున్నా. ఆ భూతాన్ని భూ స్థాపితం చేస్తాం" అని ప్రకటించారు. ప్రజాస్వామ్యంలో నియంతృత్వ పోకడలకు వెళ్తే ప్రమాదకరమని, అలాంటి వారిని ఎక్కడికి పంపించాలో ప్రజలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. అందుకే.. భూమ్మీదనే నడవాలని తన సహచర మంత్రులకూ హితబోధ చేసినట్లు తెలిపారు. 1995లో సీబీఎన్ ఎలా పని చేశాడో.. 2024లోనూ అదే విధంగా పని చేస్తాడని స్పష్టం చేశారు.

తెలుగు రాష్ట్రాల అభివృద్ధే లక్ష్యం

అన్నదమ్ములుగా విడిపోయినా రెండు తెలుగు రాష్ట్రాల అభివృద్ధే టీడీపీ లక్ష్యమని స్పష్టం చేశారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు పరస్పరం సహకరించుకుంటూ అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. "రెండు రాష్ట్రాల మధ్య ఉన్న విభజన సమస్యలపై చర్చించేందుకు నేను చొరవ తీసుకుని తెలంగాణ సీఎం రేవంత్‌కు లేఖ రాస్తే.. ఆయన తక్షణమే స్పందించారు. ఇందుకు ఆయన్ను అభినందిస్తున్నా. ఏపీ, తెలంగాణాలో వేర్వేరు ప్రభుత్వాలు ఉన్నాయి. సైద్ధాంతికంగా వైరుధ్యాలున్నా తెలుగు జాతి అభ్యున్నతే లక్ష్యంగా శనివారం రెండు రాష్ట్రాల మధ్య చర్చలు ప్రారంభమయ్యాయి. భవిష్యత్తులో అధికారులతో కమిటీలు ఏర్పాటు చేసి, సమస్యలను సామరస్యంగా పరిష్కరించుకోవాలని నిర్ణయించాం" అని వివరించారు. రెండు రాష్ట్రాల అభివృద్ధిని తాను కోరుకుంటానని చెప్పారు. 2047నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా ప్రధాని మోదీ పని చేస్తున్నారని, ఆ పరంపరలో తెలుగు జాతి నంబర్ వన్‌గా నిలవాలని ఆకాంక్షించారు. ఎన్టీఆర్, పీవీ నర్సింహారావు తెలుగు బిడ్డలు కావడం మనకు గర్వకారణమని పేర్కొన్నారు.

తెలంగాణలోనూ పసుపుజెండా

తెలంగాణలో టీడీపీని పునర్నిర్మిస్తామని చంద్రబాబు ప్రకటించారు. పార్టీకి యువరక్తాన్ని ఎక్కిస్తామని, విద్యావంతులకు అవకాశం ఇస్తామని, మూడు నాలుగు దశాబ్దాలు పార్టీ ఉత్సాహంగా పనిచేసేలా సమర్థ నాయకత్వాన్ని తీసుకొస్తామని వెల్లడించారు. "ఎన్నికల్లో పోటీచేయక పోయినా పెద్దఎత్తున కార్యకర్తలు తరలిరావడం చూస్తుంటే తెలంగాణలో పార్టీ బలం ఏమిటో తెలుస్తోంది. 20 ఏళ్లుగా అధికారంలో లేకున్నా కార్యకర్తల్లో అభిమానం, పట్టుదల ఉంది. తెలుగుజాతి ఉన్నంతవరకు తెలంగాణ గడ్డపై పసుపు జెండా ఎగురుతూనే ఉంటుంది. ఏపీలో పరిస్థితులను సెట్ చేసిన తర్వాత ఇక్కడకొస్తా" అని వివరించారు.

రేవంత్‌కు ప్రశంసలు

తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నారని చంద్రబాబు ప్రశంసించారు. ఉమ్మడి ఏపీలో దూరదృష్టితో తాను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ఆ తర్వాత వచ్చిన సీఎంలు కొనసాగించడం అభినందనీయమన్నారు. సైబరాబాద్ అభివృద్ధి ఫలాలు ఇప్పుడు యువతకు అందుతున్నాయన్నారు. తనను అక్రమంగా జైల్లో పెట్టినప్పుడు సంఘీభావంగా ఇక్కడ ఆందోళనలు నిర్వహించారని, ముఖ్యంగా గచ్చిబౌలిలో నిర్వహించిన సభను జీవితంలో మరచిపోలేనని చెప్పారు. "విభజన సమయానికి (2014లో) తలసరి ఆదాయం పరంగా చూస్తే ఏపీ కంటే 35 శాతం ముందంజలో తెలంగాణ ఉంది. 2014-19 వరకు ఏపీ సీఎంగా తాను పనిచేసిన సమయంలో ఈ వ్యత్యాసాన్ని 27.5శాతానికి తగ్గించాను. ఏపీలో గడచిన ఐదేళ్లలో విధ్వంస పాలన కారణంగా ఈ వ్యత్యాసం 44శాతానికి చేరింది. ఒకవేళ పొరపాటున మొన్నటి ఎన్నికల్లో కూటమి గెలువకపోతే ఈ వ్యత్యాసం వంద శాతానికి పెరిగేది" అని వ్యాఖ్యానించారు. తలసరి ఆదాయంలో గుజరాత్, మహారాష్ట్ర, కర్ణాటక కంటే తెలంగాణ(రూ.3,08,732) ముందంజలో ఉందని పేర్కొంటూ, ఏపీ తలసరి ఆదాయం రూ.2,19,518గా ఉందని వివరించారు.

చంద్రబాబు సారథ్యంలో నంబర్ వన్‌గా ఏపీ

» ఎల్వీఎస్ఆర్‌కే ప్రసాద్

హైదరాబాద్, జూలై 7(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి సారథ్యంలో ఆంధ్రప్రదేశ్, అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో నంబర్ వన్‌గా దూసుకెళ్లనుందని టీడీపీ జాతీయ మీడియా కమిటీ మాజీ చైర్మన్ ఎల్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ సీఎంగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబును ఆదివారం, ఆయన నివాసంలో కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు.

కూటమి విజయంలో భువనేశ్వరి కృషి

ఏపీలో కూటమి విజయంలో ఎన్టీఆర్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి కృషి ఉందని ఎల్.వి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ అన్నారు. ఆదివారం నారా భువనేశ్వరిని ప్రసాద్ మర్యాదపూర్వకంగా కలుసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఏపీలో నారా భువనేశ్వరి నిర్వహించిన నిజం గెలవాలి కార్యక్రమం ప్రజల్లో ప్రభావం చూపిందన్నారు. ఎన్టీఆర్ ట్రస్టు సారథ్య బాధ్యతలు నిర్వహిస్తూ ఆమె, వేలాది కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నారని ప్రసాద్ తెలిపారు.





హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం చంద్రబాబు, వేదికపై నందమూరి సుహాసిని తదితరులు, ఎన్టీఆర్ భవన్‌లో టీడీపీ కార్యకర్తల సందడి

సంక్షోభంలో ఇంధనం

(మొదటి పేజీ తరువాయి)



ఇష్టారాజ్యంగా అప్పులు చేశారు. యాజమాన్య నిర్వహణ లోపాలతో విద్యుత్ సంస్థలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. దీంతో విద్యుత్ రంగం పూర్తిగా కుదేలైంది. సాధారణంగా ఏ ప్రభుత్వమైనా తన పాలనాకాలంలోని విధానాలపై నిర్ణయాలను తీసుకుంటుంది. కానీ మాజీ ముఖ్యమంత్రి జగన్ మాత్రం తన హయాంలోనే కాకుండా తాను అధికారాన్ని చేపట్టక ముందు, తర్వాత కాలానికి కూడా అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకున్నారు. 2014-2019 కాలంలో వైసీపీ ప్రభుత్వం లేదు. కానీ ఆ కాలానికి సంబంధించి ట్రూఅప్ చార్జీల కింద రూ.3,669 కోట్లను ప్రజల నుంచి వసూలు చేశారు. ఒకవైపు విద్యుత్ చార్జీలు పెంచుకుంటూ పోతూ.. మరోవైపు థర్మల్ యూనిట్ల సామర్థ్యాన్ని పెంచకుండా, పెరిగిన డిమాండ్ పేరిట బయట నుంచి ఇబ్బడి ముబ్బడిగా అధిక ధరలకు విద్యుత్ కొనుగోలు చేశారు. మరోవైపు విద్యుత్ సబ్సిడీ మొత్తం రూ.14,000 కోట్లను డిస్కమ్‌లకు చెల్లించలేదు. వీటన్నింటిపైనా సోమవారం సీఎం చంద్రబాబు శ్వేతపత్రాన్ని విడుదల చేయనున్నారు. విద్యుత్ రంగాన్ని గాడినపెట్టి, పూర్వవైభవం తీసుకువచ్చేలా నిర్ణయాలు తీసుకోనున్నారు.

ఐదేళ్లూ బాదుడే బాదుడు

2019 ఎన్నికల ముందు జగన్ విద్యుత్ చార్జీలను పెంచనంటూ హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలకు నెలకు 200 యూనిట్ల దాకా ఉచితంగా ఇస్తామన్నారు. వ్యవసాయానికి పగటి పూట ఏకబిగిన తొమ్మిది గంటల విద్యుత్ ఇస్తానని హామీ ఇచ్చారు. కానీ అధికారంలోకి వచ్చాక మాట తప్పారు. వినియోగదారులు భరించలేనంతగా విద్యుత్ చార్జీలను బాదేశారు. 2020లో కరోనా కష్టకాలంలో నెలకు 500 యూనిట్ల వాడకం దాటిన వినియోగదారులపై యూనిట్‌కు 90 పైసలు చొప్పున రూ.1300 కోట్లను వసూలు చేశారు. ఇదే సమయంలో ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్న వారిపై శ్లాబుల మార్పు పేరిట రూ.1500 కోట్ల భారాన్ని వేశారు. 2021 ఏప్రిల్‌లో కిలోవాట్‌కు పది రూపాయలు పెంచడం ద్వారా రూ.3,542 కోట్ల భారాన్ని వేశారు. అంతకుముందు తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో 2014-19 మధ్యకాలంలో వాడిన విద్యుత్‌పై ట్రూఅప్ పేరిట రూ.3,669 కోట్లను వసూలు చేశారు. 2022లో శ్లాబులు కుదించేసి రూ.3,900 కోట్లను వసూలు చేశారు. ఫ్యూయల్, ఇంధన కొనుగోళ్ల సర్దుబాటు పేరిట రూ.700 కోట్లు వసూలు చేశారు. అదేవిధంగా 2021లో ఇంధన కొనుగోళ్ల సర్దుబాటు పేరిట మరో రూ.3,082 కోట్లను జనం నెత్తిన జగన్ వేశారు. 2023 మేలో మరోసారి ఇంధన సర్దుబాటు పేరిట రూ.400కోట్లు బాదేశారు.

వేలాడుతున్న 'ట్రూఅప్' కత్తి

2022-23లో రూ.8,114 కోట్లు, 2023-24లో రూ.9,023 కోట్లు.. మొత్తంగా రూ.17,137 కోట్లను ట్రూఅప్ కింద వసూలు చేసుకునేందుకు ఆమోదం తెలపాలంటూ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ)ని డిస్కమ్‌లు కోరాయి. వాస్తవానికి డిస్కమ్‌లు ప్రతిపాదనలు పంపిన 120 రోజుల్లోగా వాటిపై ఈఆర్‌సీ నిర్ణయం తీసుకోవాలి. కానీ అప్పటికే జగన్ సర్కారు ఎడాపెడా చార్జీలు పెంచేయడంతో జనం భయపడతారని భావించేమో కానీ నిర్ణయం తీసుకోలేదు. పెండింగ్‌లో ఉన్న రూ.17,137 కోట్ల ట్రూఅప్ ప్రతిపాదనలపై ఇప్పుడు ఏక్షణంలోనైనా ఈఆర్‌సీ నిర్ణయం తీసుకునే వీలుందని ఇంధన రంగ నిపుణులు చెబుతున్నారు. ట్రూఅప్‌పై ఈఆర్‌సీ ఆదేశిస్తే దానిని ప్రభుత్వం అమలు చేయాల్సిందే. చార్జీలు పెంచుకునేందుకు డిస్కమ్‌లకు అవకాశం ఇస్తే కూటమి ప్రభుత్వం ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది. ఒకవేళ ప్రజల నుంచి వసూలు చేయకుండా ప్రభుత్వమే భరిస్తానంటే.. ఇప్పటికే ఆర్థిక సంక్షోభంలో ఉన్న ప్రభుత్వంపై మోయలేనంత భారం పడుతుంది.

ఎడాపెడా కొనుగోళ్లు

గతంలో జగన్ ప్రతిపక్షంలో ఉండగా.. అధిక ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేస్తూ కమీషన్ల కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారంటూ చంద్రబాబుపై ఆరోపణలు గుప్పించారు. 2014-15లో యూనిట్‌కు రూ.3.79 చొప్పున చంద్రబాబు హయాంలో డిస్కమ్‌లు కొనుగోలు చేశాయి. 2018-19లో యూనిట్ రూ.4.06 చొప్పున డిస్కమ్‌లు సేకరించాయి. ఈ విద్యుత్ కొనుగోళ్లలో అవినీతి జరిగిపోయిందంటూ జగన్ ఆరోపణలు చేశారు. కానీ జగన్ అధికారంలోకి వచ్చాక అంతకు రెట్టింపు ధరలకు విద్యుత్‌ను కొనుగోలు చేశారు. సగటున యూనిట్‌కు రూ.7.61 చొప్పున కొనుగోలు చేశారు. అవసరాల పేరిట యూనిట్ విద్యుత్‌కు రూ.29 నుంచి రూ.35 దాకా కూడా జగన్ ఏలుబడిలో చెల్లించారు. విద్యుత్ కొనుగోళ్ల ధర యూనిట్‌కు రూ.10కి మించకూడదని ఈఆర్‌సీ ఆదేశాలు జారీ చేస్తే తప్ప కొనుగోళ్ల ధరలు నియంత్రణలోకి రాలేదు.

షిర్డీసాయికి పండగ

జగన్‌కు బంధువైన షిర్డీ సాయి ఎలక్ట్రికల్స్ విశ్వేశ్వర రెడ్డికి భారీగా లబ్ధిచేకూర్చారు. గత ఐదేళ్లలో ఆ సంస్థకు అనుకూలంగా పలు నిర్ణయాలు తీసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, స్మార్ట్ మీటర్లు కొనుగోలు సహా పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాలకు అనుమతులు ఇచ్చారు. అదేవిధంగా సోలార్, విండ్ విద్యుత్కేంద్రాల స్థాపనకూ అనుమతులు ఇచ్చేశారు.

భారీ నష్టాలు

జగన్ జమానాలో విద్యుత్ రంగంలో నష్టాలు పెరుగుతూ వచ్చాయి. 2014-15 నాటికి రూ.6,625 కోట్లు నష్టాలు ఉండగా, 2023-24 నాటికి రూ.34,390 కోట్లకు పెరిగాయి. స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు కూడా భారీగానే పెరిగింది. రాష్ట్రంలో కొత్తగా పరిశ్రమలు రాకపోయినా, వాణిజ్య సంస్థలు పెరగకపోయినా విద్యుత్ కొనుగోళ్లు పెరిగాయి. 2013-14లో 1291 మిలియన్ యూనిట్లు మాత్రమే బహిరంగ మార్కెట్లో కొనుగోలు చేసిన డిస్కమ్‌లు.. 2023-24 నాటికి 11,655 మిలియన్ యూనిట్లు కొనుగోలు చేయడంపై నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. విద్యుత్ ప్రవాహం పక్కదోవపడుతూ జగన్ అస్మదీయుల పరిశ్రమల్లోకి అనధికారికంగా సరఫరా చేయడం వల్లే ఇంత ఎక్కువ కొనాల్సి వచ్చిందంటూ అప్పట్లో నిపుణులు అనుమానాలు వ్యక్తం చేశారు.

అదానీ కోసం.. జనంపై భారం

అదానీ సంస్థకు ప్రయోజనం చేకూర్చేలా గతంలో జగన్ సర్కారు పలు నిర్ణయాలు తీసుకుంది. గృహ, పరిశ్రమలకు స్మార్ట్ మీటర్లను బిగించేందుకు అదానీ సంస్థతో డిస్కమ్‌లు ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఒక్కో మీటరుపై వినియోగదారుడిపై రూ.12,000 భారం పడేలా నిర్ణయించారు. అంతేగాక విద్యుత్ పంపిణీ సంస్థలపై రూ.14,000 కోట్ల రుణభారం పడనుంది. అదానీకి మేలు చేసేలా రాష్ట్రంలోని ప్రధాన రిజర్వాయర్లను అప్పగిస్తూ పంప్డ్ స్టోరేజీ జల విద్యుత్కేంద్రాలను కూడా కట్టబెట్టేశారు. ట్రాన్స్‌మిషన్ విద్యుత్ లైన్ల బిగింపులోనూ అదానీ చొరబడేలా చూశారు. రాజస్థాన్‌లో అదానీ ఉత్పత్తి చేస్తున్న సోలార్ విద్యుత్‌ను సెకీ ద్వారా 7,000 మెగావాట్లను కొనుగోలు చేసేందుకు 25 ఏళ్ల కాలానికి డిస్కమ్‌లు ఒప్పందాలు చేసుకున్నాయి. ఈ ఒప్పందం విలువ లక్ష కోట్ల రూపాయలకు పైగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు.



అదానీ కోసం దోచిపెట్టారు

» జనంపైనే స్మార్ట్ మీటర్ల భారం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

పట్టణ ప్రాంతాల్లో 24.4 లక్షల స్మార్ట్ మీటర్లను బిగించే బాధ్యతను అదానీ సంస్థకు నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అప్పగించారు. రాష్ట్రంలో సహజ వనరులు, పోర్టులు సహా ఇతర కాంట్రాక్టులన్నీ అదానీకే కట్టబెట్టారు. అదే దారిలో.. ఇప్పటికిప్పుడు అవసరం లేకున్నా.. విద్యుత్ పంపిణీ నష్టాల నివారణ పేరిట రాష్ట్రంలో వ్యవసాయ, గృహ, పారిశ్రామిక రంగాల్లో స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కేంద్రం రీవ్యాంప్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ సిస్టమ్ (ఆర్‌డీఎస్ఎస్) పథకం కింద స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేయమందన్న సాకు చూపి .. హడావుడిగా టెండర్లు పిలిచారు. ఇందులో కూడా.. ఓపెన్ యాక్సెస్ విధానంలో కాకుండా పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్(పీఎఫ్‌సీ)లో నమోదైన విద్యుత్ మీటర్ల తయారీ సంస్థలు మాత్రమే బిడ్‌లో పాల్గొనేలా నిబంధనలు పెట్టారు. జగన్‌కు సన్నిహితులైన అదానీ, షిర్డీ సాయి సంస్థలు పీఎఫ్‌సీలో ఎన్‌రోల్ అయ్యేలా ప్లాన్ చేశారు. ఎన్‌రోల్ కాని మీటర్ల ఉత్పత్తిదారులెవరూ బిడ్‌లో పాల్గొనకుండా చేశారు. ఈ బిడ్డింగ్‌పై ఎన్నో ఆరోపణలు, విమర్శలు వచ్చినా గుట్టుగా చక్కబెట్టేశారు. బిడ్లు వేసిన రెండు సంస్థల మధ్య మధ్యవర్తిత్వం నెరపి.. గ్రామీణ ప్రాంతంలో వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లను బిగించే బాధ్యతను షిర్డీసాయికి.. పట్టణ ప్రాంతాల్లో గృహాలు, పారిశ్రామిక సంస్థలకు స్మార్ట్ మీటర్లను బిగించే బాధ్యతలను అదానీకి కట్టబెట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ మీటర్లకు అయ్యే వ్యయాన్ని ప్రభుత్వమే భరిస్తుంది. పట్టణ ప్రాంతాల్లో గృహాలకు బిగించే 24.4 లక్షలు, పరిశ్రమలకు చెందిన 9.2 లక్షల స్మార్ట్ మీటర్ల భారం మాత్రం విద్యుత్ వినియోగదారులపైనే వేశారు.

పట్టణ వినియోగదారులపై భారం..

గృహాలకు బిగించే స్మార్ట్ మీటర్ ధరను రూ.2,900గా డిస్కంలు ఖరారు చేశాయి. ఇందులో రూ.900ను ముందస్తుగా ఒక్కో వినియోగదారుడి నుంచి నెలవారీ బిల్లుతో పాటు వసూలు చేస్తాయి. మిగిలిన రూ.2,000ను 93 నెలవారీ వాయిదాల్లో వసూలు చేయాలని నిర్ణయించాయి. నెలకు రూ.86 చొప్పున 93 నెలల్లో రూ.7,998 చొప్పున వసూలు చేస్తాయి. విద్యుత్ మీటర్ల ఆపరేషన్స్ కోసం నెలకు రూ.50 చొప్పున 93 నెలల పాటు వసూలు చేసే రూ.4,650 ఇందులోనే ఉంటుంది. అంటే రూ.7,998 నుంచి ఆపరేషన్ చార్జీలు తీసేస్తే రూ.2,304 మిగులుతుంది. మీటరు అసలు ధర రూ.2,900లో రూ.900ని ముందే వసూలు చేస్తారు. మిగతా 2 వేలను మాత్రమే వసూలు చేయాల్సి ఉండగా.. రూ.2,304 వసూలు చేసేయాలని నిశ్చయించారు. అంటే.. ఒక్కో మీటరుపై రూ.304 ఎక్కువ. మొత్తంగా 24.4 లక్షల మీటర్లపై లెక్కిస్తే రూ.73 కోట్లు అధికంగా డిస్కంలు వసూలు చేసి అదానీకి లబ్ధి చేకూర్చనున్నాయి.

పరిశ్రమలపై రూ.456 కోట్లు..

గృహ వినియోగ స్మార్ట్ మీటరు ధర రూ.2,900 కాగా.. పారిశ్రామిక మీటరుకు రూ.4,000గా నిర్ణయించారు. ఈ మీటర్లకు కూడా రూ.900ను అడ్వాన్సుగా తీసుకుంటారు. మిగతా రూ.3,100ను 93 నెలసరి వాయిదాల్లో వసూలు చేస్తారు. నెలకు రూ.176 చొప్పున 93 నెలల పాటు రూ.16,368 వసూలు చేస్తారు. ఇందులో ఆపరేషన్ చార్జీల మొత్తం 4,650 (నెలకు రూ.50 చొప్పున 93 నెలలు) తీసివేస్తే రూ.8,066 మిగులుతుంది. మీటరు వాస్తవ ధర రూ.4,000 నుంచి అడ్వాన్సుగా చెల్లించిన రూ.900 తీసేస్తే .. ఇంకా రూ.3,100 మాత్రమే చెల్లించాలి. కానీ రూ.8,066 వసూలు చేయాలని నిర్ణయించారు. అంటే.. పరిశ్రమల నుంచి అదనంగా రూ.4,966 వసూలు చేస్తారు. ఈ లెక్కన 9.2 లక్షల పారిశ్రామిక మీటర్లపై రూ.456 కోట్లు అదనంగా వసూలు చేస్తారన్న మాట. గృహ విద్యుత్ స్మార్టు మీటర్లపై వసూలు చేసే రూ.73 కోట్లను కూడా కలిపితే ఏకంగా 529 కోట్లను అధికంగా వసూలు చేసి అదానీకి కట్టబెట్టాలని డిస్కంలు నిర్ణయించడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ వసూళ్లపై తక్షణమే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టి సారించాలని విద్యుత్ రంగ నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

తెలుగువారి హృదయాల్లో చెరగని ముద్ర వైఎస్సార్

అప్పుడు - ఇప్పుడు - ఎప్పుడూ వైఎస్సార్ అజెండా
ఎగిరే కాంగ్రెస్ మువ్వన్నెల జెండా



శ్రీ రాజీవ్ గాంధీ
పులివెందుల, 1982











కొందరు కొన్నాళ్ళు ఉండి... పోతారు. కొందరు శాశ్వతంగా ఉండిపోతారు.

శ్రీమతి ఇందిరాగాంధీ ఏఐసిసి అధ్యక్షురాలిగా ఉండగా వైఎస్సార్ 1983లో పిసిసి అధ్యక్షుడు.

రాహుల్ గాంధీని ప్రధానిగా చూడాలని మనసా, వాచా, కర్మణా కోరుకున్న వైఎస్సార్

2024 జూలై 8న మహా నేత వైఎస్సార్ 75వ జయంతి

ఇట్లు
వైఎస్సార్ ఆత్మ బంధువులు